భాగవతకథాసారము

ఏలూరు, 1924

Record no. 699

Bhāgavatakathāsāramu

Ēlūru, 1924

Record no. 699

Bibliographic Record Target

భాగవతకథాసారము / ఇది గరిమళ్ళ సోమన్న పంతులు ఆనూకితము.- ఏలూరు : రామా అండ్ కో., 1924.

149, xxiv p. ;18 cm.

Record no. 699

Bhāgavatakathāsāramu / idi Garimaḷḷa Sōmanna pantulu ānūkitamu.- Ēlūru : Rāmā aṃḍ Kō., 1924.

149, xxiv p. ;18 cm.

Record no. 699

Rama & Co., School Series No. 89.

Bhagavata Katha Saram.

SUPERVISED BY

VIDWAN G. SOMANNA GARU, M. A., L. T.;

RAMA & Co.,
Ellore.

RAMAPRESS, ELLORE.

1924.

100

[Price As. 12.

విషయసూచిక.

భాగవతకథాసారము.

ఇది

శ్రీవిద్వాన్ గరిమెళ్ళ సోమన్న పంతులు, ఎం. ఏ., ఎల్. టి.

అనూకితము.

పబ్లిషర్సు :-

రామా అండ్ కో,

హెడ్డాఫీసు:-ఏలూరు, కృష్ణాజిల్లా.

ఏలూరు, రామాముద్రాక్షరశాలా ముద్రితము.

1924 జూలై.

[వెల 12 అణాలు.

పీఠిక.

భక్తిజ్ఞాన వైరాగ్యముల బోధకు గనియగు శ్రీమద్భాగవతము సాటిలేని యుత్తమగ్రంథము. అందలి తత్త్వవిచారము మహాశ్చర్యకరము. అందు వర్ణింపఁబడిన పుణ్యశ్లోకుల చరితములు పావనములు.

ఈ పవిత్రగ్రంథ స్వరూపము మనబడులలోని బాలురకును, బాలికలకును గోచరమగుట శ్రేయస్కరము. మూలగ్రంథమునందలి వేదాంతచర్చల సంగ్రహరూపముగఁ బొందుపఱుప నలవిగాదు. కాని యందలి పుణ్యపురుషులయు, నుత్తమ స్త్రీలయు వృత్తాంతములను గొంతవఱకు సంక్షేపముగఁ దెలుపనగును.

ఈ పుస్తకమునందలి కథలు సుప్రసిద్ధ భాగవతులను లోకోద్ధారకులను గురించినవి కావున నాదరణీయములు.

గుంటూరు.
17-8-19

K. సోమన్న,
ఎం. ఏ. ఎల్. టి.

శ్రీగురుభ్యోనమః.

అవిఘ్నమస్తు.

భాగవతకథాసారము.

1. పరీక్షిన్మహారాజు.

పూర్వము పాండవులకును, కౌరవులకును గొప్ప యుద్ధము జరిగెను. దీనినే భారతయుద్ధ మందురు. ఆ యుద్ధమునఁ బాండవులు జయమొందిరి. కౌరవుల సేనలోఁ జివఱకు మిగిలియున్నవారిలో నశ్వత్థామ యను నతఁడు రాత్రివేళ శిబిరములలో నిదురించుచుండిన పాండవ బలమును నిర్మూలము చేసెను. అందుఁ బాండవుల కుమారులందఱునుగూడఁ జంపఁబడిరి. పాండవులు కుపితులై యశ్వత్థామపైకి యుద్ధమునకుఁ బోయిరి. కృష్ణుఁడుగూడఁ బార్థసారథియై యుండెను. అశ్వత్థామ „అపాండవముగుఁగాక" యని బ్రహ్మశిరోనామకాస్త్రమును బ్రయోగించెను. పాండవమధ్యముఁడు గూడ నా యస్త్రమునే ప్రయోగించెను. రెండస్త్రములు నొండొంటిం దాకిమండుచు లోకములకుఁ గీడొనరింపసాగెను.

మునులు మధ్యవర్తులై నిలిచి యస్త్రముల నుపసంహ
రింపుఁ డని యిరువురకుఁ జెప్పిరి. పాండవ మధ్యముఁడు తన
యస్త్రమును వారించెను. అశ్వత్థామ తన యస్త్రము నుప
సంహరించు మార్గము నెఱుంగక, పాండవులను విడిచి పాండ
వేయదారల గర్భంబుల భస్మము సేయుఁగాక ! యని యస్త్ర
మును బ్రజ్వలింపఁజేసెను. భగవంతుఁడగు శ్రీకృష్ణుఁడుత్తరా
గర్భమున కభయమిచ్చి యశ్వత్థామను శపించెను.

ఉత్తర యభిమన్యుని భార్య. అర్జునుని కోడలు.
విరటుని కూఁతురు. ఈపె భర్తయగు నభిమన్యుఁడు భారత
యుద్ధమున మరణించెను. అప్పటి కామె గర్భవతియై యుండెను.

గర్భములోనున్న శిశు వశ్వత్థామచేఁ బ్రయోగింపఁ
బడిన బ్రహ్మాస్త్రమువలన బాధపడుచుఁ గృష్ణుని వరప్రభావ
మున జీవములఁ బాయజాలక కృశించి వేదనఁబడుచుండెను.
మాసములు నిండినకొలఁది బాణానలతప్తదేహుఁడై,

ఉ. ఉయ్యాడ శక్తిలే దుదరగోళములోపలనున్నవాఁడ ది
క్కెయ్యది? తాననాథనని యెవ్వఁడుఁ దల్లిగణింప విందు నేఁ
డియ్యిషువహ్ని వాయుటకు నెయ్యది మార్గ మునన్నుఁ గావనే
యయ్యగలండు? గర్భజనితాపద నెవ్వఁడెఱుంగు? దైవమా!

అని కడుం జింతిలుచున్న శిశువు నెడఁ గరుణఁ బూని
యాదిదేవుం డంగుష్ఠమాత్రశరీరుండై గర్భంబు సొచ్చి తనచేతి
గదచే శిశు శరీరమునకు రక్షయొసంగి విప్రబాణవేదనంబును

దొలఁగించి యంతర్హితుం డయ్యెను. ఉత్తర యొక శుభ
లగ్నంబునఁ బ్రసవించి యధిక తేజస్వియగు పుత్త్రుంగనియెను.
ఆకుమారునకుఁ బూర్వజ్ఞానము గలిగి,

క. తనతల్లికడుపులోపల
మును జూచినవిభుఁడు విశ్వమున నెల్లఁ గలం
డనుచుఁ బరీక్షింపఁగ జను
లనఘుఁ బరీక్షిన్నరేంద్రుఁ డనిరి ధరిత్రిన్.

ఇట్లు పరీక్షిన్నామమును ధరించి సకల విద్యాపారం
గతుండై రాజ్యమున కధిపతియై యక్కుమారుఁడు తాతయగు
ధర్మరాజుం బోలె రాజ్యంబు నేలుచుఁ దన దేశంబునఁ గలి
యధర్మప్రవర్తనంబును బురికొల్పుచున్నాఁడని విని కతిపయ
సైన్యంబులం గొని ధర్మస్థాపనార్థము సైన్యములతో నన్ని
దిక్కులం గలయం దిరుగుచుండెను.

ఒక్కనాఁడు పూర్వవాహిని యగు సరస్వతీనదీతీరం
బున ధర్మదేవత వృషభరూపమును దాల్చి "సత్య" మను నేక
పాదంబునఁ దిరుగుచు గోరూపధారిణియై యేడ్చుచున్న భూదే
విని జూచి యిట్లనియె.

మ. "నయనాంభఃకణజాల మేలవిడువన్? నాతల్లి! నీమేను సా
మయమై యుండదు మోము వాడినది నీమన్నించు చుట్టాలకున్
భయదుఃఖంబులు నేడు వొందవుగదా! బంధించి శూద్రుల్ పద
త్రయహీనున్ ననుఁబట్ట వత్తురని యో! తాపంబు నీ కేటికిన్.

మఱి యే కారణంబున నీ వేడ్చుచుంటివో నిక్కం
బెఱింగింపు '' మని యడిగెను.

ఆ గోవు "లోకరక్షకుండగు శ్రీకృష్ణుం డవతారమును
జాలించెను. కలియుగము ప్రవేశించెను. ధర్మమూర్తివగు
నీవు సత్యైకపాదుండవై సంచరింపవలసి వచ్చెను.

క. దేవతలకు ఋషులకుఁ బితృ
దేవతలకు నాకు నీకు ధీరులకును నా
నావర్ణాశ్రమములకును
గోవులకును బాధ యనుచు గుందెద ననఘా ! ''

అని ప్రత్యుత్తరమిచ్చునమయంబునఁ గలి పురుషుఁడు
కైతవరాజవేషముతో వచ్చి యాపశుయుగ్మమును గాలితోఁ
దన్నెను. అప్పటికే యచ్చటికి వచ్చియున్న పరీక్షిన్నరేంద్రుఁ
డా దుండగమును జూచి కోపారుణనేత్రుఁడై పండ్లు పటపటం
గీటి కైదండం గీలించియున్న కోదండంబుదీసి యెక్కువెట్టి
మేఘగంభీర రవంబులగు వచనంబులతో నిట్లనియె.

శా. " నిన్నుం గొమ్ములఁ జిమ్మెనో
కదిసెనో నిర్భీతివై గోవులం
దన్నం గారణమేమి ? మద్భుజ
సనాథక్షోణినే వేళలం
దు న్నేరంబులు సేయ రా
దెఱుఁగవా ? ఘూర్ణత్వమున్ భూమిభృ

త్సన్నాహంబు నొనర్చ దెవ్వఁడవు ?
నిన్ శాసించెదఁ దుర్మతీ ! ''

అని కంఠంబును నఱకుట కుఱుకుటం జూచి కలి
భీతుండై శరణంబు వేఁడెను. శరణాగత రక్షణ దక్షుండగు
పరీక్షిన్నరేంద్రుండు వాని శిక్షింపక తనదేశంబునుండి వెడలి
పొమ్మనెను. కలి తన కిర విమ్మని వేఁడ నతనికిఁ బ్రాణివధ,
స్త్రీ, ద్యూత, పాన, అనత్య, మద, కామ, హింస, వైరంబు
లనియెడు తొమ్మిది స్థానంబుల నొసంగెను. ధర్మదేవతం బుజ్జ
గించి మున్ను హీనంబులైయున్న తపము శౌచము దయ
లనియెడు మూఁడు పాదంబులంగూడ నొసంగి భూదేవికి
సంతోషమును గూర్చెను.

తఱువాతఁ గొంతకాలమునకు భూకాంతుఁడు గాంతా
రమ్మునకు వేఁటాడఁబోయి వనమృగంబులం బట్టి నిశ్శేషం
బుగ వధించి కడు నాయాసంబు నంది చల్లని నీరంబుల కొఱ
కతిదూరంబు గలయం ద్రిమ్మరి యెందునుం గానక శమీక
మహాముని యాశ్రమంబునకుఁ బోయి కలశంబులోని జలం
బుల నొసంగి ప్రాణంబులఁ గాపాడుమని తపస్సమాధి నధి
వసించియున్న జడదారి ననేక విధంబులం బ్రార్థించెను.
అతఁడు హరిపాదలగ్నమానసుండై బహిరింద్రియ మాధ్యము
గాంచియుండుటంజేసి బదులు సెప్పకుండెను. రాజు ఘన
పిపాసార్తిచేఁ జిత్తవిభ్రమ మంది వాని మానంబునకుఁ గట

కటంబడి వింటికొమ్మున నొక్క మృతసర్పంబును జిమ్మి మరలిపోయెను. ఆ సర్పశవము మునీశ్వరుని మూఁపుపైనఁ బడెను. మునిశిష్యులు గొందఱా ముని మూఁపునఁ బడిన సర్పమును జూచి భీతిల్లి పరుగెత్తి శమీకపుత్రుం డగు శృంగితోఁ జెప్పిరి. అతఁడు గోపించి,

ఉ. ఆతఁడు తన్ను దూషణము లాశ్రమవాసులగాని వైగులం
గూడఁడుకందమూలములు గూడుగఁదించు సమాధినిష్ఠుఁడై
వీడఁడులోనిచూపులను విష్ణునిదక్కఁ బరప్రపంచముం
జూడఁడు మద్గురుండు ఫణిఁజుట్టఁగ నేటికి రాచవానికిన్.

అని నిష్ఠురంబులాడుచుఁ గందిన మనంబుతోఁ గౌశికీ నదికిం జని తజ్జలంబుల నంజలింబట్టి సహపాఠులుసూచుచుండ,

ఉ. ,,ఓడకవింటికొపునమృతోరగముంగొనివచ్చి మాఱుమా
టాడక యున్న మజ్జనకు నంసతలంబునఁ బెట్టి దుర్మద
క్రీడఁ జరించు రాజు హరకేశవు లొడ్డిననైనఁ జచ్చుఁ బో
యేడవనాఁడు తక్షక ఫణీంద్రవిషానల హేతిసంహతిన్ ''

అని శృంగి పరీక్షన్నరేంద్రుని శపించి నిజాశ్రమంబునకు వచ్చెను. ఆతనితండ్రియగు శమీకుండు యోగనిద్ర నుండి మేల్కని యొడలు సవరించుకొనుచోఁ జేతికిఁ దగిలిన మృతసర్పమునుఁ దీసి యావలఁ బాఱవైచి "యాయురగము మెడపై కెట్లు రాఁ గలిగె '' నని యాశ్చర్య పడుచుండెను. ఇంతలో శృంగి తన తండ్రికి నమస్కరించి రాజుచేసిన దుండ

గపుఁ బనియుఁ దాను శపించిన విధంబును దెలిపెను. శాంతమూర్తి యగు శమీకమహాముని తన తనయుఁడు రాజున కిచ్చిన క్రూరశాపంబునకు వగచుచుఁ దనయుని మందలించి రాజునకా శాపవృత్తాంతమునుఁ దెలియఁ జేసెను. పరీక్షితుఁడు శాపప్రకారమును విని చేయునది లేక,

ఉ. ,,ఏటికి వేఁటవోయితి మునీంద్రుఁడుగాఢ సమాధినుండగా
నేటికిఁ దద్భుజాగ్రహమున నేసితి సర్పశవంబు దెచ్చి నే
నేటికిఁ బాపసాహసము లీక్రియఁ జేసితి దైవయోగమున్
దాఁటగరాదు వేగిరమ తథ్యముకీడు జనించుఘోరమై.

అని కొంత తడవు విచారించి ధీరతంబూని యైహిక సుఖంబులందు విరాగముగాంచి శాపవిధినిఁ దనకుఁ గలిగి యున్న యేడుదినముల జీవితకాలములోఁ బరసౌఖ్యప్రదమగు భగవద్విచారము సేయ నిశ్చయించికొని గంగాతీరమ్మునకుఁ బోయి శుకమహాముని యనుగ్రహమ్మున భారతభాగవతాది పుణ్యకథా శ్రవణంబుఁ జేయుచుండెను. ఆ సమయంబున నెందఱో మునిపుంగవులును జుట్టములును మిత్రులును పరీక్షితుని జూడవచ్చి పరామర్శలు సేయుచుండిరి. శుకయోగి మాత్రము రాజసన్నిధిన యుండి,

ఉ. ,,ఏనుమృతుండనౌదునని యింతభయంబుమనంబులోపలన్
మానుము; సంభవంబుగలమానవకోట్లకుఁ జావునిత్యమౌఁ
గాన హరిం దలంపు మికఁ గల్గదు జన్మము నీకు ధాత్రిపై
మానవనాథ! పొందెదవుమాధవలోక నివాససౌఖ్యముల్.

అని జ్ఞానోపదేశము సేయుచుండెను. శృంగిశాపచోదితుండై తక్షకుఁడు భూసురరూపంబున నేడవనాఁడు పరీక్షితుని కడ కరుగుచుండఁగా దోవలోఁ గాశ్యపుండను నొక్క విప్రుండు గన్పడెను. అతఁడు సర్పవిషహరణ సమర్థుండు. ఆ బ్రాహ్మణుఁడు మంత్రి జనప్రోత్సాహితుఁడై పరీక్షితునిరక్షించుటకుఁ బోవుచుండెను. తక్షకుఁ డావిప్రుని సామర్థ్యంబు నెఱింగిన వాఁడగుటం జేసి యతని నపరిమిత ధనమునిచ్చి తృప్తుం గావించి రాజసముఖమ్మునకు రాకుండునట్లొనరించి తాను వేగంబుగఁ బోయి రాజున కొక్క ఫలంబు నొసంగెను. అతఁడా ఫలమును గ్రహించి కర్మవశంబున నించుక భగవద్ధ్యానవిముఖుండై యా ఫలంబు నాస్వాదించెను. అందుండి యొక్క క్రిమి బయల్వెడలి క్రమక్రమముగఁ బెఱిగి యందఱుఁ జూచుచుండఁగనే గొప్పసర్పంబై రాజుం గఱచిన నతఁడు విషాగ్నిచే భస్మీభూతుఁడయ్యెను.

పరీక్షిన్నరపాలుని మరణంబున కతని కుమారుఁ డగు జనమేజయుండు విలపించుచుండెను. అఖిలమునులును సురలును హాహారవంబులు సేసిరి. జనమేజయుఁడు కుపితుఁడై సర్పప్రళయం బగునట్లు యజ్ఞము సేయుట కారంభించెను. మంత్రబలమ్మున సహస్ర సంఖ్యలు గల సర్పంబులు యజ్ఞకుండంబునఁబడి హతంబులయ్యెను. తక్షకుఁడుభీతుఁడై యింద్రలోకమునకుఁ బోయి దేవేంద్రుని మాటునుండెను. ఆ విష

యము జనమేజయుఁడెఱింగి "సహేంద్రతక్షకాయస్వాహా" యను వాక్యము నుచ్చరించి ఘృతము నగ్నిలో విడిచెను. ఇంద్రుండు తక్షకునితోఁ గలిసి స్థానభ్రంశము నొంది పడుచుండెను.

ఇంతలో జనమేజయుని గురు వగు నాంగిరసుండువచ్చి జనమేజయుని బహుభంగులఁ గీర్తించి,

చ. "మృతియును జీవనంబు నివి మేదినిలోపల జీవకోటికిన్
సతతము సంభవించు సహజం బిది చోరహుతాశసర్పసం
హతులను దప్పి నాఁకటను బంచత నొందెడు నట్టిజీవుఁడా
పదలనుగుంది పూర్వమగుపాపఫలంబు భుజించునెప్పుడున్.

కావున నసంఖ్యాకంబు లైన సర్పంబులు హతంబు లయ్యెను. శాంతమానసుండవై క్రోధంబు వర్జించి యింద్రతక్షకులను గావు" మని చెప్పెను. గురూపదేశంబును శిరంబునఁ దాల్చి జనమేజయుఁడు సర్పయాగంబు మాని మంత్రి సమేతుండై కరినగరంబుం బ్రవేశించి శ్రీహరి భక్తియుఁ, బ్రజానురక్తియు, ధర్మకార్యాసక్తియుఁ గలిగి రాజ్యంబును బూజ్యంబుగఁ బాలించుచుండెను.

2. ధ్రువుఁడు.

స్వాయంభువమనువు కుమారుం డగు నుత్తానపాదుం డను భూకాంతుండు ధరా పరిపాలనం బొనర్చుచుండెను. అతఁడు సునీతియు, సురుచియు నను నిరువురు కాంతలం బెండ్లియాడెను. సునీతియందు ధ్రువుఁడును, సురుచియం దుత్తముఁ డనెడు కుమారు లుదయించిరి. రాజునకు సురుచియెడ నధికానురాగము గలిగియుండెను. ఆమె ప్రేరణమున సునీతియం దసూయ గలిగి యాపెను ధ్రువునిఁ బ్రత్యేకగృహమ్మున నునిచెను. ఒక్కనాఁడు రాజు సురుచిపుత్త్రుండగు నుత్తముని దన తొడపై నిడికొని ముద్దులాడుచుఁ బ్రియభార్యతో ముచ్చట లాడుచుండఁగా ధ్రువుం డట కరుదెంచి తాను గూడఁ దండ్రితొడపైఁ గూర్చుండ నుద్యమించెను. రాజు వాని ననాదరము చేసెను. సురుచి గర్వించి,

తే. గీ. "తండ్రితొడ నెక్కు వేడుక దగిలెనేనిఁ
బూని నాగర్భమున నాఁడ పుట్టకన్య
కర్భమునఁ బుట్టి కోరినఁ గలదె నేఁడు
జనకు తొడయెక్కు భాగ్యంబు సవతికొడుక'!

అని యెల్లిదములాడి మఱియు, 'నీవు పుండరీకాక్షుని యనుగ్రహము వడసి నా కడుపునఁ బుట్టునట్లు వరము గొనుము. అప్పుడు తండ్రితొడ నెక్కుభాగ్యంబు నీకుఁగలుగుఁ' నని చెప్పెను.

ధ్రువుండు వయసున నైదేండ్ల బాలుఁడయ్యును సుక్షత్త్రియ వంశజాతుఁ డగుటం జేసి రోషమొంది యవమానమునఁ గలిగిన దుఃఖముచేఁ గన్నీరుఁ గార్చుచుఁ దల్లికడకు వచ్చి జరిగిన వృత్తాంతము నామెతోఁ జెప్పెను. ఆమెయుఁ గొడుకు దీనతకు జాలి నొంది చేయునది లేక ,, నాయనా! నీదైన్యమును బరమాత్ముఁ డగు భగవంతుడే పోఁగొట్టవలెను. అన్యులు శత్త్రులుగా '' రని చెప్పి పైట చెఱఁగునఁ గన్నీరు దుడిచెను.

తల్లు లిద్దఱు నొక్క విధముననే యుపదేశించినందు వలన బాలుండగు ధ్రువుండు హరి యనుగ్రహమును బడయుటకుఁ బయనమై యెవ్వరికినిఁ జెప్పక యడవులం బడి యొంటిగాఁ బోవుచుండెను. త్రోవలో నారదమహాముని యతనికి బ్రత్యక్షమై ,,నీవెందుబోవుచుంటి''వని యబ్బాలు నడిగెను. ఆకుమారుఁడు ,,దేవా! నాసవతి తల్లిచేఁ గలిగిన యవమానంబు హరికృప నంది పోఁగొట్టుకొనుట కేఁగుచుంటిని. మీరు పెద్దలు. నా కా హరిఁ గాంచు మార్గమును జెప్పుఁ '' డని వేఁడెను. వాని ముద్దుమాటలకు మనంబునఁ బ్రియంబు నందియు నతని చిత్తస్థైర్యమును బరీక్షించుటకు నారదుఁ డిట్లనెను.

క. ,, విను పుత్త్రక! బాలుఁడవై
యనయంబును గ్రీడలందు నాసక్తమనం

బునఁ దిరిగెదు నిక్కాలం
బున నీకవమానమానములు లేవెందున్."

కావునఁ బురంబునకుఁ బోయి జననీజనకుల యాజ్ఞల మెలంగుము. అన్నపానాదుల వర్జించి యాకలములఁ దినుచు నెండవానలకోర్చి తపంబుఁ గావించెడు మునులకుఁ గూడ హరికృపఁ గాంచు పని దుస్సాధ్యముగ నున్నది. బాలుండ వగు నీ కయ్యది లభించు టెట్లు? నీయత్నము నుడిగి మరలి పొమ్మని నుడివెను. ధ్రువుండు మెల్లన నగుచు "దేవా! హరి దయామయుండని వింటిని. అట్టివాని దయఁ గాంచుట దుర్లభ మెట్లగును? ఆ మహనీయుని వేఁడికొను మార్గమును మాత్రము నాకుఁ దెల్పుఁడు, తక్కు నుపదేశంబులు వల"దని కోరెను. ఆ బాలుని నోట నీ మాట రాఁగనే నారదున కొడలు పరవశమయ్యెను, ఆనందమునఁ జిందులు ద్రొక్కెను. ధ్రువునిఁ గౌఁగిలించుకొని ముద్దాడెను. ఎవ్వఁడో మూర్ఖుఁడు దక్క నాకుమారుని ముద్దుమాటల కానందించని వాఁడెవ్వఁ డుండును? తఱువాత నారదుఁడు "నాయనా! హరికృపయే సర్వకార్యసాధకము. నిశ్చలచిత్తంబున నతని వేఁడవలయును.

క. "వర యమునానది తటమున
హరిసాన్నిధ్యంబు శుచియు నతి పుణ్యమునై
పరఁగిన మధువనమునకును
నరసగుణా! చనుము మేలు సమకురు నచటన్.

క. ఆయమునాతటి నీశుభ
తోయములం గ్రుంకి నిష్ఠతో నచ్చట నా
రాయణునకును నమస్కృతు
లాయతముగఁ జేసి చేయు యమనియమములన్."

అని బోధించెను. ధ్రువుం డచటికిఁ బోయి స్నానంబుఁ జేసి శుచియై మూఁడు దినముల కొకమాఱు ఫలాహారుం డగుచు నొక్కమాసంబును, నాఱు దినముల కొకతూరి పర్ణాహారుం డగుచు నొక్కమాసంబును, దొమ్మిదినాళ్ళ కొక్కపరి నీరాహారుం డగుచు నొక్కమాసంబును, బండ్రెండునాళ్ళ కొకసారి వాయుభక్షుండగుచు నొక్కమాసంబును హరిం ధ్యానించి యంతట నిరాహారుం డగుచు నేకపాదంబున స్థాణువుంబోలె నిలువంబడియైదవ నెలయందును ఘోరతపంబు సేసెను. వాని నిష్ఠకు భువనంబు లన్నియును గంపించెను. దివిజు లల్లాడిరి. హరి ప్రత్యక్షమయ్యెను. ధ్రువుండు తాను నేర్చిన ముద్దుపలుకులతో హరిని స్తోత్రము సేసెను. దయామయుం డగు వాసుదేవుండు వాని పలుకుల కలరి యాలింగనముఁ జేసి,

క. "ధీరవ్రత! రాజన్యకు
మారక! నీ హృదయమందు మసలిన కార్యం
బారూఢిగ నే నెఱుఁగుదు
నారయ నది పొందరాని దైనను నిత్తున్.

అని యాదరించి, నీవు పురంబునకుఁ బోయి కొంత కాలము రాజవై రాజ్యము నేలుము. పిదప నీకు సర్వ మునిజనగణాతీతంబును, శాశ్వతంబు నగు నుచ్ఛస్థానము లభించి ధ్రువమండలంబు నాఁబరగుచుండు" నని వరం బిచ్చి యంతర్హితుం డయ్యెను. ధ్రువుండు తపంబుచాలించి ప్రత్యక్షమైన భగవంతుని ముక్తినిమ్మని వేఁడకపోతినిగదా? కార్యము మిగిలిపోయెను.

మ. ధనహీనుండు నృపాలుఁ జేగి మిగులన్ ధాటిన్ ఫలీకారమి
మ్మని యర్థించినరీతి ముక్తిఫలదుండై నట్టి పంకేజలో
చనుఁడే చాలఁ బ్రసన్నుఁడైన నతనిన్ సాంసారికం బర్థిఁ గో
రిననావంటివిమూఢమానసులు ధాత్రిన్ గల్గిరే యెవ్వరున్!

అని చింతించుచు నిజపురంబునకుఁ జనియె. ఉత్తానపాదుఁడు తనకుమారుని యసమానప్రజ్ఞను నారదునివలన విని సంతుష్టస్వాంతుఁడై తనయున కెదు రేగి కౌఁగిలించుకొని ముద్దాడి గృహంబునకుం గొనివచ్చెను.

తే. గీ. చారుబహువిధవస్తువిస్తార మొప్ప
నంగనాయుక్తమగుచుఁ బెంపగ్గలించి
యర్థిఁదనరారు జనకుగృహంబు సొచ్చె
నెలమిఁ ద్రిదివంబుసొచ్చు దేవేంద్రు కరణి.

ఉత్తానపాదుఁడు తన కుమారునకు యుక్త వయసు వచ్చువఱకు రాజ్యము నేలి పిదపఁ నతనికిఁ బట్టముఁ గట్టి

తాను వానప్రస్థాశ్రమముం గ్రహించెను. ధ్రువుండు శింశుమారప్రజాపతి కూఁతురైన భ్రమి యను నామెను వాయుపుత్రియైన యిల యను నామెను బెండ్లియై వారియందుఁ బుత్రపుత్రికాసంతానంబుఁ గాంచి సంసార సుఖము లనుభవించి ధర్మమార్గంబునఁ జిరకాలము రాజ్యమేలి,

క. జనని సునీతిని మున్నిడి
కొని యతులవిమాన మెక్కి గొనకొనివిబుధుల్
దనమీఁదఁ బుష్పవర్షము
లనయముఁ గురియింప ధ్రువుఁడు హర్షముతోడన్.

క. చనిచని వెనఁ గ్రహమండల
మును ద్రైలోక్యంబు సప్తమునిమండలమున్
ఘనుఁడు తరించి యవ్వలఁ
దనరెడు హరిపదము నొందెఁ దద్దయుఁ బ్రీతిన్.

3. వేనుఁడు.

ధ్రువుండు హరిపదంబు చేరిన పిమ్మట నతని కొడుకులును మనుమలును మునిమనుమలును గ్రమంబుగ రాజ్యంబు నేలిరి. ధ్రువుని తఱువాత నేడవపురుషుఁ డంగుండనువాఁడు. ఆతఁడు సమబుద్ధిఁ గలిగి రాజ్యమును బాలించుచుండెను. ఆతఁడు హరిపాదసేవానిరతుఁడు. వానికి యజ్ఞము సేయవలెనను కుతూహలము గలిగెను. పండితుల యనుమతిని నశ్వమేధ యాగమును బ్రారంభించెను. అనేక మునిజనులుగూడ యాగకాలమున నటకు వచ్చియుండిరి. అంగుండు యజ్ఞకుండంబున నాహుతులను విడిచి హవిరన్నములకు దేవతలను మంత్రపూర్వకముగ నాహ్వానించెను. దేవతలలో నొక్కరును రారైరి. ఎందుచేత రాకుండిరో వానికిఁ దెలియలేదు. సభలోని మునిజనులను "ధర్మసందేహమును బాపుఁ"డని యంగుం డడిగెను. వారలు యోజించి "నీవు పుత్త్రహీనుఁడవు. యాగమును జేయుట కర్హుఁడవు కావు. అందుచేత దేవతలు హవిరన్నములను గొనకుండిరి.

తే.గీ. పుత్త్రకామేష్టిఁ గావించి పుత్త్రుఁ బడయు
మట్లు సేసిన దేవత లాత్మభాగ
మర్థి నంగీకరింతు రయ్యజ్ఞపురుషు
హరి భజించిన సకలకార్యములుఁ గలుగు"

అని చెప్పిరి. అప్పు డంగుండు దీక్షితుఁడై పుత్త్రకామేష్టి నొనరించి యజ్ఞపురుషుం డొసంగిన పాయసమును దన

భార్యకిచ్చెను. ఆమె తత్ప్రసాదంబున గర్భంబుఁ దాల్చి వేనుఁడను కొమరునిఁ గనెను. పిదప నంగుండు హయమేధయాగంబును సక్రమంబుగఁ బూర్తిచేసి ఆదిశాంతకీర్తియై రాజ్యము నేలుచు హరిపాదసేవచేఁ బరలోక సాధనమును గడించుచుఁ గొమరునకు విద్య నేర్పించుచు నుండెను. వేనుండు పూర్వదోషమున సుగుణుండుగాక,

చ. ఎనయఁగ బాల్యమందుఁ దనయీడుకుమారులఁ గ్రీడఁబోలెనె
మ్మనమున భీతిలేక కృపమాలి పశుప్రకరంబు నొంచుపో
ల్కిని నరికట్టి చంపుచును గిల్బిషలుబ్ధకవృత్తిమై శరా
సనశరముల్ ధరించి మృగజాతి నసాధుగతిన్ వధించుచున్.

పాపప్రవర్తనుండై చరియించుచుండెను. అంగుండు కొమరుని దుశ్చేష్టల మాన్పుట కెంతయో ప్రయత్నించెను. కాని తన కది యసాధ్యంబై యుండుటం జూచి దుఃఖించి మనంబున,

క. "అనయము నిట్టి కుపుత్త్రునిఁ
గని పరితాపంబుఁ బొందు కంటెను ధరణి
న్ననపత్యుం డగు టొప్పును
వనజాక్షుభజించునట్టివాఁ డగు వాఁడున్",

అని తలపోసి యిట్టి దుష్టునకుఁ దండ్రినై పురజనుల మోము లెట్లు సూతు నని శంకించి యొకనాఁ డెవ్వరికిం జెప్పక

క. తగు సుమహైశ్వర్యోదయ
మగుగృహమును బ్రబల నిద్రనందిన భార్యన్
దిగవిడచి యెక్కఁ డేనియు
జగతీశుఁడు సనె నిశీథసమయములందున్.

మఱునాఁ డుదయముననే యీ వృత్తాంత మతని బంధుగులకును, మిత్త్రులకును, బ్రజలకును దెలిసి వారందఱును నగరారణ్య పర్వతప్రాంతములందుఁ గలయందిరిగియు నెందుం గానక హరి సమానుండగు రాజుం గోల్పడుటకుఁ జింతించిరి. వేనుండు నిరపాయస్థితి శుంతలతోఁ గాలముపుచ్చుచుండెను. కొంత కాలమునకు దేశం బరాజకంబగుటను బ్రజ లధర్మవర్తనులై నీతి విడిచి ప్రవర్తించుచుండిరి. అప్పుడు మంత్రులును బ్రజలును మునిబృందంబులును నాలోచించి యంగుని భార్యయగు సునీథ యనుమతంబున వేనుని రాజుం గావించిరి. అతఁడు సహజదుర్గుణుం డగుటచేత,

చ. పరువడి నష్టలోకపరిపాలకముఖ్యవిభూతియుక్తుఁడై
పరఁగి నృపాసనంబున విభాసితుఁ డౌట స్వభావసిద్ధమై
వఱలు మహావలేపమున వారక సంతతమాననీయ స
త్పురుషుల నెల్ల నెందుఁ బరిభూతులఁ జేయుచునుండె నిచ్చలున్.

మఱియు నతఁడు స్వేచ్ఛావిహారుఁడై,

క. దివ్యులు వెఱఁ గందఁగఁ బృ
థ్వీవ్యోమము లగల భేరి వేయించె నయ

ష్టవ్య మదాతవ్య మహో
తవ్యం విప్రా యనుచు నుదాత్తధ్వనులన్.

వీని దౌర్మార్గ్యంబును సహింపఁజాలక మునిబృందం బులేకగ్రీవముగ మృతుం డగునట్లు శాప మొసంగిరి. శాపహతుండైన వేనుని మరణంబునకు వాని తల్లియగు సునీథ దుఃఖించి యామె భావికాలజ్ఞాత్రి యగుటను నామృతకళేబరమును దాఁచియుంచెను. రాజ్యంబంతయు మరల నరాజకం బయ్యెను. మంత్రిజనప్రార్థితులై మునులు సునీథగృహమ్మునకు వచ్చి వేనుని మృతకళేబరమును దెప్పించి,

క. అనయము ననపత్యుం డగు
మనుజేంద్రుని బాహులంత మథియించిన నం
దనఘం బగు నొక మిథునము
జనియించెను సకలజనులు సమ్మద మందన్.

ఆ మిథునమునఁ బురుషుండు లోకపాలకుండగు నారాయణుండుఁ గాంతామణి యతనిభార్యయగు లక్ష్మి. ఆ పురుషునకుఁ బృథుచక్రవర్తి యను నామంబును విధించి మును లరిగిరి.

ఆయన ధర్మవర్తనుఁడై చిరకాలము ప్రజలఁ బాలించుచుండెను. కాని యాకాలమునఁ బ్రజలకన్నంబు కొఱఁతపడి యుండెను. భూప్రజలు రాజుకడకువచ్చి,

క. అరయఁగ మేము బుభుక్షా
పరిపీడం బడితిమయ్య పైకొని తరుకో

టరజనితవహ్ని చేతను
దరికొను వృక్షములఁ బోలె ధరణీనాథా!

కావున "మాకన్నముం గల్పించి ప్రోవు"మని వేఁడిరి. ధరానాయకుఁడు కొంచెము సేపాలోచించి "ప్రజలకు క్షుత్పీడఁ గల్పించిన ధరణిం బ్రద్దలు సేసెద" నని చాపంబుఁ గొని బాణంబుఁ దొడిగిన భూమి గజగజ వడంకి గోరూపిణియై యడవులంబడి పరువెత్తెను. పృథుచక్రవర్తి దానిని వెంబడించెను. ఇట్లిరువురు ననంతప్రదేశంబుఁ దిరిగిరి. భూదేవి కాయాసంబు జనించి పృథునృపునకు మ్రొక్కి 'రక్షింపు' మని వేఁడెను. 'నీవు నీయందలి యోషధులం బ్రజలకుఁ గురియక బిగ్గ పట్టి తప్పు సేసితివి. కావున నీవు దండ్యవు. నిన్ను వధింపక మాన' నని నుడివెను. ఆగోవు నతిభయంబున నిట్లనెను. 'ఓ నాథా! చిరకాలమునుండియుఁ గ్రతువులు లేక యీ లోకము చోరప్రచురమగుటచే నోషధుల నగ్రసించితిని. అవి నాయందు జీర్ణంబు లయ్యెను. నాకొక సమస్థలంబును వత్సంబును గల్పించి పూర్వుల యట్ల యోషధులం బితికింపు' మని ధేనువు సెప్పెను. పృథుచక్రవర్తి ధేనువు కోరిన ట్లొనరించి యోషధులఁ బితికి భూప్రజల కాహారమును గల్పించి క్రమంబుగఁ దొంబదితొమ్మిది యాగంబుల గావించి నూఱవ క్రతువునకు సంకల్పించెను. అయ్యది పూర్తి యగునేని పృథుభూపాలుం డింద్రపద[illegible]భయంబున

నింద్రుండు ద్వేషించి క్రతుహయముం బట్టియు యజ్ఞకుండంబుం దడిపియు ననేకవిధంబులఁ గ్రతుధ్వంసమునకుఁ బ్రయత్నించెను. పృథుచక్రవర్తి కినిసి యింద్రుం బరిమార్పుటకుఁ బూనెను. బ్రహ్మదేవుఁడు పృథునకుఁ బ్రత్యక్షమై "యింద్రునిఁ గూల్పవలదనియుఁ, గ్రతుసమాప్తిఫలము నీకు సమకూరెననియుఁ" జెప్పి యక్కార్యంబునుండి విముఖునిఁ జేసెను. పృథుచక్రవర్తి బ్రాహ్మణులకును, సదస్యులకును ఋత్విజులకును బహువిధంబుల బహుమానముల నొసంగెను.

చ. సురుచిరలబ్ధదక్షిణలసొంపునఁ బొంపిరివోయి భూసురుల్
వరుసను బెక్కుదీవన లవారణ నిచ్చిరి సర్వదేవతల్
భరితముదంతరంగములఁ బాయని వేడ్కవరంబు లిచ్చి రా
నరవరుఁడైన వైన్యునకు నందితకీర్తికిఁ బుణ్యమూర్తికిన్.

ఇతఁడు చాలకాలము రాజ్యంబు నేలి ప్రజలకు ధర్మోపదేశంబును గావించి సత్యదయాశౌచంబుల నందఱకును నిత్యకృత్యంబులుగా శాసించి యరణ్యంబులకుఁ బోయి యోగమార్గంబునఁ దేహంబును విష్ణువునందుఁ జేర్చెను. పృథుని భార్య యగు నర్చి పతికళేబరముతో నగ్నిం బ్రవేశించి యవతారంబును జాలించెను.

4. భరతుఁడు.

ఋషభుం డను రాజు మిక్కిలి ధర్మ పరిపాలనము సేయుచు ప్రజల యం దనురాగము గలవాఁడై వారి సౌఖ్యములే తనసౌఖ్యములుగా భావించుచుండెను. ఆతనికి జయంతి యను నొక సుగుణవతి భార్య యై యుండెను. ఆమె యందు ఋషభునకు నూఱుగురు పుత్త్రులు గలిగిరి. వారిలో జ్యేష్ఠుఁడు భరతుఁడు. న్యాయమార్గానువర్తియు, ధర్మజ్ఞుండును, భగవత్పాదధ్యానాభిరతుండు నై యుండెను. ఋషభుండు వార్ధకంబునఁ దపస్వియై రాజ్యభారమును భరతున కొప్పగించి సభార్యుఁడై యడవులకుఁబోయి తపం బాచరించు కొనుచుండెను.

మ. భరతుండంతధరాతలంబుఁ గడకం బాలించుచున్ ధారుణీ
శ్వరచంద్రుండగు విశ్వరూపునకుమున్ సంజాతయైయుండిని
ర్భరకాంతిన్ విలసిల్లు పంచజనిపేరం గల్గు కాంతామణిన్
గరమర్థిన్ ధరబెండ్లియాడె శుభలగ్నంబందు సప్రేముఁడై

ఆ పంచజని మహాపతివ్రత యై భర్తృసేవఁ జేయుచుఁ గార్యాకార్య వివేచనము గలిగి భరతున కన్నివిధంబులఁ దన యందుఁ బూర్ణదయ కలుగునట్లు వర్తించుచుండెను.

క. భరతుఁడు పూర్వజు లేలిన
ధరణిని గర్మముల నెల్లఁ గైకొని ప్రజలన్
హరికృపనొందుచు నేలెను
ధరణీసురవరులు పొగడ ధర్మజ్ఞుండై.

మఱియు నితం డనేకయజ్ఞయాగాది క్రతువులనొనర్చి దేవతలకుఁగూడఁ బ్రియుండై యుండెను. ఇతఁడు భూప్రజలకు స్వపరిపాలనాధికారముం గలిగించి ధర్మవ్యతిరిక్తప్రవర్తనులఁ దాశిక్షింపుచుఁ బ్రజాపరిపాలనకు వలయు సహాయమును జేయుచుఁ బరరాజులను దేశంబునఁ జొరనీయక కాపాడుచుఁ బ్రజల వాంఛలను దృప్తికరముగాఁ దీర్చుచు భూజనులను విద్యావిపులం గావించుచుఁ జిరకాలము రాజ్యపరిపాలనమును గావించెను. ఇంత సదుపాయముతో రాజ్యము నేలినవా రంతకుఁ బూర్వము లేరు. కావున నీభూమికి నాఁటనుండియు భరతవర్షమను పేరు కలిగెను. అయ్యది యిప్పటికిని వాడుకలో నున్నది. భరతుండు చిరకాలము రాజ్యము నేలియైహికసుఖంబులయెడ విరక్తుండై పంచజనియందుఁ దన కుద్భవించిన సుమతి, రాష్ట్రభుక్, సుదర్శన, ఆచరణ, ధూమ్రకేతువు లను నైదుగురు కొమరులకును రాజ్యమును బంచియిచ్చి తాను వనసీమకుఁ బోయి మునుల యనుగ్రహంబు వడసి తపంబు సేయుచుండెను. భరతుండు సర్వభూతములయందును దయ గలవాఁడై మునీశ్వరు లందఱు నాశ్చర్యపడునట్లు ఘోరతపం బొనరించుచు నొక్కనాఁడు మహానదికి స్నానార్థియై పోయెను. అతఁ డానదీజలంబులలో మునిఁగి సర్వవేదమూలంబును పర

బ్రహ్మస్వరూపంబు నగు ప్రణవంబు నుచ్చరించుచు మూఁడు నిమేషముల కాల మంతర్జలంబున నుండెను.

ఆ సమయంబునఁ బూర్ణగర్భముం దాల్చిన యొక్క హరిణి జలార్థినియై యా నదికి వచ్చి జలంబులం గ్రోలుచుండు నెడ నాసమీపంబున మృగరాజు భయంకరముగా గర్జించెను. దిక్కులు పిక్కటిల్లునట్లు వెడలిన గర్జానాదంబును విని సింగంబు వచ్చి పైఁబడుచున్నదను భయంబున సహజభీరుస్వభావ యగు నా హరిణి చెంగున నెగిరి పాఱిపోవు సమయంబున గర్భంబునుండి పిండంబు జాఱి నీటిలోఁ బడియెను. భరతుండా హరిణపోతంబు నీటిలోఁ బడి కొట్టుకొనుచుండఁగాఁ జూచి జాలిగొంది దాని శరీరంబున నుండు మలినంబును నీటిచేఁ గడిగి దానిం జంకఁ బెట్టికొని తన యాశ్రమంబునకుఁ దెచ్చి పెంచుచుండెను. ఆ హరిణపోతంబు మునియొద్దఁ బరిచయంబు గలిగి వర్తించుచుండెను. మునికి దానియందు దయఁ గలిగి లేడియొడలు చేతితో నిమురుచుఁ దనలో నిట్లనుకొనెను.

ఉ. అక్కట! తల్లిం బాసి హరిణార్భక మాప్తులు లేమిఁ జేసి యే
దిక్కును లేక యున్న నిట దెచ్చితి నా యెడ నీమృగార్భకం
బెక్కుడు ప్రేమ సేసి చరియించుచు నున్నది నాదు సన్నిధిన్
మక్కువ చేసి దీనిఁ గడు మన్ననలం దగఁ బ్రోతు నెంతయున్.

అని నిశ్చయించుకొని యాహరిణంబునకు సమస్తోపచారములను [illegible] నానవ [illegible] స్నానాటన ఫలాహా

రణ దేవపూజాది సమయంబులందుఁ గూడ విడువక యొద్దన యుంచికొనుచుఁ గ్రూరమృగంబుల వలన బాధ రాకుండఁగాఁ గాపాడుచుఁ బెంచుచుండెను. ఇట్లుండ నా హరిణపోతం బొక్కనాఁడు మునిసన్నిధిం బాసి యెందే పోయెను. దానిని వెదకుచు భరతుండు వనంబంతయుఁ గలయం దిరిగి యెందునుం గానక,

తే-గీ. హరిణపోతంబ! నీకు వనాంతమందుఁ
క్రూరమృగబాధ లేకుండఁ గోరుచుండఁ
దలఁగి పోయితె వృకుల కోదనమవగుచుఁ
గట్ట! నీ కిట్టి పాటు నాకట్టె ధాత!

అని దుఃఖించుచు సర్వకార్యముల వర్జించి యాశ్రమంబునఁ గూర్చుండి యున్న సమయంబున నెటనుండియో హరిణంబు వచ్చి ముని పాదంబుల కడ నిలిచెను. పెన్నిధిఁ గన్న పేదవోలె, భరతుండు లేడిం జూచి కౌఁగిలించుకొని యప్పటి నుండియు దానిని సుంతయేనియు నెడఁబాయక యధిక ప్రేమను బెంచుచుండెను. కొంతకాలమునకు భరతున కవసానకాలము ప్రాప్తంబయ్యెను.

మ. భరతుం డల్లన నంత్యకాలము వెసం బ్రాపింపఁగా నప్పుడా
హరిణంబున్ గడుభక్తిఁ బుత్త్రగతి నత్యాసక్తి వీక్షింపఁగా
హరిణంబు న్దనయాత్మలో నిలిపి దేహం బంతటం బాసి తా
హరిణీగర్భ [illegible] సన్నిధిన్

తొలుత రాజాధిరాజుగఁ బుట్టి ధర్మమార్గంబునఁ బ్రజాపరిపాలనం బొనర్చి, సంసారమును రోసి మునియై మౌనులు సెబాసన తపంబొనరించిన భరతుండు తన యవసానకాలంబున మృగినిం దలంచి తద్గర్భంబునఁ బుట్టుట యెంత దుస్థితి ! మృగియై పుట్టినను భరతుని పుణ్యకర్మ విశేషంబునఁ బూర్వజ్ఞానము నొందుట కొంతమేలైనది.

తఱువాత నాతఁడు తనహీనస్థితికి దుఃఖించుచు మృగరూపంబున మునిముఖ్యులున్న తావులకుం బోయి నిశ్చలచిత్తంబున బరమేశ్వరుని ధ్యానించి హరిణదేహంబుఁ బాసెను. పిదప నాంగిరసుఁ డను తపోధనుఁ డగు బ్రాహ్మణుని కడుపున బుట్టెను. ఆంగిరసునకు మొదటిభార్యయందుఁ గొందఱు తనయు లుండిరి. భరతునియందుఁ దండ్రికి మిగుల దయ. భరతుఁడు ప్రాపంచికసుఖంబులయందును డాంబికవిద్యాదులయందును నిరసనభావంబు గలిగియెల్లపుడును నాత్మయందుఁ బరమేశ్వరుని ధ్యానించుచుండెను.

భరతున కాంగిరసుఁడు చౌలోపనయనాది కర్మలఁ గావించి కులాచారానుసారముగఁ గర్మిష్ఠుని జేసెను. ఈ విద్యల నభ్యసించుటయందె భరతున కనిష్టమైనను తండ్రి యాజ్ఞకు లోఁబడి వేదపఠనమును గూడ నొనరించుచుండెను. ఇంతలో నాంగిరసుఁడు మరణించెను. భరతుని తల్లి కూడ భర్తృవియోగ దుఃఖమున మరణించెను. తఱువాత భర

తుని సాపత్నికసోదరులు భరతునియం దసూయవహించి వానిని పైరులకుఁ గాఁపరిగ నియమించి యన్నముకూడ నొసంగక బాధపెట్టుచుండిరి. ఐహికసుఖవిదూరుం డగు భరతుఁడు మనంబున నించుకయు శంకింపక పొలములో మంచెపైఁ గూర్చుండి పరబ్రహ్మమును మనంబున ధ్యానించుచు బిచ్చివాని వలె వర్తించుచుండెను.

వృషలుఁ డను నొక్క రాజు సంతానార్థియై కాళికాదేవి నుపాసించి యొకనరుని బలియిచ్చునట్లు మ్రొక్కిడి నరపశువుం గొనితెచ్చుటకు సేవకులం బంపెను. వారందఱు వెదకి మూఁగునియట్లు గన్పట్టుచున్న భరతునిఁ బట్టి రాజగృహంబునకుఁ గొనిపోయిరి. వృషలుండు గడు సంతోషమ్మున నవ్విప్రబాలకునకు నభ్యంజనాది సంస్కారంబులఁ నొనర్చి సమస్తసువర్ణభూషలం బెట్టి యూరేఁగించుచుఁ గాళిమందిరంబునకుం గొనిపోయెను.

ఉ. అచ్చటవిప్రసూనుఁడు భయంబొకయించుకలేక చంపఁగా
వచ్చినవారియందుఁ గరవాలమునందును గాళియందుఁదా
నచ్చపుభక్తియుంచిహృదయంబునబద్మదళాక్షు నెంతయు
మచ్చికతోడనిల్పియనుమానము నొందకయుండెధీరతన్.

ఇట్లు హరిపదధ్యానపరాయణుండును, సర్వసముండు నగు నాభరతుని కంఠంబును రాజు మంత్రపూర్వకంబుగ నఱుకఁ బోవునరికిఁ గాళికాదేవి సక్రోధయై యాకరవాలంబున

వచ్చుటి వారినెల్లఁ గూల్చి విప్రవటునిరక్షించెను. భరతుండు కాళికి నమస్కరించి తదాలయంబునుండి వెలువడి పొలము కడకుం బోయి యథాపూర్వంబుగ బైరులకుఁ గాఁపుండెను. కొంతకాలము గడచినపిమ్మట సింధుభూపాలుండు జ్ఞానోపదేశము నొందుటకు నిక్షుమతీతీరంబున నున్నకపిలమహాముని పాలికి శిబికారోహణముసేసి యామార్గమునఁబోవుచుండెను. శిబికావహులు చేనికాఁపరియైయున్న విప్రవటునిఁ గొనివచ్చి వానిమూఁపునబాలకీదండెనుమోపి బలవంతముగ మోయించుచుండిరి. ఆపని యతని కెన్నడు నభ్యాసము లేనికతన గమన వ్యత్యాసంబు గలిగి శిబిక నిమ్నోన్నతమగుట యెఱింగి భూపతి వాహకులనుగోపగించెను. వారలు నస్యపాలకునివలన నీవ్యత్యాసంబు గలుగుచున్నదని నుడివిరి. రాజు వానింబిలిచి,

చ. "అలసితి వెంతయుఁ ముసలివాఁ కటడస్సితి వెన్నుమిక్కిలిం
బలుచన యున్న దీ శిబికభారముదూరము మూసి తేగతిఁ
నిలిచెద" వంచుభూవరుఁడునిష్ఠురముల్ దగఁబల్కనాయెడ
బలుకక మోసె నాశిబికబ్రాహ్మణవర్యుఁడుత్యక్తకోపియై.

ఇట్లు మోయుచుండఁగ మరల విషమ గమనంబునఁ బాలకి నిమ్నోన్నత మగుటం జేసి రాజుగ్రుద్ధుడై శిబికనుండి క్రిందికిఁ దిగి వానితో నిట్లనియె.

సీ. ఓరి దుర్మద! వినరోరి జీవన్మృత!
నాయాజ్ఞఁదప్పించ నడిచె దీవు

నీ వక్రమార్గంబు లిన్నియు విడిపించి
నడిపింతు నిన్ను సన్మార్గమందు
నని రాజగర్వాంధుఁడగుచు గుణత్రయం
బున వృద్ధిబొందిన భూవరుండ
బద్ధప్రలాపముల్ వల్కుచుండినఁ జూచి
శమదమాదులచేఁ బ్రశస్తుఁడగుచు

తే-గీ. జగతి బ్రహ్మస్వరూపమై సకల భూత
ములకు నత్యంత హితుఁడైన భూసురుండు
యోగివర్తనఁ దెలియలేకున్న రాజు
నంత వీక్షించి యుల్ల నిట్లనుచుఁ బలికె.

, నరేంద్రా! నీవు సెప్పునదినత్యంబు. భారం బీ శరీరంబునకేఁ గాని నాకుం గలుగదు. స్థౌల్యకార్శ్యంబులును, వ్యాధులు, నాధులు, క్షుత్తృష్ణలు, నిచ్ఛావిరోధభయంబులు, జరామరణంబులు, రోషనిద్రాజాగరణంబులు, నహంకార మమకారంబులును దేహంబుతోడం జనియించును గాని నాకుం గలుగనేరవు. జీవన్మృతుండ నేన కాదు. ఆద్యంతంబులు గలుగుటం జేసి యందఱియందును గలిగి యుండును. స్వామిభృత్యసంబంధములు విధికృతంబు లగుచు వ్యవహారంబులం జేసి శరీరంబునకుఁ గలుగును, కాని జీవునకుఁ గలుగవని చెప్పెను. రాజు వాని మాటలను విని విస్మయము నంది

యమ్మహాత్మునకు దండప్రణామం బాచరించి ముకుళీకృత కరకమలుండై,

మ. జ్వరితాత్ముండగు రోగికౌషధము తీక్ష్ణంబైనచందంబునన్
ధరలో నాతపతప్తదేహికడు శీతంబైన తోయంబునన్
గరిమం గోరిన రీతి నెంతయు నహంకారాహిదష్టుండనై
పరగన్ నాకును నీవచోమృతము తప్పన్ మందు వేఱున్నదే!

అని యనేక విధంబులం బ్రార్థించిన భరతుండు దయాస్వాంతుండై వానికిం దత్త్వమును బోధించెను. తఱువాతం గొంత కాలమ్మునకు శ్రీహరి యనుగ్రహమ్మున హరిలోకంబు నందెను.

---

5. అజామిళుఁడు.

:0:

భరతవర్షంబునఁ గన్యాకుబ్జ మను నొక్క పురవరం బుండెను. ఆ పురంబునఁ గడు నాతతాయి యగు నొక విప్ర బాలకుఁడు గలఁడు. వాని తలిదండ్రులు చిన్నతనముననే మరణించిరి. అతనికి విద్యాశిక్ష నొసంగుటకు దక్షులు లేమిం జేసి యపండితుఁడై యుండెను. కన్యాకుబ్జంబున నబ్బాలకున కనేకమిత్రజనంబు లేర్పడి యుండిరి. వారిలోఁ గొంద ఱజామిళుని జూదమునందసమానపండితునిగఁ జేసిరి. మఱికొందఱు మిత్రులు పానంబునం బండితునిఁ జేసిరి, నింకఁ గొందఱు దుర్వాదంబులం బ్రవీణునిగఁ జేసిరి. ఈ మూఁడు విద్యలను మాత్ర మతఁడు గురుశుశ్రూష నొనర్చి గ్రహించెను. తఱువాత నతఁడు తన బుద్ధివిహీనతచేత నిర్భాగ్యుండు, నవజ్ఞుండు, నష్టసదాచారుఁడు, కష్టరతుఁడు, మత్సరగ్రస్తుఁడు నయ్యె.

ఇప్పటికి సకలవిద్యాప్రవీణుం డయ్యెను. కావున నొక తొత్తును జేరఁదీసి గృహస్థాశ్రమమును స్వీకరించెను. దానియందుఁ బదుగురు కొడుకులం బడసె.

ఆ- వె. మోహజలధిలోన మునిఁగి ముచ్చట దీఱ
బాల లాలనాదిలీలఁ దగిలి
పెద్దకాల మతఁడు పెంపార సుఖియించి
ఫలిత మెల్ల వదలి పతితుఁ డయ్యె.

అజామిళుఁడును జెక్కుఁ బ్రసిశిష్యులం బ్రోవుసేసి, వారలకు దుర్వృత్తులను నేర్పి, తన విరోధు లగు సదాచారులను వంచించుటకుఁ దగిన సాధనోపాయములను వారలకుబోధించి వారల కెల్లఁ దాన ప్రభువై ,, కోఁతుల భాగవతములోని గండు తిమ్మరాజు'' బలె నొక్కయున్నత సౌధంబున సింహాసనం బధిష్ఠించి, నిరపరాధులకుఁ గష్టనష్టంబులం గలిగించుచు దాన ద్రవ్యమును బ్రోవు సేయుచుఁ దానును దన తొత్తును గొడుకులును శిష్యులును జీవించు చుండిరి. ఇట్లుండ నతనికి,

సీ. నిర్మలంబునఁ జాల నెఱయుచి త్తంబన
నల్లని వెంట్రుకల్ తెల్ల నయ్యెఁ
దగు మోహపాశబంధంబు జాఱినమాడ్కిఁ
బొదలిన యంగముల్ వదలి వ్రేలె
నింద్రియంబులకోర్కి లేక నొల్లనుభంగి
నుడుగక తల చాల వడఁకఁ జొచ్చెఁ
దమకంబు ప్రాయంబుఁ దగిలిపోయినమాడ్కి
లోచనంబులఁ జూడ్కి సీచమయ్యె

ఆ. పగరు పుట్టినంత బెగడె దంతంబులు
నుక్కినయును దగ్గుఁ బిక్కటిల్లె
శిరసు నొవ్వఁ దొడఁగెఁ జెనరె మనంబంత
గడిఁదియైన ముప్పుకాలమబ్బె.

అతని కొడుకులు పదుగురిలోఁ గడసారి వానియందు వానికిఁ బ్రేమ మగ్గలము. ఆ కుమారునిపేరు నారాయణుండు.

క. తనసుతయుఁ దానుఁ గూరిమి
మనమునఁ బెనఁగొనఁగ నక్కుమారుని ననిశం
బును ముద్దు సేయుచుండిరి
చనువును వాత్సల్య మాత్మ సందడిగొనఁగన్.

వృద్ధబ్రాహ్మణుఁడు నారాయణుని నొక్క నిమేష మేనియు విడువక యాదరంబునఁ జెలఁగుచుండఁ దనకు మృత్యు వాసన్నం బయ్యెను. అప్పు డజామిళుండు.

క. కింకరుల ధర్మరాజ న
శంకరుల దురంత పంకసమధిక జననా
శంకరుల సకలలోక భ
యంకరులంగనియె నింద్రియాతురుఁ డగుచున్.

తన యనుఁగుఁ గుమారుల విడిచి మృత్యువు వాతం బడవలసి వచ్చెఁ గదాయని మనంబునఁ జింతించుచు నాతురంబునఁ బ్రియసుతుఁ డగు నారాయణుని ,, నారాయణా ! నారాయణా !'' యని ప్రలాపించెను. ఇంతలో యమకింకరు లాతనిఁ బాశబద్ధునిఁ గావించి జీవంబుల దిగలాగుచుండిరి. అజామిళుఁడు విస్మృతుం డయ్యెను. అవసాన కాలంబున శ్రీమన్నారాయణుని నామమును ధరించిన కొమరుని స్మరించుటం జేసి,

వ. మరణంపు వేళ నన్దనుజమర్దను సంస్మరణంబు జేయుఁ ద
త్పరిసరవర్తు లాత్మపరిపాలకు నామము నాలకించి ని

క్షురగతి నేఁగుదెంచి పాదసూపి యదల్చిరి కాలుదాసులన్
ఖరతర భాషులన్ వికటకల్పిత వేషుల దీర్ఘరోషులన్.

క. దాసీభర్తన్ నజామిళ
భూసురుఁ దత్తనువువలన బోరన వెలికిం
దీసిన యమభటులను బోఁ
ద్రోసిరి శ్రీవరునికూర్మి దూతలుకడిమిన్.

యమదూతలు విష్ణుదూతలవలన నిర్ఘాతప్రయత్నులై వారిం గని వారి భీషణవేషంబులకు వెఱఁగంది యిట్లనిరి.

క. "ఎవ్వరి వారలు? మాతోఁ
జివ్వకుఁ గతమేమి? యిల్లు చిక్కనవానిన్
ద్రొవ్వనవిడిపించితి రిఁక
నవ్వలకో! జముని శాసనంబులు జగతిన్.

అదియును గాక,

క. ధనువులు నిషంగచయములుఁ
గనదంబుజ శంఖచక్ర ఖడ్గగదాసా
ధనములు ధరియించిన మీ
తనువులు లోకముల కద్భుతంబొనరించున్.

ఇట్టి మీర లెవ్వరో! యేమికతంబున నీ పాపిని మా వారినుండి రక్షింప నెంచితిరో యెఱింగింపుఁ"డని ప్రార్థించిరి.

ఉ. ఈతఁడు కోటిసంఖ్యలకు నెక్కుడుపుట్టువులందుఁ జెంది యా
యాతములైన పాపనివహంబుల నన్నిటిఁ బాఱఁదోలెఁ బ్ర

ఖ్యాతమతిన్ మహామరణకాలమునన్ హరిపుణ్యనామసం
భూతసుధామయాద్భుత విధూతికరాత్మసంగ్రహంబునన్.

ఈ పలుకులను విని యమదూతలు మందస్మితులై "ఓమహానుభావులారా! మీ పలుకులు మా కాశ్చర్యముం గొలుపుచున్నవి. మహాపాపకర్ముండగు నీవిప్రుని పుణ్యుఁ డని చెప్పుటకంటె వింత యేమున్నది! మీ రాలకింపుఁడు. వీని దుష్ప్రవర్తన మిట్టిదని చెప్పుట కలవికాదు. వీఁడొక నీచకులాంగనం జేరఁదీసి,

ఉ. బంధులఁ దిట్టి సజ్జనుల బాధలఁ బెట్టి యనాథకోటిఁ బెం
బందెలు సుట్టి యీరములు వట్టి పథంబులు గొట్టిదిట్టయై
సందల కోర్చి సాధులకు నిందితుఁడై గడియించు విత్తమా
సుందరికిచ్చి మెచ్చి కలుసాంపెదఁ గూర్చి వసించెఁ దత్కృపన్.

తే. మఱి కులాచారవర్తన మాటుఁజేసి
పరఁగు పిత్రర్థములు దానిపాలు చేసి
సాధులక్షణ గుణవృత్తిఁ జాలుచేసి
లోలలోచన చెలిమిచే లోలుఁడయ్యె.

ఇట్టి కష్టుఁ డొక్కమాఱు హరినామధారియగు కొమరుని నవసానకాలంబునఁ బిలిచినంతమాత్రమునఁ బుణ్యుఁడగు ననుటకలదా!" యని నుడివిరి. విష్ణుదూతలు యమదూతల మాధ్యమునకుఁ జిఱునగవు మొగమునఁ జూపి యిట్లనిరి.

సీ. "బ్రహ్మహత్యానేకపాపాటవుల కగ్ని
    కీలలు హరినామకీర్తనములు
గురుతల్పకల్మష ఘోరసర్పములకు
    గేకులు హరినామకీర్తనములు
తపనీయచౌర్యాఘ తమసంబునకు సూర్య
    కిరణముల్ హరినామకీర్తనములు
మధుపానకిల్బిష మదనాగసమితికిఁ
    గేసరుల్ హరినామకీర్తనములు

తే. గీ. మహిత యోగోగ్రనిత్యసమాధివిధుల
నలరు బ్రహ్మాదిసురలకు నందరాని
భూరినిర్వాణ సామ్రాజ్యభోగభాగ్య
ఖేలనంబులు హరినామకీర్తనములు.

క. హరి నెఱుఁగని మూఢాలుఁడు
హరిభక్తులతోడఁగూడి హరియనువాఁడుం
సరి యై దోషము లడఁచును
గరువలితో వహ్నితృణముఁ గాల్చినభంగిన్."

అని యుపదేశించిన యమభటులుం దృప్తమానసులై యజామిళుని ప్రాణంబుల నతని దేహంబున విడిచి యాతని ముక్తపాశునిఁ జేసి యముని పాలికిం జనిరి. విష్ణుదూతలు

హరిలోకంబున కేఁగిరి. అజామిళుండు హరి యమ దూతల సంభాషణవాక్యములను గడు నాదరంబున వినుటం జేసి త్యక్తదుష్ప్రవర్తనుఁడై సర్వదా శ్రీహరిని ధ్యానింపుచు నడవుల నాకలములఁ దినుచుఁ దత్త్వవేది యై గంగానదీతీరంబునఁ దపం బాచరించి దేహముక్తుఁడై శాశ్వతవిష్ణులోక నివాసంబును గాంచెను.

6. చిత్రకేతుఁడు.

చ. అమితవిభూతిఁ జాల నమరాధిపుఁ బోలుచు శూరసేనదే
శములకు భర్తయైప్రజలుసంతస మందఁగసార్వభౌముఁడై
క్షమ దన కెల్లగాలమును గామదుహంబుగఁ జిత్రకేతునా
మమునఁ బ్రసిద్ధికెక్కెగుణమండనుఁడంచితకీర్తికాముఁడై.

అతఁడు పరిపాలనంబునఁ బ్రజల కెట్టిలోపంబులు రానీక సమస్తవిధంబుల వారలక్షేమంబుఁ గోరుచుఁ బ్రజల విశ్వాసగౌరవంబులకుఁబాత్రుఁడై ప్రవర్తించుచుఁజిర కాలము రాజ్యము నేలెను. దైవయోగంబున నతండు సంతానశూన్యుఁడగుటం జేసి యనేక కామినీమణులను భార్యలనుగ గ్రహించెను. విధివశంబున నమ్మహారాజు పుత్రసంతానుఁడు గాఁజాలక యా చింతచేఁ గృశించుచుండెను.

ఉ. రూపముసత్ప్రతాపము మరుత్పతిభోగము యౌవనంబుసం
దీపితచారువర్తనము దిగ్విజయంబును సత్యమున్ జగ
ద్వ్యాపితకీర్తియున్ సతులువైభవముఖ్యములెల్లమాన్పఁగా
నోపకయుండెనా నృపతి నొందిన సంతతి లేనిదుఃఖమున్

ఇట్లుండ నొక్కనాఁడు నృపుని కడ కాంగిరసమహాముని విచ్చేసి, "రాజా! సకలరాజ్యోపభోగంబులం గుడుచుచు, దారపుత్రామాత్యభృత్యసామంతనృపాలుర కధిపతివై యున్న నీ మొగంబున విచారభావము గన్పట్టుచున్నది.

కారణంబే" మని యడిగెను. ఆ రాజు సింహాసనంబునుండి దిగ్గున లేచి మునికి నమస్కరించి యుచితాసనంబొసంగిముకుళీకృతకరకమలుండై "దేవా! సర్వజ్ఞులరగు మీకెఱుంగరాని విషయము లెవ్వియు నుండవు. అయినను విన్నవించుకొనుచున్నాఁడను. నేను సమస్తభోగముల ననుభవించుచుండియును బున్నామనరకోత్తారణకారణుం డగు సూనుండు గల్గమి దుఃఖించుచుంటి" నని చెప్పెను. దయాసాంద్రుండగు న మ్మునిచంద్రుండు చిత్రకేతు నెడం బ్రసన్నుండై తన తపఃప్రభావంబునఁ జరువుం గల్పించి యా రాజవరేణ్యున కొసంగి, "దీని ప్రభావంబున నీకుఁ బుత్రుండు గలుగు" నని యాశీర్వదించి యచటువాసి చనియెను. చిత్రకేతుండా చరువును భక్తిపూర్వకంబుగ గ్రహించి యగ్రమహిషియగు కృతద్యుతి కొసంగెను. ఆమెయుఁ దద్భక్షణమున గర్భంబును దాల్చి యొక్కసుతునిఁ గనియెను. ఆ కొమరుని జననంబును వినఁగనే భూపాలునిమనంబునఁ గలిగిన సంతోషమును నాగేంద్రుఁడు గూడ వర్ణింపజాలఁడు.

చిత్రకేతుండు కృతస్నానుఁడై, యఖిలధరామరులను రావించి యపారధనంబులును, మణికనక వస్త్రవాహనంబుల నొసంగి గోభూధనంబులచేఁ దృప్తులఁ గావించి, యనేకవిద్యాశాలలనిర్మించి, బీదల కన్నవస్త్రదానంబుల నొసంగి, వికలాంగులు నివసించుటకు నిలయంబులం గట్టించి, వ్యాధిగ్రస్తు లగు

జనులకును, పశువులకును, ధర్మచికిత్సాలయముల నేర్పఱచి, నిర్వర్తితమనోరథుండై యగ్రమహిషియం దధికానురాగంబును జూపుచు రాజకార్యములయందప్రమత్తుఁడై యుండెను. తక్కిన భార్యామణులు రాజసమ్మానమును గాంచుచుండిన పట్టపుదేవియందు మనంబుల నసూయం గాంచి యించుకయును వెలిఁ బుచ్చక యీమన్ననకుఁ గారణము పుత్త్రుండ యని యీర్ష్యం జేసి యా బాలునకు విషమ్ముం బెట్టించిరి. ఉదయంబునఁ దల్లి చూచునప్పటికిఁ గుమారుఁడు మృతినొంది వికృతాకారుండై యుండెను. సుతుని మృతికిఁ గృతద్యుతి,

ఉ. కుంకుమరాగరక్తమగు కోమలవక్షము కజ్జలంబుతోఁ
బంకిలమైన బాష్పకణములపాల్పడ మజ్జన మాచరించుచుం
గంకణపాణిపల్లవయుగంబున ఱొమ్మున మోదికొంచు నా
పంకరుహాక్షి యేడ్చెఁ బరిభావితపంచమసుస్వరంబునన్.

ఆయార్తధ్వని విని చిత్రకేతుఁ డంతఃపురమ్మునకుఁ బరుగెత్తి, మృతుఁడైన కుమారుని పైఁ బడి శిరంబును మోదికొనుచు నెలుఁగెత్తి యేడ్చుచుండెను. ఈ వార్తను దివ్యదృష్టి నెఱింగి యాంగిరసుండు నారదునితోఁ గూడి చిత్రకేతు నంతఃపురమ్మునకు వచ్చి మృతుండైన కుమారుని వద్ద తలంబున మృతుండునుం బోలెఁ బడి దుఃఖించుచున్న రాజుం గనుంగొని యనేక విధంబుల నోదార్చిరి. పుత్త్రశోకం బగ్గలంబై దుఃఖంబు నాఁగఁ జాలకున్న నరేంద్రునకు మన

స్సంతుష్టిఁ గలిగింప నెంచి నారదుండు, బాలుకునిమృతకళేబరమును జూచి „ఓ జీవుండ! నీకు శుభంబయ్యెడు. ఇందుఁ బ్రవేశించి మీ తల్లిదండ్రులం జూచి వీరల దుఃఖంబు లార్చి, యాయుశ్శేషంబు ననుభవింపు" మని చెప్పెను. మహాముని వచనంబున నాజీవుండు బాలకళేబరమునఁ బ్రవేశించి మునితో నిట్లనియెను.

"ఓ మునిసత్తమా! కర్మవశంబున ననేక జన్మంబుల నెత్తుచుఁ జచ్చుచు నున్న నాకు వీర లేజన్మమునఁ దల్లిదండ్రులు?

తే. గీ. బాంధవజ్ఞాతి సుతులును, బగతు రాత్మ
వరు లుదాసీనమధ్యస్థవర్గములును.
సరవిఁ గనుచుందు రొక్కొక్క జన్మమునను
నెఱయఁ బ్రాణికి నొకవాని నిజముగలదె?

తే. గీ. రత్నములు హేమములు ననురాగలీల
నమ్మకంబుల నీవల నావల నగు
భంగి నరులందు జీవుండు ప్రాప్తుఁ డగుచు
నెలమిఁ దిరుగుచు నుండుఁ దా నెందుఁ జెడఁడు.

క. సతు లెవ్వరు సుతు లెవ్వరు
పతు లెవ్వరు మిత్రశత్రుబంధుప్రియ సం
గతు లెవ్వరు సర్వాత్మక
గాఁడై గురుసాక్షియైన ఘనుఁ డొక్కనికిన్.

అని ధీరవచనంబులం జెప్పి యా జీవుండు వోయెను. చిత్రకేతుండు నాలుని వచనంబుల లబ్ధజ్ఞానుండై సంసారంబును ద్యజించి కాళిందీనదికిం బోయి కృతస్నానుండై మౌనంబుతో నారదునకు నమస్కరించెను. నారదుండతనికి మహావిష్ణుమంత్రము నుపదేశించి యంగిరసునితోఁ గూడి బ్రహ్మలోకంబున కరిగెను. చిత్రకేతుండు నిష్ఠాగరిష్ఠుండై యా మంత్రంబు నుపాసించిన విష్ణుదేవుండు ప్రత్యక్షమై యతనికి విద్యాధరాధిపత్యమును దివ్యవిమానంబును నొసంగి యంతర్హితుం డయ్యెను. చిత్రకేతుండా విమానమునం దధివసించి మనోవేగంబునఁ ద్రిలోకంబులం దిరుగుచు నుండెను. ఇట్లు తిరుగుచుండఁగా నొక్కచోట,

సీ. తారహీరపటీర ధవళదేహమువాని
రమణీయనీలాంబరంబువాని
మణికిరీటస్ఫురన్మస్తకంబులవాని
గంకణకేయూర కరమువానిఁ
గర్బురమయదీప్త కటిసూత్రములవానిఁ
గరళయజ్ఞోపవీతములవాని
నతిసుప్రసన్న వక్త్రాంబుజంబులవాని
దరుణవివృత్త నేత్రములవాని

ఆ-వె. సిద్ధమండలంబు సేవింపఁ బుణ్యప్ర
సిద్ధివెలసినట్టి యుద్ధచరితుఁ

పద్మలోచనునకుఁ బాదపీఠంబైన
ఘనునిఁ బన్నగేంద్రుఁ గాంచె నతఁడు.

విశ్వభర్తయగు నా యనంతునిఁ గాంచి భక్తిపూర్వకంబుగ నమస్కరించి మహానందంబున స్తుతించి యమ్మహితుచే దివ్యజ్ఞానంబునుం బొంది తదనుజ్ఞాతుఁడై విమానయానంబున బురోభాగంబునకుం జనుచుం బోయి పోయి రజతగిరి ప్రాంతంబున కేఁగి,

శా. ఆవిద్యాధరభర్త గాంచె హరనీహారామృతావాసమున్
శ్రీవిభ్రాజితమున్ నిరస్తగిరిజాసేవాగతాయాసమున్
దేవానీకవికాసమున్ శుభమహాదేవాంఘ్రిసంవాసమున్
భూవిఖ్యాతవిలాసమున్ ద్రిభువనీపూతంబుఁ గైలాసమున్

ఆ కైలాసగిరీంద్రమునఁ గమలసంభవాద్యమరగణంబుచేతను, నందిభృంగ్యాదిప్రమథగణంబుచేతను, వినాయకకార్తికేయాదిస్వజనంబుచేతను, బరివేష్టితుండై వామాంకస్థితగౌరీవిలాసుండై యొప్పుచున్న పశుపతిని దర్శించి పక పక నవ్వి యద్దేవి వినుచుండఁ జిత్రకేతుం డిట్లనియె.

సీ. "కొమరొప్పఁగా లోకగురుఁడును గడలేని
ధర్మస్వరూపంబుఁ దాన యగుచు
జడలు ధరించియు సరిలేని తపమునఁ
బొడవైన యీ యోగిపుంగవులును

బ్రహ్మాదులు గొల్వ భాసిల్లు కొల్వులో
మిథునరూపంబున మెలఁతతోడఁ
బ్రాకృతుండును బోలె బద్ధానురాగుఁడై
లాలితుఁడయ్యె నిర్లజ్జతివిట
ఆ-వె. నకట! ప్రకృతిపురుషుఁడైనఁ దానేకాంత
మందుసతులతోడ నలరుఁగాని
యిట్లు ధర్మసభల నింతులతోఁ గూడి
పరిభవింపలేఁడు భ్రాంతిఁ గొంది.”

అని యీశ్వరుని ధిక్కరించిన సర్వసముండగు నప్పరమేశ్వరుండు చిఱునగవు మొగమునం జూపి యూరకుండెను. బ్రహ్మయును మునులును నిర్విణ్ణులైరి. పార్వతి కోపగించి “భూలోకంబున రాక్షసుఁడవై బ్రతుకు” మని శపించెను. ఆశాపంబునకుఁ జిత్తవికారంబు కొందక స్థిరచిత్తుండును గేశవభక్తుండు నగు చిత్రకేతుండు “దేవీ! నేనుకలమాటనంటి నని కోపించితివి. ఏజన్మంబున నున్నను పద్మనేత్రుని భక్తి నుండి నా మనంబు మరలకుండెడుఁగాక. జీవంబు భగవంతుని యంశమై యుండ దేహభేదంబును బరిగణింప నక్కఱలేదు. నేను బోవుచున్నాఁడ” నని యనాదిదంపతులకు నమస్కరించి పోయి రాక్షసకులంబునఁ బుట్టి పూర్వజ్ఞానంబున నారాయణభక్తిపరాయణుండై కొంతకాలమునకు దేహంబుఁ జాలించి శాశ్వత విష్ణులోక ప్రాప్తుఁడయ్యెను.

---

7. ప్రహ్లాదుఁడు:

ఆదిమహావిష్ణుండు వైకుంఠంబున లక్ష్మీయుతుండై యుండు మందిరంపు ద్వారంబుకడ జయవిజయులను నిరువురు భక్తులు ద్వారపాలకులై యుండిరి. ఒకనాఁడు బ్రహ్మమానసపుత్త్రులగు సనకసనందనాదులై దాఱేండ్ల బాలకులరీతి వేషంబులఁ జూపుచు దిగంబరులై వైకుంఠ మందిరంబునఁ జొచ్చునెడ జయవిజయులు

క. డింభకుల ననర్గళ వి
స్రంభకుల రమాధినాథసల్లాప సుఖా
రంభకుల ముక్తమానస
దంభకులం జొరఁగనీక తఱిమిరి మునులన్.

ఇట్లు జయవిజయులచేఁ దిరస్కృతులై రాక్షసజన్మంబు నెత్తుఁడని మునులు శపించిరి. శాపప్రభావంబున జయవిజయులు భూపతనంబు నందుచు మొఱలిడ వారు కరుణించి మూఁడు జన్మంబుల నారాయణునితో వైరంబూని నారాయణసన్నిధిం జేరఁగల రని శాపమోక్షము ననుగ్రహించిరి. ఆ జయవిజయులు హిరణ్యకశిపు హిరణ్యాక్షులన దితిగర్భంబున జనించిరి. హిరణ్యాక్షుఁడు లోకకంటకుఁడై వర్తించుటం జేసి శ్రీహరి వరాహావతారంబున వానిం గూల్చెను. హిరణ్య

కశిపుఁడు సోదరుని మరణంబునకుఁ గడుఁ జింతించి తల్లినిఁ దమ్ముని భార్యలను పుత్త్రులనుఁ దగువిధమ్మున నోదార్చి తాఁ గుపితుఁడై రణవిజయసాధకంబు లగునట్లు బ్రహ్మచే వరంబులంగొననెంచి యుగ్రతపంబు సేయుచుండెను. బ్రహ్మదేవుఁడు ప్రత్యక్షమయ్యెను.

మ. దివిజానీకవిరోధి మ్రొక్కెఁగని వాగ్దేవీమనోనేతకున్
సవిశేషోత్సవసంవిధాతకు నమత్సంత్రాతకున్ సత్తపో
నివహాభీష్టవరప్రదాతకు జగన్నిర్మాతకున్ ధాతకున్
వివిధప్రాణిలలాటలేఖనమహావిద్యానుసంధాతకున్.

ధాత వానిమ్రొక్కులం గైకొని "ఓయీ! నీ తపంబునకు మెచ్చితిని. నీకు వలయుదాని నొసంగెదను. కోరు" మని నుడివిన నతండు "రణంబులందు నాకెదురులేని శౌర్యంబును, లోకపాలుర నతిక్రమించు మహిమయును, భువనత్రయజయంబును మఱియు,

శా. గాలిం గుంభిని నగ్ని నంబువుల నాకాశస్థలిన్ దిక్కులన్
రేలన్ ఘస్రములన్ దమఃప్రభల భూరిగ్రాహరక్షోమృగ
వ్యాళాదిత్యనరాది జంతుకలహవ్యాప్తిన్ సమస్తాస్త్రశ
స్త్రాళిన్ మృత్యువులేనిజీవనములోకాధీశ! యిప్పింపవే

యని వేఁడి సాష్టాంగదండప్రణామం బాచరించి పాదంబులపై వ్రాలిన హిరణ్యకశిపుంగాఁగిటఁ గ్రుచ్చియెత్తి ధాత రక్షోనేత కిట్లనియె.

శా. అన్నా! కశ్యపపుత్త్ర! దుర్లభములీయర్థంబు లెవ్వారికిన్
మున్నెవ్వారలుఁగోరరీవరములన్ మోదించితిన్ నీయెడన్
నన్నుం గోరిన వెల్ల నిచ్చితిఁ బ్రవీణత్వంబుతో బుద్ధిసం
పన్నత్వంబున నుండుమీ సుమతివై భద్రైకశీలుండవై.

అని వరంబుల నిచ్చి యంతర్ధానంబు నొందెను. హిరణ్యకశిపుఁడు వరప్రభావంబున నజేయుండై విఱ్ఱవీగుచు నిజపురంబునకు వచ్చి హరియందెడతెగని వైరంబూని,

సీ. ఒకనాఁడు గంధర్వయూథంబుఁ బరిమార్చు
దివిజుల నొకనాఁడు దెరలఁ దోలు
భుజగుల నొకనాఁడు భోగంబులకుఁ బాపు
గ్రహముల నొకనాఁడుఁ గట్టివైచు
నొకనాఁడు యక్షుల నుగ్రత దండించు
నొకనాఁడు విహగుల నొడిసి పట్టు
నొకనాఁడు సిద్ధుల నోడించి బంధించు
మనుజుల నొకనాఁడు మద మడంచుఁ
గీ. గడిమి నొకనాఁడు కిన్నరఖచరసాధ్య
చారణప్రేతభూతపిశాచవన్య
సత్త్వవిద్యాధరాదులసంహరించు
దితితనూజుండు దుస్సహతేజుఁ డగుచు.

సమస్తభూతంబులకును భయంకరుఁడై ముల్లోకంబులను జయించి ఇంద్రుని సింహాసనంబధిష్ఠించి బుధులు సేయు

యాగంబుల హవిర్భాగంబులు దానకొనుచు మహాగర్వంబున వర్తించుచుండెను. సురముని యక్షగంధర్వ కిన్నరకింపురుష నరులు దానవభయంబునం జిక్కి పైకుచ్చరింప నస్వతంత్రులై లోలోన హరిని శరణంబు వేఁడుచు నార్తులై యున్నసమయంబున హరి కరుణార్ద్రచిత్తుండై యశరీరవాక్యంబుల,

మ. భయముం జెందకుఁడయ్య నిర్జరవరుల్ భద్రంబు మీ
కయ్యెడున్
జయమున్ లాభము భూతసంతతికి మత్సందర్శనప్రాప్తి న
వ్యయమై చేరు నెఱుంగుడున్ దితిసుతవ్యాపారభాషావిప
ర్యయముల్ గాలముగూడఁ జంపెదఁ జనుండం దాక మీత్రోవలన్.

అని యభయం బొసంగెను. త్రిలోకనివాసులను గూడ హరి యొసంగిన యభయంబున నించుక భయంబుఁ దక్కి క్రూరదానవ మరణసమయంబుఁ జూచుట కాతురులై యుండిరి.

ప్రహ్లాదజననము.

హిరణ్యకశిపుని భార్యయగు లీలావతి గర్భవతియై యున్నపుడు నారదముని దైత్యరాజచోదితుఁడై యామెకుఁ బుణ్యకథాశ్రవణం బొనరించుచుఁ దత్త్వవిషయంబును హరి మహిమంబును బోధించెను. ఆమె గర్భంబున నున్న బాలుండా పరవిద్యన్గ్రహించి నవమమాసాంతంబున జననంబుఁ

గాంచెను. ఆ బాలునకుఁ బ్రహ్లాదుడను నామంబు నిడిరి. అతఁడు పూర్వకృతపుణ్యవిశేషంబునఁ బూర్వజ్ఞానంబు గలిగి సర్వదా హరిచింతనాయత్తచిత్తుఁడై ప్రపంచవ్యక్తి విదూరుఁడై యుండెను. వాని కైదవయేఁడు జొరఁబడగనే దైత్యభర్త తన గురుకుమారుఁడగు చండామార్కుల రావించి "విద్య నేర్పు" మని నియోగించి ప్రహ్లాదు నొప్పగించెను.

ఉ. అంచితభక్తితోడ దనుజాధిపుగేహసమీపముం బ్రవే
శించి సురారిరాజసుతుఁ జేకొని శుక్రకుమారకుల్ పఠిం
పించిరి పాఠయోగ్యములు పెక్కులు శాస్త్రములా కుమారుఁ డా
లించి పఠించె నన్నియుఁ జలింపని వైష్ణవభక్తిపూర్ణుఁడై.

గురువులు సెప్పిన గ్రంథంబులం గల సారంబును స్వబుద్ధిని విమర్శించి పరతత్త్వయోగసారంబులం గ్రహించి యానందమును బొందుచుండెను. కొన్ని దినములకుఁ గుమారుఁడు నేర్చిన విద్యను బరిశీలించుటకు గురుకుమారునితోఁ బ్రహ్లాదుని రాజు తన యొద్దకు రావించి వానిని దొడపైఁ గూర్చుండఁ బెట్టుకొని యిట్లనెను.

హిర—కుమారా ?

క. అనుదినసంతోషణములు
జనితశ్రమతాపదుఃఖసంశోషణముల్
తనయుల సంభాషణములు
జనకులకుం గర్ణయుగళసద్భూషణముల్.

కావున నీవు నేర్చిన విద్యయందలి సారంబును నీముద్దు మాటలచే నుడివి నాకు హృదయానందమును గూర్పుము.

ప్రహ్లా:—తండ్రీ! సమస్త విద్యలకు సారమైనయొప్పు పరతత్త్వ వివేచనమే వేదజ్ఞానము. సర్వజీవాధికుండగు పరుని విషయంబులను బోధించునవియే శాస్త్రములు. పరుని చరిత్రంబులను బామరులకు బోధించునవియే పురాణములు. వీని సారంబులం గ్రహించి పరాత్పరునియందు లీనమైన పాఠకుని మనం బన్యవిషయాంబులందుం జొరం బడదు.

సీ. మందార మకరంద మాధుర్యమునఁ దేలు
మధుపంబు వోవునే మదనములకు
నిర్మలమందాకినీవీచికలఁ దూఁగు
రాయంచ సనునెతరంగిణులకు
లలితరసాలపల్లవఖాది యైచొక్కు
కోయిల చేరునే కుటజములకుఁ
బూర్ణేందు చంద్రికాస్ఫురితచకోరక
మరుగునే సాంద్రనీహారములకు

తే-గీ. నంబుజోదరుదివ్యపాదారవింద
చింతనామృతపానవిశేషమత్త
చిత్తమేరీతి నితరంబుఁ జేరనేర్చు
వినుతగుణశీల! మాటలు వేయు నేల?

చండ—(వడఁకుచు) ఏమీ! బాలకా! నీకీతుచ్ఛవిద్యలను నేను నేర్పితినా?

ఉ. పంచశరద్వయస్కుఁడవు బాలుఁడ వించుక కాని లేవు భా
షించెదుతర్క వాక్యములు సెప్పినశాస్త్రములోనియర్థమొ
క్కించుకయైనఁ జెప్పవసు రేంద్రునిముందటమాకునాదలల్
వంచుకొనంగఁ జేసితివి వైరి విభూషణ! వంశదూషణా

హిర—ఏమీ! గురుతనయా! నీపలుకులు నా చెవులకు వింతఁ గొలుపు చున్నవి. మీరు నేర్పనియెడల ముక్కుపచ్చలారని యీ పసిబాలున కింతటి వేదాంతములును వైరి స్తోత్రములు నెట్లు రాఁగలవు? త్రిలోకశాసనుండగు నీహిరణ్యకశిపునకిట్టి యపచారముఁ గావించి యెట్లుబ్రదికిపోఁ దలంచితిరి?

చండ—రాజేంద్రా! నిరపరాధులము. క్షమింపుము. ఈ బాలకునకీబుద్ధులు పుట్టువుతోడనే వచ్చినవి కాని మేము నేర్పలేదు. కొలదికాలము గడువిండు. మీ తనయునకుఁబూర్ణ శిక్షనొసంగి సన్మార్గంబునఁ బెట్టెదము.

హిర-మంచిది. క్షమించితిని. అటులనే చేయుఁడు. కుమారా!

శా. నాకుంజూడఁగఁజోద్యమయ్యెడిఁగదా నాతండ్రి! యీబుద్ధిదా
నీకున్ లోపలఁదోఁచెనో పరులు దుర్నీతుల్ పఠింపించిరో
యేకాంతంబున భార్గవుల్ పలికిరో యీదానవశ్రేణికిన్
వైకుంఠుండు కృతాపరాధుఁ డతనిన్ వర్ణింపనీ కేటికిన్.

మ. సురలందోలుట యోాసురాధిపతులన్ స్రుక్కించుటో సిద్ధులం
బరివేధించుట యో మునిప్రవరులం బాధించుటో యక్షకి
న్నరగంధర్వవిహంగనాగ పతులన్ నాశంబునొందించుటో
హరియంచున్ గిరియంచు నేలచెడ మోహాంధుండవై బాలకా!

ప్రహ్లా—తండ్రీ ! క్రోధగుణైకచిత్తుఁడవై శ్రీహరినిందూరకుము.

సీ. కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకునిఁ జూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణునాకర్ణించు వీనులు వీనులు
మధువైరిఁ దవిలిన మనము మనము
భగవంతు వలఁగొను పదములు పదములు
పురుషోత్తమునిమీఁది బుద్ధి బుద్ధి

తే. గీ. దేవదేవుని జింతించు దినము దినము
చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు
తండ్రి ! హరి జేరుమనియెడు తండ్రి తండ్రి.

సీ. కంజాక్షునకుఁగాని కాయంబు కాయమే
పవనకుంభితచర్మ భస్త్రిగాక
వైకుంఠుఁ బొగడని వక్త్రంబు వక్త్రమే ?
ఢమఢమ ధ్వనితోడి ఢక్కగాక

హరి పూజనములేని హస్తంబు హస్తమే !
తరుశాఖనిర్మిత దర్విగాక
కమలేశుఁ జూడని కన్నులు కన్నులే !
తనుకుడ్యజాల రంధ్రములుగాక

ఆ. వె. చక్రిచింత లేని జన్మంబు జన్మమే
తరళసలిలబుద్బుదంబుఁగాక
విష్ణుభక్తి లేని విబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడి పశువుగాక.

దయాసత్యశౌచంబులును, దాన ధర్మ కృత్యములును, భక్తిధ్యాననిష్ఠలును, భగవంతునియందుఁ జిత్త స్థైర్యమును, కార్యాకార్య వివేచనయును లేని జన్మంబు వ్యర్థంబు. అట్టి దేహి యెన్నఁడును భగవంతునికృపకుఁ బాత్రుండు కాఁడు. వానికి ముక్తి దొఱకదు.

సీ. సంసారజీమూత సంఘంబువిచ్చునే
చక్రిదాస్య ప్రభంజనము లేక
తాపత్రయాభీలదావాగ్నులాఱునే
విష్ణుసేవామృత వృష్టి లేక
సర్వంకషాఘౌఘ జలరాసులింకునే
హరిమనీషాబడబాగ్ని లేక
ఘనవిపద్గాఢాంధకారంబు లడఁగునే
పద్మాక్షనుతి రవిప్రభలు లేక

తే. నిరుపమాపునరావృత్తి నిష్కళంక
ముక్తినిధిఁ గానవచ్చునే ముఖ్యమైన
శార్ఙ్గకోదండ చింతనాంజనము లేక
తామరసగర్భునకు నైన దానవేంద్ర!

హిర—(కోపముతో) ఓయీ! చండామార్కులా!

చ. పటుతరనీతిశాస్త్రచయ పారగుఁ జేసెద నంచు బాలు నీ
వటు గొనిపోయి వానికిననర్హములైన విరోధిశాస్త్రముల్
కుటిలతఁ జెప్పినాఁడవు భృగుప్రవరుండ వటంచు నమ్మితిం
గటకట! బ్రాహ్మణాకృతివిగాక యథార్థపు బ్రాహ్మణుండవే

చండా—దానవేంద్రా! మావలన నొక్కింతయు దోసంబు లేదు. మేము వీనికి నేర్పిన విద్యలు వేఱు. ఈతఁడు స్వబుద్ధి ప్రకాశమున గ్రహించినవి వేఱు. ఇట్టి స్వతంత్రునకుఁ గులోచితవిద్య నేర్పుట మాకసాధ్యము. వీనికిఁ దగు శిక్షలొనరించి బుద్ధిమరల్చినగాని కుల మర్యాదను నిలుపఁడు.

హిర—ఓరీ! బాలకా! నీవు మా కులాచారవిధులం బ్రవర్తింతువా? లేక తగుశిక్షఁగావింప వలయునా?

ప్రహ్లా—నాకు శ్రీ హరిధ్యానము దక్క నొండుపని జేతగాదు.

అని ప్రహ్లాదుఁడు వచింపఁగానే దండతాడితమహోరగంబు కరణి దితిజాధిపుఁ డుగ్రుఁడై దానవ భటుల రావించి ప్రహ్లాదునకుఁ దగు కఠినశిక్షలొనర్చి బుద్ధి మరల్పుఁ డని

యాజ్ఞాపించెను. క్రూరులగు నా నిశాచర భటులు వాని మృదుశరీరంబును శూలంబులం బొడిచియు, ఖడ్గంబులఁ గోసియు, బగ్గంబులం గట్టియు నానావిధంబుల హింసింపం బూనిరి. ఆ బాలుని మనంబు హరియం దైక్యము నొంది యుండుటం జేసి,

చ. పలువురు దానవుల్ పొడువ బాలుని దేహము లేశమాత్రము
న్నొలియదు లోపలన్ రుధిరముబ్బదు కందదు శల్యసంఘమున్
నలియదు దృష్టిపై భవము నష్టముగాదు ముఖేందుకాంతియుఁ
బొలియదు నూతనశ్రమము పుట్టదు పట్టదు దీనభావముఁ.

ఆ బాలుఁడు ధృతినించుక యేనియు విడువక దైత్య దుష్కృత్యములను లెక్కసేయక శ్రీహరినిఁ దలంచుచుండెఁ గాని వారలు బాధించునపుడు,

ఉ. పాఱఁడు లేచి దిక్కులకు బాహువులొడ్డఁడు బంధురాజిలోఁ
దూఱఁడు ఘోరకృత్యమని దూఱఁడు తండ్రిని మిత్రవర్గముఁ
జీరఁడు మాతృసంఘము వసించు సువర్ణగృహంబులోనికిం
దాఱఁడు కావ రేయనఁడు తాపము నొందఁడు కంటగింపడుఁ.

ఆ దానవభటులా బాలకునిఁ దిట్టియుఁ, గొట్టియుఁ, బర్వతాగ్రములనుండి నేలకు దొర్లించియు, విషసర్పంబులచేఁ గఱపించియు, మంటలం ద్రోసియు, నేనుంగులచేఁ ద్రొక్కించియు, గఱఁగిన సీసముం జెవులలోఁ బోయించియు ననేక విధంబుల హింసించినను ,,శ్రీహరి'' యను దివ్యనామోచ్చా

రణము తప్ప వాని నోట నొండు బలికింపఁ జాల కుండిరి. తుదకు బ్రాణంబులు విసిగి తమ యసమర్థతను దానవపతి కెఱింగించిరి. హిరణ్యకశిపుఁడు క్రోధపూర్ణ మానసుండై ప్రహ్లాదుని సభాముఖంబునకుఁ బిలిపించి వానితో నిట్లనియె.

శా. ''ప్రజ్ఞావంతులు లోకపాలకులు శుంభద్వేషులయ్యున్ మదీ
యాజ్ఞాభంగము సేయనోడుదురు రోషాపాంగదృష్టిన్ వివే
కజ్ఞానచ్యుతమై జగత్త్రితయముం గంపించు నీ విట్టిచో
నాజ్ఞోల్లంఘన మెట్లు సేసితివి సాహంకారతన్ దుర్మతీ!

క. దిక్కులు గెలిచితి నన్నియు
దిక్కెవ్వఁడు రోరి నీకు దేవేంద్రాదుల్
దిక్కులరాజులు వే ఱొక
దిక్కెఱుఁగక కొలుతు రితఁడె దిక్కని నన్నున్.

అట్టిచో నీ వెవ్వని యండచే నింత నిర్భయంబుగా నాకుఁ బ్రతిపక్షుండవై వాదించుచుంటివో తెలుపుము హరియెవ్వఁడు? హరియను లోకపాలకుఁడు నీ చెప్పినచొప్పునఁ గలఁడేని నేను సురలందన్ని వారిలోకంబులఁ గ్రహించినపుడేల కనఁబడకుండె? వాఁ డెచ్చట నున్నాఁడో నాకుఁ జూపుము. లేదేని వాని స్మరణంబును మానుము. కాదేని నీ శిరంబుఁ దునిమెద'' నని హిరణ్యకశిపుఁ డుగ్రుఁడై పలికెను. వాని పలుకులను విని ప్రహ్లాదుఁడు శాంతవచనంబులతో నిట్లు విన్నవించెను. ''తండ్రీ!

ఉ. లోకములన్నియున్ గడియలోన జయించినవాఁడవింద్రియా
నీకముఁ జిత్తమున్ గెలువ నేరవు నిన్ను నిబద్ధుఁ జేయునీ
భీకరశత్రులారుఁ బ్రభిన్నులఁ జేసినఁ బ్రాణికోటిలో
నీకు విరోధి లేఁ డొకఁడు నేర్పునఁ జూడుము దానవేశ్వరా!

హరి లేఁడని తలంచు నీవు హరిచే నీతమ్ముఁడు సచ్చెనని నమ్మి కుపితుండవుగా నేల? హరియున్నాఁడని నమ్మియు విరోధించితివేని నీతమ్మునిగతియే నీకును బట్టును. కావున,

క. పాలింపుము శేముషి ను
న్మూలింపుము కర్మబంధముల సమదృష్టిం
జాలింపుము సంసారముఁ
గీలింపుము హృదయమందుఁ గేశవభక్తిన్.''

అని నుడివినఁ గుపితమానసుం డయ్యును సురారి తగు నుత్తరము సెప్పం జాలక కుమారునితో నిట్లనియెను.

శా. నాతోడం బ్రతిభాష లాడెదు జగన్నాథుండ నాకంటె నీ
భూతశ్రేణికి రాజు లేఁ డొకఁడు సంపూర్ణప్రభావుండు మ
ద్భ్రాతం జంపిన మున్న నే వెదకితిం బల్మారు నారాయణుం
డేతద్విశ్వములోన లేఁడు మఱి వాఁ డెందుండురా దుర్మతీ!

క. ఎక్కడఁ గలఁ డే క్రియ నే
చక్కటి వర్తించు నెట్టి జాడను వచ్చుం
జక్కడతు నిన్ను విష్ణుని
బెక్కులు ప్రేలెదవు వాని భృత్యునిపగిదిన్.

అని కఠినంబుగఁ బలుకు హిరణ్యకశిపునితోఁ బరమ భాగవతోత్తముండును బాల్యప్రాయుండు నగు ప్రహ్లాదుండు సిఱునగవున నిట్లుత్తరమిచ్చెను.

మ. "కలఁడంభోధిఁ గలండు గాలిఁ గలఁ డాకాశంబునం గుంభినిం
గలఁ డగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోతచంద్రాత్మలం
గలఁ డోంకారమునం ద్రిమూర్తులఁ ద్రిలింగవ్యక్తులం దంతటం
గలఁ డీశుండు గలండు తండ్రి వెదకంగా నేల యీ యా యెడన్.

క. ఇందుఁ గలఁ డందు లేఁడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెం దెందు వెదకి చూచిన
నందందే గలఁడు దానవాగ్రణి వినుమా!"

అని చెప్పెను. రాక్షసరాజు సందేహాకుల చిత్తుండై "హరి సర్వోపగతుండైనచో నీ స్తంభంబునఁ గలఁడా" యని రెట్టించెను. బాలకుండు "కలఁ" డని నిశ్శంకముగఁ జెప్పెను. దానవుఁడు మహోద్రేకియై యఱచేత నా సభామంటప స్తంభమును గొట్టెను. బాలుని మనోనిశ్చయమును ధృవపఱచి హిరణ్యకశిపు నంతమొందించుటకు హరి నృహరియై స్తంభంబునుండి వెల్వడెను.

క. నరమూర్తి గాదు కేవల
హరిమూర్తియుఁ గాదు మానవాకారము గే

సరి యాకారమునున్నది
హరిమాయారచిత మగు యథార్థముసూడన్.

లోక భయంకరలీల హరి స్తంభంబునం దావిర్భవించి మత్తశుండాలంబుపై కుఱుకు కేసరివడువున నరకేసరి దానవభర్తపై కుఱికి యొడిసిపట్టి. వాని వరంబులకు వ్యతిరేకంబు గలుగకుండ నిట్లు కేవల పురుషరూపంబును మృగరూపంబునుం గాని నరసింహరూపమున, రేయినుం బవలునుం గాని సంధ్యాసమయంబున నంతరంగంబును బహిరంగంబునుం గాని సభాద్వారంబున, భూమియును, గగనంబునుంగాని, యూరుమధ్యంబున ప్రాణరహితంబులును, ప్రాణ సహితంబులునుం గాని నఖంబులం జీల్చి లోకకంటకుండగు దానవుని భంజించి త్రైలోక్యాహ్లాదకరుండగు ప్రహ్లాదునకుం బట్టముఁ గట్టి యంతర్థానుండయ్యెను.

ప్రహ్లాదుండు రాక్షసకులంబు పవిత్రంబుగాఁ జిరకాలంబు రాజ్యంబు నేలి రాజ్యంబు విడిచి మునియై చిరంజీవిగా లోకంబున ప్రవర్తించెను.

---

8. త్రిపుర సంహారము.

మయుం డను దానవుఁడు ప్రబలశిల్పవిద్యానిపుణుఁడు. సురలచేత ననారతము నోడింపఁ బడుచుండిన తన కులము వారికి విజయము సేకూర్ప నెంచి తన విద్యానైపుణ్యంబున నయోరజతసువర్ణమయంబులై యెవ్వరికిని లక్షింపరాని గమనాగమనంబులును శత్రువిజయ సాధనంబులును గలిగి యలరారు త్రిపురంబులను నిర్మించి యిచ్చెను. రాక్షసులందఱు నందుఁ బ్రవేశించి కామసంచారులై సురలను, మునులను దిక్పాలురను గడుం బీడించి శోకంబు నొందించుచుండిరి.

క. లోకాధినాథు లెల్లను
శోకాతురు లగుచు శరణుఁ జొచ్చిరి దుష్టా
నీకవిదళనాకుంఠున్
శ్రీకంఠున్ భువన భరణచిత్తోత్కంఠున్.

లోకనాయకులు శివుని శరణంబు వేఁడి త్రిపురాలయు లగు దానవులు మాకు భరింపరాని కష్టములం గలిగించుచున్నారు.

క. దీనులముగాక యుష్మద
ధీనులమై యుండు మేము దేవా హితదో
ర్లీనుల మైనారము బల
హీనులమగు మమ్ముఁ గావు మీశాన శివా!

అని వేఁడిన బృందారకులయెడఁ గరుణయు, దుష్టులగు దానవులయెడఁ గినుకయు నేక కాలమునఁ బొడమిన కతన నుగ్రుం డుగ్రుఁడై దీను లగు సురల నోదార్చి ధీరత్వంబున మేరు మహీధరమును విల్లుగను వాసుకిని వింటినారిగను నారాయణుని నారాచంబుగను భూమిని రథంబుగను గమలాప్త కమలవైరులను జక్రంబులుగను వేదంబులను రథ్యములుగను సారసగర్భుని సారథిగను నభంబును ఛత్రముగను గైకొని గిరిరాట్తనూజను సామేనధరించి యుద్ధసన్నద్ధుండై త్రిపురంబులపై రణమొనరింప విలాసంబుగ బయ ల్వెడలెను. ఫాలనేత్రుని భీకరలీలఁ జూచి దివినున్న దివిజులు విస్మయంబును గాంచిరి. ఇట్లు సాంబుండు విజృంభించి మేరుచాపంబు నెక్కిడి త్రిపురంబులపై నొక్క బాణంబును విడిచెను. అయ్యది మార్తాండ కిరణంబులవోలె వేయు రూపంబులఁ దాల్చి పురదానవుల నొక్కసారి భస్మము గావించెను.

మయుండను దానవుఁడు మహాయోగి. అతండు యోగియై మహత్వమును గాంచినను, స్వకులజు లగు దానవుల యెడఁ గడుం బక్షపాతముఁ బూనియుండెను. దానవులు వెడఁగులై యెప్పుడును సురల మాయలం బడి హతు లగుచుండుటం గాంచి తన యోగబలంబున 'సిద్ధరసకూపం' బను దాని నొక్కటి నిర్మించెను. ఇప్పుడు శివునిచే నీఱైన త్రిపురదానవులను మయుండు గొనిపోయి సిద్ధరసకూపమునం బడవైచెను.

క. సిద్ధామృతరసమహిమను
శుద్ధమహావజ్రతుల్య శోభితతనులై
వృద్ధిం బొందిరి దానవు
లుద్ధతనిర్ఘాతపావకోపము లగుచున్.

క. రూపామృతరససిద్ధిని
దీపితులై నిలిచియున్న దేవాహితులన్
రూపించి వింత నొందెను
గోపధ్వజుఁ డాత్మ వారి కుహనోన్నతికిన్.

మృతులైన దానవులందఱును మున్ను గలిగియున్న బలముకంటె నధిక బలంబును, దేశంబును గలిగి సంఖ్యను మీఱియుండుటం జూచి శర్వుండు గర్వంబున దివ్యశరంబులఁ గుప్పెను. ముక్కంటి బాణములచే ననేకులు హతులైరి. హతులైన వారిపై మయుండు సిద్ధామృతరసముఁ జిలుకుచుండుటచేత దానవులసంఖ్య యెంతకును దరుగకుండెను. పార్వతీశుండు విరామము లేక వారితోఁ బోరు సలిపియుఁ బ్రయోజనము కనఁబడకుండెను. మయుఁడు సేయుచున్న మాయోపాయంబును మదకుఁ దెలిసికొని దానికిఁ దగు నుపాయంబును బన్నుటకు శర మైయున్న హరిని బనిచెను. హరియీశ్వర ప్రార్థితుఁడై,

శా. ఉత్సాహంబున నొక్క పాఁడి మొదవై
యూధంబు ఘ్రాణించుచున్
వత్సం బైతన వెంట బ్రహ్మ నడువన్
వైకుంఠుఁ డేతెంచి యా
దృత్సత్వంబునఁ గూపమధ్యరసమున్
ద్రావెన్ విలోకించుచున్
దత్సౌభాగ్యనిమగ్నులై మఱచి రా
దైత్యుల్ నివారింపఁగన్.

మాయాగోరూపంబున హరి యందందుఁ దిరుగుచు నెందేఁ బోయినట్లు తోఁచి యంతర్హితుం డయ్యెను. వత్సంబును గనఁ బడదయ్యెను. మయుండా నూఁతిం జూచి యందొక చుక్కయైన సిద్ధరసంబు లేకుండుటకుఁ జింతించి హరి మాయఁగా నెఱింగి ఖిన్నుండై చేయునది లేక దానవులను బురికొల్పెను. వారలినుమడించిన పరాక్రమముం గాంచి హరుపై విజృంభించిరి. అతండు కట్టలుకవహించి.

మ. శరియై కార్ముకియై మహాకవచియై సన్నాహియై వాహియై
సరథుండై సనియంతయై సబలుఁడై సత్కేతనచ్ఛత్రుఁడై
పరమేశుం డొక బాణమున్ విడిచెఁ దద్బాణానలజ్వాలలం
బురముల్ గాలె ఛటచ్ఛటధ్వని నభోభూమధ్యముల్ నిండగన్.

ఇట్లు హరుండు పురమ్ములం గూల్చి ఫాలనయనాగ్నిచే నభిజన్మహుర్తంబున దానవసమూహములను బూది జేసెను. అంబరంబున బారులు తీఱి తెప్పలువాల్చక చూచుచున్న సురలు మిగుల సంతోషంబున హరుపైఁ బుష్పవృష్టి

గురిసిరి. మునులు వేదపాఠంబున వేదముఖుండగు శర్వుని స్తుతించిరి. భూజనులు "సర్వేశుని యనుగ్రహంబున దానవ భయంబునకు దూరులమైతిమిక చా" యని యుబ్బి తబ్బిబ్బులైరి. త్రిపురాసుర సంహారమునకుఁ ద్రిజగంబులవారునుసంతసించి త్రిపురాంతకునకు విజయగీతంబులం బాడిరి. తఱువాత,

ఆ. వె. తృణకణములభంగిఁ ద్రిపురంబుల దహించి
పరముఁ డవ్యయుండు భద్రయశుఁడు
శివుఁడు పద్మజాది జేగీయమానుఁడై
నిజనివాసమునకు నెమ్మిఁ జనియె.

---

9. గజేంద్రుఁడు.

సుధారాశిలో ఏకతోయోజన విస్తృతంబును నంతియ యున్నతంబునునగు త్రికూటంబను పర్వతంబుగలదు. ఆపర్వత ప్రాంతమున వివిధవృక్షజాతులతోడను బహువిధ లతానికుంజములతోడను నొప్పువనంబుండెను. ఆవనతరులతాజాలంబులు పల్లవ కోరకకుసుమఫలభరితంబులై చూచువారలకుఁ గన్నుల పండువు సేయుచుండెను. ఒక్కనాఁడు త్రికూటపర్వత గుహాంతరసీమలనుండి యొక్క యేనుంగుల యూథంబు విహారార్థ మరణ్యము వెంబడి బయల్వెడలెను. అయ్యవి తిర్యగ్జంతువులగుటం జేసి వనసౌందర్యమును గన్నులతో ననుభవింపక పశుస్వభావంబున,

మ. కలభంబుల్ చెరలాడుఁ బల్వలము లా
ఘ్రాణించి మట్టాడుచుం
ఫలభూజంబులు రాయుచుం జివురుజొం
పంబుల్ వడిం మేయుచుం
బులులం గాఱెనుబోతులన్ మృగములం
బోనీక శిక్షించుచుం
గొలకుల్ సొచ్చి కలంచుచుం గిరులపైం
గొబ్బిళ్ళు గోరాడుచుం.



గజేంద్రుఁడు

క. తుండంబుల మదజలవృత
గండంబులఁ గుంభములను ఘట్టనసేయం
గొండలు దలక్రిందై పడు
బెండుపడున్ దిశలు సూచి బెగడున్ జగముల్.

ఇట్లు వేనవే లేనుంగులు గుంపులై చనుతఱి నొక్కగజరాజంబు కొన్ని కరేణువుల వెంటఁజిక్కి మార్గంబుఁదప్పెను. అటవీస్థలంబునఁ గడు దూరంబు దిరుగుచుఁ గొమ్మల విఱుచుచుఁ జెట్లను బెఱుకుచు నధికాయాసంబును జెందుటం జేసి కరిరాజు అధిక పిపాసం జెంది నీరుండు తావులకై వెదకుచు,

మ. అటఁ గాంచెన్ గరిణీవిభుండు నవఫుల్లాంభోజకల్హారమున్
నటదిందీవరవారమున్ గమఠమీనగ్రాహ దుర్వారమున్
వటహింతాలరసాలసాలసుమనో వల్లీకుటీతీరమున్
జటులోద్ధూతమరాళచక్ర బక సంచారంబు గాసారమున్.

ఆకాసారంబును జూచి కరి కరిణీయూథంబుతో నందు దిగి మహోత్సాహంబున.

క. తుండంబులఁ బూరించుచు
గండంబులఁ జల్లుకొనుచు గళగళరవముల్
మెండుకొన వలుఁదకడుపులు
నిండన్ వేదండకోటి నీటిం ద్రావెన్.

మఱియు నాకరిణీవల్లభుండు విగతాయాసుండై మడువునఁ గరిణీ సంఘంబుతో సరసంబులాడుచు నీరంబులను దుండంబు నిండుగఁ బీల్చి యాకాశంబున కెత్తి విశ్వాసం

బునఁ దన్నీరంబులం బింజింపుచు సరోవరంబునం గల సుందర కమలంబులఁ దూడులనుండి త్రెంచి విసరి వైచుచుఁ దుండంబుల నీటిలో ముంచి జలంబుల వాయువుం బూరించి బుడబుడ ధ్వనులఁ గల్పించుచు నానావిధంబులఁ గాసారంబును అల్లకల్లోలము సేయు నెడ నరదలి రాయంచలు భయంబున నభంబున కెగసిపోయెను. బకంబులు చెట్లపై వ్రాలెను. మత్స్యంబులు బురదలోఁ జొచ్చెను. అల్పంబులగు మొసళులు మడువునఁ గరియున్నవైపు వీడి యొండుదెసం దెఱలాడుచుండెను. ఇట్లుండ సారసాకరనివాసజంతువులకుఁ గల్పించిన మహారభసంబునకు మనంబునఁ గరిపైఁ గోఱకోఱఁబూని యొక్క మకరి కరిచరణంబు నొడిసిపట్టెను.

కరీంద్రుండు మకరిని లెక్కసేయక తుండంబునం బెకలించి దూరంబుగఁ బాఱవైచెను. మకరి నీటి యడుగున దివ్వునఁ బాఱివచ్చి మరలఁ గరిచరణంబును గాఢంబుగఁ బట్టిన దంతావళము దంతంబునఁ బొలసులు గదలునట్లుబొడిచి మకరినిఁ బదంబునఁ జిమ్మెను. ఆ యుగ్రగ్రాహంబు మదిలో నిది పనిగాదని తలఁచి వెనుకవైపునఁ జేరి యొండుచరణంబు వట్టిన,

క. కరిఁ దిగుచు మకరి సరసికిఁ,
గరి దరికిని మకరిఁ దిగుచుఁ గరకరిబెరయం
గరికి మకరి మకరికిఁ గరి
భర మనుచును నతలకుతల భటులరుదుపడన్.

కరిమకరంబు లొండొంటితో ఘోరంబుగాఁ బోరుచుండ మడువులోని యల్ప జంతువులు మడియుచుండెను. జలంబులు గల్మషంబులై చనియెను. దిగ్గజముల ధిక్కరించు గజరాజును నీటికిం దిగుచున్న మకరి పశ్చిమ దిగ్గజంబును గూడ బట్టునేమోయను భయంబునఁ దద్రక్షణార్థంబు పడమటి కొండమాటున డాగెనో యన రవి యస్తాద్రిం గ్రుంకెను.

ఆ–వె. జీవనంబు దనకు జీవనంబై యుంట
నలవుఁ జలము నంత కంత కెక్క
మకర మొప్పె డస్సె మత్తేభమల్లంబు
బహుళపక్షశీతభాను పగిది.

కరీంద్రుండు హీనబలంబుఁ గాంచియును మకరితో ననేకాహోరాత్రంబులు ఘోరంబుగఁ బోరి నిస్సారంబైన నిజాంగశక్తియును, ప్రబలంబైన మకరిశక్తియు గ్రహించి పూర్వజన్మ సంస్కారంబునఁ గించిద్వివేకము నంది,

శా. "ఏరూపంబున దీని గెల్తునిటమీఁదే వేల్పుఁ జింతింతు నె
వ్వారిం జీరుదు నెవ్వ రడ్డమిఁక నివ్వారిప్రచారోత్తమున్
వారింపం దగువార లెవ్వ రఖిలవ్యాపారపారాయణుల్
లేరే మ్రొక్కెదదిక్కుమాలిన మొఱాలింపం బ్రపుణ్యాత్మకుల్

ఉ. ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపల నుండు లీనమై
యెవ్వనియందుడిందుఁ బరమేశ్వరుఁ డెవ్వఁడు మూలకారణం
బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వముఁ దానయైనవాఁ
డెవ్వఁడు వానినాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్.

అని నిశ్చలచిత్తంబునఁ బురాణపురుషుం డగు నారాయణుని మనంబున ధ్యానించి పాహిపాహియని రక్షఁ గోరెను. భక్తక్లేశ నాశంకరుండును, సర్వభువన వశంకరుండును,

మ. అల వైకుంఠపురంబులో నగరిలో నామూలసౌధంబుదా
పలమందారవనాంతరామృతసరఃప్రాంతేందుకాంతోపలో
త్పలపర్యంక రమావినోది యగు నాపన్నప్రసన్నుండు వి
హ్వలనాగేంద్రము పాహిపాహియనఁ గుయ్యాలించి సంరంభియై.

మ. సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁ డే
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లముఁ జక్కనొత్తఁడు వివాదప్రోత్థితశ్రీభుజో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.

ఇట్లు సకలభువనత్రాతయగు లక్ష్మీనేత శీఘ్రగమనంబునం బయలుదేఱిన,

మ. తనవెంటన్ సిరిలచ్చివెంటనవరోధవ్రాతమున్ దానివె
న్కను బక్షీంద్రుఁడు వానిపొంతను ధనుఃకౌమోదకీశంఖచ
క్రనికాయంబును నారదుండు ధ్వజినీకాంతుండు రా వచ్చిరో
య్యన వైకుంఠపురంబునం గలుగువారాబాలగోపాలమున్.

ఇట్లు వచ్చి నారాయణుండు చక్రంబుఁ గేలం గీలించి నిర్వక్రపరాక్రమంబున నున్న నక్రంబుఁ జక్రంబునఁ సంహరించి ఇతి కర్తవ్యతామాధ్యంబునుం గాంచిన నాగంబును రక్షించెను. కరి హరిని స్తుతించి హరియనుజ్ఞ వడసి కరిణీయూథంబుతోఁ గూడి చని సుఖంబుండెను.

---

10 క్షీరసాగరమధనము.

రాక్షసులచేతఁ గడు బాధలు పడుచుండిన దేవతలు పితామహుని యొద్దకుఁ బోయి తమ కష్టంబుల నివేదించుకొనిరి. బ్రహ్మయు దివిజుల వెంట నిడికొని యాదినారాయణుని కడకుఁ బోయి యీ సురసమూహములం గావు మని వేఁడెను. సురలును విష్ణుదేవు ననేకవిధంబులం బ్రస్తుతించిరి. కరుణామయుం డగు కేశవుండు వారలం జూచి ,, ఓ బ్రహ్మ సుర సురేంద్రులారా! మీరు కాలమునకు లోఁబడి మఱికొంతకాలము దైత్యుల బాధల నొందుచుండుటనే యొప్పు. ఎట్లంటి రేని,

క. ఎప్పుడు దనకును సత్త్వము,
చొప్పడునందాఁక రిపులఁ జూచియుఁ దన మైఁ
గప్పికొని యుండవలయును,
నొప్పఁగ నహి మూషకమున కొదిఁగినభంగిన్.

అమృతంబుఁ గ్రోలితి రేని మీకు జరామరణంబులు గలుగకుండు. ఆ యమృతమును సృష్టించు నుపాయమును దాలుత దెల్పెదను వినుఁడు.

సీ. పాలమున్నీటిలోపల సర్వతృణలతౌ
షధములు దెప్పించి చాల వైచి

మందరశైలంబు మంథానముగఁ జేసి
తనర వాసుకిఁ దరిత్రాడు సేసి
నాసహాయంబున నలి నందఱును మీరు
తరువుఁడు వేగ మతంద్రు లగుచు
ఫలము మీఁద య్యెడు బహుళదుఃఖంబుల
బడుదురు దైత్యులు పాపమతులు

ఆ. వె. అలస టేమి లేక యఖిలార్థములు గల్గు
విపధిలోన నొక్క విషము పుట్టుఁ
గలఁగి వెఱవ వలదు కామరోషంబులు
వస్తుచయమునందు వలదు చేయ.

అని యోదార్చి వారలఁ దత్ప్రయత్నంబుల నుండుఁడని నియోగించెను. పిదప సురాసురులు సముద్రమున సకలౌషధములను దృణలతలును దెచ్చి పడవైచి మందర పర్వతమును బెకలించి నిలువఁ బెట్టి దానినిఁ గడలి దరికిఁ గొనిరాఁ గదలింప నయ్యది పైనఁ బడి దివిజులు కొందఱు హతులైరి. అప్పుడు హరిని మరలఁ బ్రార్థింప నతఁడు వచ్చి గిరిని సరిత్పతి దరికిఁ దెచ్చి దాని మధ్యంబున నిలిపి వాసుకిని రప్పించి కవ్వంపుఁద్రాడుఁగాఁ జుట్టి సురదానవుల కిచ్చి మథింపుఁడనెను. ఇంచుక సేపు త్రిప్ప నప్పటికి నపర్వతము సముద్రంబున మునింగి పాతాళంబునకుఁ బోవుచు సురదానవులఁగూడ నీడ్చుచుండెను. వారలా పట్టును విడువక

మరల హరినిం బిలువ నతండు కూర్మాకారుండై వచ్చి జలరాశి నిండునట్లు తా నొక కూర్మమై గిరియడుగునఁ జేరి పైకెత్తెను. అప్పు డతిశ్రమంబున దేవదానవులు సముద్రమును మథించిరి. అప్పు డమృతంబునకు మాఱుగా సర్వలోక ప్రళయంకర మగు హాలాహలము పుట్టెను. దేవదానవులు భయాక్రాంతులై పలాయను లగుచుండిరి. వారింజూచి హరి పిలిచిఁ "ఓయీ! మీరు పాఱిపోకుఁడు ఈహాలాహలమును భరింప సర్వలోక రక్షకుం డగు ఫాలనేత్రునకుఁ దక్కఁబరులఁ కసాధ్యము. మీరు పోయి పశుపతిం బ్రార్థింపుఁ" డని చెప్పెను. వారలు,

మ. చని కైలాసముఁ జొచ్చి శంకరుని వాసద్వారముం జేరి యీ
శుని దౌవారికులడ్డపెట్టఁ దలమంచుం జొచ్చి కుయ్యో మొఱో
వినుమాలింపుము చిత్తగింపుము దయన్ వీక్షింపుమంచుం బుజా
ననముఖ్యుల్ గనిరార్తరక్షణకళా సంరంభునిన్ శంభునిన్.

చూచి దీనముఖములతో దండప్రణామంబులాచరించి నిలువంబడి గౌరీసహితుండైన చంద్రజూటుని నార్తులై యిట్లు స్తుతించిరి.

"సీ. భూతాత్మ భూతేశ భూతభావనరూప
దేవ మహాదేవ దేవవంద్య
యాలోకములకెల్ల నీశ్వరుండవు నీవ
బంధమోక్షములకుఁ బ్రభుఁడ వీవ

సూత్రశరణ్యుండ వగు గురుండవు నిన్నుఁ
గోరి భజింతురు కుశలమతులు
సకలసృష్టిస్థితి సంహారకర్తవై
బ్రహ్మ విష్ణు శివాఖ్యఁ బరఁగు దీవు

ఆ. వె. పరమగుహ్యమైన బ్రహ్మంబు సదసత్త
్వంబునీవ శక్తిమయుఁడ వీవ
శబ్దకర్త వీవ జగదంతరాత్మవు
నీవ ప్రాణ మరయ నిఖిలమునకు.

అని స్తుతించిన దయాసాంద్రుండగు చంద్రశేఖరుండు వారల యెడ ననుగ్రహంబు సూపి గిరిజాయుతుండై కడలి కడకు వచ్చి యావిషముం గడిగా నొనర్చి కడుపులోని చతుర్దశ భువనంబులకు ముప్పు రాకుండఁ గంఠంబున యుండు నట్లు మ్రింగెను.

మ. కదలం బాఱవు పాఁప పేరులొడలం ఘర్మాంబుజాలంబు పు
ట్టదు నేత్రంబుల కెఱ్ఱరాదు నిజజూటార్ధేందుఁడుం గందదున్
వదనాంభోజము వాడ దా విషము నాహ్వానించుచో డాయుచో
బదిలుండై కడిసేయుచో దిగుచుచో భక్షించుచో మ్రింగుచోన్.

ఇట్లవలీల హాలాహలంబును శంభుఁడు మ్రింగ భయవిస్మయచిత్తులై హరి విధి సుర దానవులు శంకరునకుఁ బ్రణమిల్లి మరల జలధినిఁ దరువ మొదలిడిరి. కొంతవడికి

క. తెల్లనిమేనును నమృతము
జిల్లున జల్లించు పొదుగుఁ శితశృంగములున్
బెల్లుగ నర్థుల కోర్కులు
వెల్లిగొలుపు మొదలు పాలవెల్లింబుట్టెన్.

ఆధేనువును సురలును మునులును గైకొనిరి. మఱి కొంతసేపు ద్రచ్చుసరికి నుచ్చైశ్రవంబనెడు నొక్క తురగము పుట్టెను. దానిని బలిదైత్యుఁడు గైకొనెను. తఱువాతఁ గ్రమంబుగా నైరావతంబను తెల్లని యేనుఁగును గల్పవృక్షంబును, నప్సరోజనంబును, సుధాకరుండును, సిరియుఁ బుట్టిన నైరావత కల్పవృక్షాప్సరోగణంబుల నింద్రుండును, లచ్చిని హరియుం గైకొనిరి. మఱికొంతవడిఁ దరువ నమృతకలశహస్తుండై ధన్వంతరి యుద్భవించెను. అంత నాయమృతంబునుజూచి బలిష్ఠుఁడగు నొక్క దానవుఁడు కలశంబును బలిమిం గొని పాఱిపోవుచుండ "నమృతంబు పోయె పోయె" నని దివిజులు మొఱలిడిరి. దానవులలో దానవులును, దానవులును సురలును బలాబలంబులంబట్టి యాకలశంబు కొఱకు పోరుసల్పుచుండ వారలయెదుట విద్యుద్దీపము వోలె మెఱయు రూపలావణ్యములు గల యొక్క యువతీలలామం బగపడెను. ఆ కాంతామణిం జూచి దనుజులు చైదంబులం దక్కి ముక్తకాంతను జూచు మునులవోలె నిశ్చలచిత్తులై యామెవంకఁ జూచుచుండిరి. జగన్మోహినీ రూపంబును దాల్చిన పురుషోత్త

ముందు దేవదానవుల నొడంబఱిచి యమృతకలశంబును దాఁ జేతంగొని నిలువం బడియె. దానవు లామెను జూచి,

తే. "వనితకశ్యపు సంతతి వారమేము
భ్రాతలము కృతసమయత్న పౌరుషులము
జ్ఞాతులకు మాకు నేకార్థసంగతులకుఁ
బాలు దేఱని యర్థంబు బంచియిమ్ము."

క. సభ్యులమై యుండెద మిందఱ
మభయంబున వచ్చికొనెద మమృతంబును నీ
విభరాజగమన తప్పక
విభజింపు మపక్షపాత విరహితమతివై."

అని వేఁడిన నయ్యింతి కంతుని శరమ్ములు వోలె బలుకుటమ్ములుఁ జిమ్ముచుఁ బలువరుస యించుక వెలికి దోఁప జిఱునగవుఁ జిలుకుచు నద్దనుజవీరుల చిత్తంబులఁ బిగియఁ దోల నెంచి వారలతో నిట్లనియెను.

క. సుందరు లగు పురుషులఁ గని
పొందుదు నా యందు నిజము పుట్టదు మీరల్
బృందారకరిపులారా!
చెందరు కాముకుల విశ్వసింపరు ప్రెగ్గల్.

క. పలుకులు మధురసధారలు
దలఁపులు నానాప్రకారదావానలముల్

సెలుములు సాలావృకములు
సెలువల నమ్మాటలు వేదసిద్ధాంతములే.

అయినను నా నేర్చుకొలది నేర్పుమీఱ మీకుఁ బంచి యిచ్చెద" నని దేవాసుర సంఘంబులను వేఱువేఱ పఙ్క్తుల నేర్పఱిచి మధ్యనిలువంబడు నప్పటికి దేవదానవుల చిత్తంబులు చింతిత కార్యము నుండి యామతీ సుందరీ సౌందర్యము నందు దృష్టినిలిపి యున్నతఱిని నమృతంబంతయు నమరులకిచ్చి యమరపఙ్క్తిని రహస్యముగఁ గూర్చుండి సుధాపాన మొనర్చిన రాహు వను రక్కసుని శిరంబుఁ జక్రంబునం దునిమి హరి యంతర్హితుం డయ్యెను. దానవులు విష్ణుమాయ నెఱింగి మోసపడుటకుఁ జింతించి యమృతపానమత్తులును నమర్త్యులు నగు సురలం దలపడి ఘోరంబుగాఁ బోరు సల్పిరి. హరి యనుగ్రహంబున సురలు విజయులైరి.

11 వామనుఁడు

---:o:---

బలి యనునతఁడు విరోచనుఁడను దానవుని కుమారుఁడు. ఆతఁడు తన పూర్వుల యట్లుగాక బ్రాహ్మణులయందును బండితులయందును గడుంభక్తిగలిఁగి వైదికకర్మలందు నిష్ఠగలవాఁడై యుండెను. విప్రులకును మునులకును గొప్ప దానంబుల నొసంగి వారిచేత ననేకవరంబులంబడసెను. కాని రాక్షసులకు సహజవిరోధు లగు సురలయందుమాత్ర మతనికిఁ గడుం ద్వేషము. స్వర్గము మీఁది కెన్నియోమారులు దండెత్తి యోడిపోయెను. అటనుండి బ్రాహ్మణులను మిక్కిలి యాశ్రయించి వారి యనుగ్రహంబున నూఱు తురగమేధ యాగంబులను జేసి వారలకు గోభూహిరణ్య దానంబుల నొసంగి సురలను జయించుటకు సమర్థంబు లగు వరంబులం బడసెను. బలిచక్రవర్తి యొనరించిన క్రతువుల ప్రభావంబున నతని ప్రభుత్వకాలమున భూములు చక్కఁగ ఫలించి పశువులు వృద్ధిపొంది పాడిపంటలవలన ప్రజలు సుఖంబులం గాంచుచుండిరి. బలిచక్రవర్తి వరబలంబున ధీరుండై సురపురంబునకు దండునెత్తి ముట్టడి వేసెను.

ఇంద్రుండు తన కోటకు దేవసైన్యములను గాపువెట్టి సురగురుండగు బృహస్పతిని రావించి దానవుని ముట్టడి నెఱింగించి యిట్లనియెను.

క. ఈ రాజు రాజ్యమెల్లరు,
బో రాడు రణంబు సేయఁ బోయితి మేనిం
రా రాదు దనుజుచేతను,
జా రా దిటుమీఁద నేమి జాడ మహాత్మా

అని చెప్పిన దేవగురుండు గొంతతడ వాలోచించి తల పంకించి సురపతి కిట్లనియెను. “సురేంద్రా! వీఁడు బ్రహ్మణులగు భృగుప్రవరుల వరంబుల బలంబునం జేసి యజయ్యుఁడై యిటు వచ్చెను. కావున నిప్పట్టున వీనితో యుద్ధమొనర్చితేనిఁ బరాజయము కలుగును.

క. పరు గెలువ వలయునొండెను
సరి బోరఁగ వలయు నొండె జావలెనొండెన్
సరిగెలుపు మృతియు దొరకమి
సరసంబుగ మున్న తొలఁగి చనవలె నొండెన్.

మీర లమృత భక్షకులగుటచేతఁ జావరు. శత్రులచేఁ బరాజయము తప్పదు. కావునఁ దరుణము వచ్చు దనుక నెందేఁ డాఁగియుండుట కర్జంబని నిర్జరగురుండు వచించెను. దివిజులు గామరూపులై స్వర్గమును విడిచి కానలకుఁబోయిరి. బలి సురపురము నధీనముఁ జేసికొని దనుజసేనానాయకుల నందుంచి దన పురంబునకు మగిడి వచ్చెను.

దేవతల తల్లి యగు నదితి తనవా రడవుల పాలైరని చింతించుచు నొక్క దిక్కునఁ గూర్చుండెను. ఆమె భర్త

యగు కశ్యపుఁడు తనసతిం జూడవచ్చెను. ఆమెయుఁ బతికిఁ బూజాసత్కారంబుల గావించి నమస్కరించెను. కశ్యపుఁడు భార్యంజూచి,

మ. తెరవా! విప్రులుపూర్ణులేజరుగునే దేవార్చనాచారముల్
తఱితో వేలుతురే గృహస్థులుసుతుల్ ధర్మానుసంధానులే
నెఱి నభ్యాగతకోటి కన్నమిడుదే నీరంబునుంబోయుదే
మఱి లే కర్థుల దాసులన్ సుజనులన్ మన్నింపుదే పైదలీ.

అని దుఃఖించుచున్న భార్యనోదార్చి కౌఁగిటఁ జేరఁదీసి మూర్ధంబు ఘ్రాణించి చిబుకంబు దువ్వి కన్నీరు తుడిచిన నామె యిట్లనెను.

అదితి:—నాథా! దానవులు నా కుమారులం జిదిమి సురసదనమును వెడలించిరి. అందుచేత దుఃఖంబున మునిఁగియుంటిని. నా దుఃఖమును బాపి నన్నుఁ గావుము.

కశ్య:—నాతీ! దుఃఖించినఁ బ్రయోజనము లేదు.

ఆ-వె. నెలఁత! విష్ణునకును నిఖిలదేవాత్మున
కాననంబుశిఖియు నవనిసురులు
వారుదనియఁ దనియు వనజాతలోచనుం
డతఁడు దనియ జగములన్నిదనియు.

కావున జనార్దనునిఁ బ్రసన్నుం జేసికొని కష్టంబులం బాయుము.

అది:—(కన్నులు మూసికొని) ఓ విశ్వరూపా! దేవాదిదేవా! నిరపరాధులగు నాదిత్యులను రక్షించి స్వర్గమును వారి కిప్పింపుము. నేనొనర్చిన వ్రతంబు సత్యంబు గలదేని వైళంబ ప్రత్యక్షమై నాకు వరంబు దయసేయుము.

విష్ణు:—(ప్రత్యక్షమై) అనఘా! నీతలంపెఱింగితిని. శత్రులం బలవంతముగఁ జంప వలను పడదు. వీఁడు సత్కర్మనిరతుఁడు. కావున నేను నీ గర్భమునఁ బుట్టి సముపాయంబున వారినిఁ జయించెదను. నీవు శోకంబు దక్కుము.

అనిమహానుభావుండగు నారాయణుండు వామనుండై నిర్జరమాతృగర్భంబున నుద్భవించెను. బ్రహ్మాదులు మహాసంతోషంబున వామనుని స్తుతించిరి. భగవంతుండగు వామనుండు మునివేషయోగ్యంబులగు దండకృష్ణాజినాద్యుపకరణంబులధరించి యజ్ఞవేదికయందుఁగూర్చుండియున్నబలిచక్రవర్తియొద్దకుఁ బోయెను. బలి వామనునకు సాష్టాంగనమస్కృతులు సేసి భక్తిపూర్వకంబుగా „ దేవా! మీకేమికావలసి యీభక్తునికడ కరుదెంచితిరో సెలవిండు. మీరు కోరున దెట్టిదైన నొసంగెద " నని చెప్పిన వామనుఁడు,

„ఆ-వె. ఒంటివాఁడ నాకు నొకటిరెండడుగుల
మేరయిమ్ము, సొమ్ము మేర గొల్లఁ
గోర్కిదీర బ్రహ్మకూఁకటి ముట్టిన
దావకతుకసాంద్ర! దానవేంద్ర!"

అని వేఁడెను. దానవుఁడు " తనయంతవాని నల్పదానంబుఁగోరెనని లోఁ శంకించియు నల్లయని ధారాగ్రహితంబుసేయుటకు ధారాపాత్రంబును దెమ్మని భార్యకుఁ గనుసన్నఁజేసిన సుగుణరాశి యగు వింధ్యావళి పాత్రిం గొని పతిసన్నిధి నిలువంబడెను. దానవగురుండగు శుక్రాచార్యుండు కపటవిప్రుని యుదంతంబు మనసునఁ బట్టఁజాలక,

" మ. కులమున్ రాజ్యముఁ దేజమున్ నిలుపుమీ
కుబ్జుండు విశ్వంభరుం
డలఁతిం బోఁడు త్రివిక్రమస్ఫురణవాఁ
డై నిండు బ్రహ్మాండమున్
గలఁడే మాన్పనొకండు నా పలుకు లా
కర్ణింపు కర్ణంబులన్
వలదీ దానము గీనముం బనుపుమీ
వర్ణిన్ వదాన్యోత్తమా !

ఆ–వె. వారిజాక్షులందు వైవాహికములందు
బ్రాణ విత్త మానభంగమందుఁ
జకితగోకులాగ్ర జన్మరక్షణమందు
బొంకవచ్చు నఘము పొందదధిప ! "

అని యనేకవిధంబుల దానవభర్తకు బోధించెను. దానశౌండుండును సత్యనిరతుండునునగు బలిచక్రవర్తి గురునకభిముఖుండుగాఁ దిరిగి " దేవా ! మీ యుపదేశంబు లికఁ

విరమింపుఁడు. ఆఁడి బొంకినవాని జన్మంబుకంటె హీనంబు సృష్టిలో లేదు. మీ మాట చొప్పున బొంకినను మాటఁ గట్టిడి దేమి ?

క. ధాత్రిని హలికునకును సు
క్షేత్రము బీజములు నొకటఁ జేకుఱు భంగిన్
జిత్రముగ దాత కీవియుఁ
బాత్రముఁ జేకూఱునట్టి భాగ్యము కలదే ?

శా. కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే
వారేరీ! సిరి మూటఁ గట్టుకొని పోవం జాలిరే భూమిపైఁ
బేరైనం గలదే శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా!

శా. ఆదిన్ శ్రీసతికొప్పుపైఁ దనువుపై నంసోత్తరీయంబుపైఁ
బాదాబ్జంబులపైఁ గపోలతటిపైఁ వక్షంబుపై నూత్నమ
ర్యాదం జెందుకరంబుఁ గ్రిందగుట మీఁదై నాకరంబుంట మేల్
గాదే రాజ్యముగీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే.

మ. నిరయంబైన నిబంధమైన ధరణీనిర్మూలనంబైన దు
ర్మరణంబైనఁ గులాంతమైన నిజమున్ గానిమ్ము కానిమ్ము పో
హరియైనన్ హరుఁడైన నీరజభవుం డభ్యాగతుండైన నౌఁ
దిరుగన్ నేరదు నాదు జిహ్వ వినుమా! ధీవర్య! వేయేటికిన్.

ఆ–వె. బ్రదుకవచ్చుఁగాక బహుబంధనములైన
వచ్చుఁగాక లేమి వచ్చుఁగాక

జీవధనములైనఁ జెడుఁ గాక, పడుఁ గాక
మాటదిరుగ లేరు మానధనులు.

కావున నేనిక తప్ప" నని బలి యుత్తరం బొసంగెను. శుక్రుండు తనకు గలిగిన యవమానమునకు గుపితుండై "నా శాసనం బతిక్రమించుటం జేసి శీఘ్రకాలంబునం బదభ్రష్టుండవు గ" మ్మని శపించెను. మహాప్రదాత యగు నద్దనుజవిభుఁడు వాని శాపఫలంబు నొందుటకు సంసిద్ధుండై,

క. రమ్మా! మాణవకోత్తమ!
లెమ్మా! నీ వాంఛితంబు లే దన కిత్తుం
దెమ్మా! యడుగుల నిటు రా
నిమ్మా! గడుగంగవలయు నేటికిఁ దడయన్.

అని నిలుచుండియున్న వామనుని పవిత్రపాదంబులఁ బట్టి భార్య హస్తగతం బగు ధారాపాత్రం గ్రహించి వంచిన యుదకంబు జారకుండెను. బలి విస్మయము నొంది చూచుచుండెను. "ఉదకంబు రాకుండఁ గలశరంధ్రంబున శుక్రుం డిఱికి యున్నాఁ" డని సర్వజ్ఞుం డగు వామనుం డెఱింగి కుశాగ్రంబునఁ బొడిచెను. దాన నొక కన్ను గ్రుడ్డియై శుక్రుం డటనుండి వెళ్లెను. అనంతరంబ బలి విష్ణుపాదంబులఁ గడిగి,

శా. "విప్రాయ ప్రకటవ్రతాయ భవతే విష్ణుస్వరూపాయ వే
దప్రామాణ్యవిదే త్రిపాదధరణిం దాస్యామి" యంచుం గ్రియా

క్షిప్రుండై దనుజేశ్వరుండు వడుగుం జేసాచి పూజించి "బ్ర
హ్మప్రీత" మ్మని ధారవోసె భువనం బాశ్చర్యముం బొందఁగన్.

హ్రస్వాకారుం డగు దానవారి విశ్వాకారుం డై జగంబులన్నియును నిండి పదత్రయంబున ద్రిలోకంబుల నాక్రమించి బలినిఁ బాశబద్ధుం జేసి మరల వటురూపుం డయ్యెను. ప్రహ్లాదుండును బ్రహ్మయుఁ గైలాసుండును నారాయణుని స్తుతించి బలిని రక్షింపుమని వేడిరి. కృపాయత్తుం డగు వామనుండు బలిని పాశవిముక్తునిం జేసి "సావర్ణికమనువు వేళను నీ వింద్రుండవై సకల భువనంబులఁ బాలించెదవు. అంతదనుక సుతలాలయమున నుండుము. ప్రతినిమేషమున నేనును నా చక్రంబును నీతలంపున నుందుము. నీకు క్షేమంబు గలుగును. నీ కీర్తి యాచంద్రార్కముగ సకల భువనంబుల వెలసి యుండును. నీవు నీ బంధుమిత్ర దారసుతామాత్యులతో సుతలమునఁ బాలింపు" మని దీవించి హరి తిరోహితుం డయ్యెను.

12. సత్యవ్రతుండు.

—— :o: ——

సత్యవ్రతుం డను నొకరాజు తొల్లి ద్రవిడదేశంబున కధిపతియై సత్యవ్రతంబును బూని ప్రజలను దయతో నేలుచుఁ జిరకాలము రాజ్యము సేసెను. అతఁ డనేక క్రతువులం బొనరించి సాంసారికకృత్యములందును నైహికసుఖంబులందును విరాగముఁగాంచి కృతమాలికయను నొక్క యేటి పొంతఁ దప మాచరించుచుండెను. ఒక్కనాఁ డతండు హరిసమర్పణంబుగఁ దర్పణంబును విడుచుట కేటిజలంబులందోసిటఁదీసిన నొక్క మీనుపిల్ల యానీరంబునం జిక్కెను. దానిఁ జూచి రాజదిరిపడి యా నీరంబును మరల నదీజలంబున విడిచెను. ఆమీను మనుష్యవాక్యంబుల సత్యవ్రతునితో నిట్టులనియెను. ,, రాజేంద్రా! నీవు జ్ఞానివి. ఈ యేటిలోనుండు పెద్ద మీనులు మాబోటి చిన్నమీనులంబట్టి తినుచుండును. ఆపాటును దప్పించుకొనుటకు నిదోసిటంజేరిన నన్నుఁ గృపారహితుండవై మరల నేటఁ ద్రోచితివి. వృద్ధఝషంబుల భీతియట్లుండ,

ఆ-వె. వలలుఁ దారు నింక వచ్చి జాలరివేఁట
కాఱులేఱుఁగలఁచి కారవెట్టి
మిడిసి పోవ నీక మెడఁ బట్టుకొనియెద
రప్పు డెందుఁ జొత్తు ననఘచరిత!

క. భక్షించు నొండె ఝషములు
శిక్షింతురు ధూర్తు లొండెఁ జెడ కుండఁగ నన్

రక్షింపు దీనవత్సల
ప్రాణులఁ గాచుకంటె భాగ్యముఁ గలదే?,,

అని వేఁడినఁ గరుణాసాంద్రుం డగు నా రాజర్షిచంద్రుండు మీనడింభకంబును గమండలు జలంబునం బెట్టి యాశ్రమంబునకుఁ గొనిపోయెను. ఆ రేయి కడచు నప్పటి కా మీను కుండిక నిండి ,,రాజచంద్రా! నా మే నీ కలశంబున నిముడదు. వేఱొక తావుం గల్పింపు,, మని వేఁడెను. రా జొక కుండను గొనివచ్చి దాని నా నీరంబున విడిచెను. నిమేషకాలంబున నా కుండ నిండి యొండు తావుఁ జూపుమనెను. ఆ రాచపట్టి దయాగుణంబున కాటపట్టు కావున నా ఝషంబును నొక్క మడువున విడిచి కాపుండెను. అమ్మీను తనువు మడువున నిముడుటకుఁ బెద్దయగుటం జూచి యొక్క జలాశయంబునను నంతకుమీఱుటచేఁ దుదకు మహార్ణవంబునను ద్రోచెను. అప్పు డా మీనంబు “మహాత్మా! ఇందాకఁ బెంచి నన్నీ సముద్రంబునం దిగవిడిచితివి. ఉగ్రగ్రాహంబులు నన్ను మ్రింగివైచు. నన్ను వెలికిఁదీసి దయాసముద్రుండవై రక్షింపుము.,, అని మొఱ వెట్టుకొనియెను. ఆ రాజు చేఁప తెఱంగును జూచి,

సీ. ఒక దినంబున శతయోజనమాత్రము
విస్తరించెదు నీవు వినము చూడ
మిటువంటి ఝషపతుల నెన్నఁడు నెఱుఁగము
మీనజాతుల కిట్టి మేను గలదె!

ఏమిటి కెవ్వాఁడ వేల త్రిప్పించెదు
 కరుణ నాపన్నులఁ గావ వేఁడి
యంభశ్చరంబైన హరివి నే నెఱిఁగితి
 నవ్యయ నారాయణాభిధాన
తే. గీ. జననసంస్థితిసంహార చతురచిత్త!
దీనులకు భక్తులకు మాకు దిక్కు నీవ
నీదు లీలావతారంబు నిఖలభూత
భూతిహేతువు మ్రొక్కెదఁ బురుషవర్య!

వైకుంఠంబున లక్ష్మీవిలాసుడవై యుండెడు నీవు మత్స్యంబ వేల నైతివో యెఱింగించి యీ దీనుని శంకం బాపు"మని వేఁడెను. సత్యవ్రతుండును యోగిజనవరేణ్యుండు నగు నా భూపాలుని యెడ హరి దయాళుండై "రాజా! వినుము

సీ. ఇటమీఁద నీ రాత్రి కేడవదినమునఁ
 బద్మగర్భున కొక్క పగలు నిండు
భూర్భువాదిక జగంబులు మూఁడు విలయాబ్ధి
 లోనమునుంగు నాలోనఁ బెద్ద
నావ సేరఁగవచ్చు నా పంపు పెంపున
 దానిపై నోషధితతులు బీజ
రాసులు నిడి పయోరాశిలో విహరింపఁ
 గలవు సప్తర్షులఁ గలిసి తిరుగ
తే. గీ. మ్రోళ్లఁ గ్రానరాక ముంచు మొంజీకటి
మినుకుచుండు మునుల మేని వెలుఁగు

దోలఁగుచుండు జలధి దోధూయమానమై
నావ దేలుచుండు నరవరేణ్య!

మఱియు నావ మున్నీటి కరళ్ళకుఁ దిరుగఁబడి మునుఁగకుండ నేనా నావను గాపాడుచుఁ బొడువవచ్చిన జలచరంబులం జెఱుచుచు నుండెదను. దీనఁ నీకు దపసులకును నపాయంబు రాకుండును. ఆకారణంబున నేను మత్స్యరూపుండ నైతి" యని చెప్పి హరి తిరోహితుండయ్యెను, సత్యవ్రతుండు,

ఆ. వె. మత్స్యరూపియైన మాధవు నడుగులు
దలఁచికొనుచు రాచతపసి యొక్క
దర్భశయ్యఁ దూర్పు దలగడగాఁ బండి
కాచియుండె నాఁటి కాలమునకు.

అంతలోఁ జీఁకట్లుగ్రమ్మి కుంభవర్షముగురిసి సప్తసముద్రములేకమయ్యెను. తపసిమూఁకలును రాజును నావ నెక్కిరి. ఝషంబు నావ మునుంగకుండఁ గాపాడుచుండెను. బ్రహ్మ నిద్రఁ జెందుసమయంబున బ్రహ్మముఖోద్గతములగు వేదములను హయగ్రీవుఁ డను దానవభటుం డపహరించి మహాంబుధిం దాగిన ఝషరూపుండైన హరి వానిని సంహరించి వేదంబుల నుద్ధరించెను. ఆ మహాప్రళయంబున నావ నెక్కి యున్న సత్యవ్రతుండు హరిని స్తుతించి హరి తనకు సాంఖ్యయోగక్రియా సహితమగు పురాణసంహిత నుపదేశింప దానిం బఠించుచుఁ గల్పానంతరమున రాజర్షి వ్రతంబున సుఖంబుండెను.

13. అంబరీషుడు.

శంకరునిచే సనాతన బ్రహ్మజ్ఞానంబు నుపదేశముం బొంది మహాజ్ఞానియై వరలుచుండు నాభాగునకు నంబరీషుండు కుమారుండై జనియించెను.

శా. సప్తద్వీపవిశాలభూభరము దోస్స్తంభంబునం బూని సం
ప్రాప్తశ్రీయుతుడై మహావిభవ సంపచ్చాతురిం గల్గి దు
ర్వ్యాప్తింజెందక కృష్ణపార్చనలమేరంగాలముంబుచ్చుచున్
సుప్తింబొందక యొప్పె సద్గుణగరిష్ఠుం డంబరీషుం డిలన్

సీ. చిత్తంబు మధురిపు శ్రీపాదములయందు
పలుకులు హరిగుణపఠనమందు
కరములు విష్ణుమందిరమార్జనములందు
చెవులు మాధవకథాశ్రవణమందు
చూపులు గోవింద రూపవీక్షణమందు
శిరము కేశవ నమస్కృతులయందు
పదము లీశ్వర గేహపరిసర్పణములందు
కామంబు చక్రికైంకర్యమందు

తే. గీ. సంగ మచ్యుత జనతను సంగమందు
ఘ్రాణ మసురారి భక్తాంఘ్రికమలమందు
రసన తులసీదళములందు రతులు పుణ్య
సంగతులయందు యారాజ చంద్రమునకు.

ఇట్లు చిరకాలము దైవభక్తియుం, బ్రజానురాగంబును సమానంబుగ వహించి రాజ్యసుఖంబుల ననుభవించుచుం బరిపాలనంబు సేసి పిదప విరాగియై నిరంతరము హరిధ్యానంబు సేయుచుండును. కృపాంభోనిధియగు నారాయణుండు వాని భక్తికి మెచ్చి సకలసంరక్షకంబగు చక్రంబు నొసంగెను.

క. తనతోడినీడ కైవడి
ననురూపగుణాఢ్యయైన యాత్మమహిషితో
జనవిభుడు ద్వాదశీవ్రత
మొనరంగ హరిం గూర్చి చేసె నొకయేండు ధృతిన్.

ఆవ్రతాంతంబున గార్తికమాసంబున మూడురాత్రు లుపవసించి కాళిందీజలంబుల స్నాతుండై హరికి మహాభిషేకం బొనరించి పుష్పాదికములం బూజించి భూమీసురులకు ననేకార్బుదంబులు గోవులను సమర్పించి,

క. పెక్కండ్రు విప్రవరులకు
గ్రక్కున నతి భక్తితోడం గడుపులునిండం
జొక్కపుటన్నం బిడి విభుం
డొక్కెడం బారణము సేయ నుద్యోగించెన్

ఆసమయంబున మహర్షియు దురహంకారుండునునధిక తపోనిష్ఠాగరిష్ఠుండును నగు దుర్వాసముని వ్రతస్థలంబునకు వచ్చెను. అంబరీషుం డతిభక్తితో నమ్మునిం బూజించి యర్ఘ్యపాద్యంబుల నొసంగి ద్వాదశీపారణంబున కాహ్వానించెను. ఆయన, యమునానదికి స్నానార్థం బేగి వచ్చెదనని

రాజుతోఁ జెప్పి యచట్టు వాసిపోయెను. పారణసమయం బాసన్నంబయ్యెను మునిరాకుండుటం జూచి తత్తరంబున నచ్చటి విద్వజ్జనులతో,

"క. ముని నీరు సొచ్చి వెడలఁడు
చనియెడు ద్వాదశియు నింతఁ జనియెను నీలో
నన పారణసేయ వలయు
వినిపింపుం డర్మాధర్మవిధ మెట్టిదియో"

అని చెప్పిన వారలాలకించి ధర్మవిచారణంబు సేసి యేకగ్రీవంబుగ నమ్మునులు,

"ఆ-వె. అతిథి వోయి రామి నధిప ! యీ ద్వాదశి
పారణంబు మానఁ బాడి గాదు
గుడువకుంటగాదు కుడుచుటయునుగాదు
సలిలభక్షణంబు సమ్మతంబు"

అని ధర్మసంశయంబు దీర్చినన్నృపాలుం డబ్బు లొనరించెను. ఇంతలో దుర్వాసుండు కృతస్నానుండై జపతపాది కృత్యంబులఁ దీర్చుకొని వచ్చి రాజుచే సేవితుండై యతం డొనరించిన పనియాత్మజ్ఞానగోచరంబగుడు కోపించి యుఁకలి మంట క్రోధాగ్నికిం దోడుగా నుగ్రుండై "ఓయీ ! నీ వినయంబులు పయోముఖవిషకుంభము లట్లు యున్నవి. నన్నాతిథ్యమునకుఁ బిలిచి నీవుకుడిచికూర్చుండుట నన్నవమానించుట కాదా ? ఇదే చూచుకొ ? నిముసములో నిన్ను భస్మము గావించెద" నని ప్రలాపంబుల నాడి,

చ. పెటపెటఁ బండ్లుగీటుచు మనుభీకరుఁడై కనుఁగ్రేవ నిప్పుకల్
పొటపొటరాలగండములుపొంగ మునీంద్రుఁడు హుంకరించుచు
న్జట మొదలంటఁగా బెఱికి చక్కనదానన కృత్యనాయుధో
త్కటవరశూలహస్తయుతఁగా నొనరించి లయింప రాజుపై

ఆకృత్య కాలాగ్నిరీతి మండుచు నాయుధ హస్తయై నేలఁ జిందులు ద్రొక్కుచు జివ్వున రాజుపైకి వచ్చుచుండ

ఆ-వె. ఆ ప్రకార మెఱిఁగి హరివిశ్వరూపుండు
వెఱ్ఱితపసి సేయు వేడబంబు
జక్కఁబెట్టుమనుచుఁ జక్రంబుఁ బంచిన
వచ్చెనదియుఁ బ్రళయవహ్నిపగిది.

వచ్చి భీకరాకారయగు కృత్యను బూదిసేసి యంతటితోఁ దృప్తిపొందక ముని వెంటం బడిన నతండతిభయంబున బలాయితుం డయ్యెను. ఆ చక్రంబుగ్రజ్వాలలఁ గ్రక్కుచు శమనం బించుకయు లేక ముని వెంట నంటె,

మ. భువిఁ దూఱిన్ భువి దూఱు నబ్ధిఁ జొరన
బ్ధుల్ సొచ్చు నుద్వేగియై
దివిఁ బ్రాకన్ దివిఁ బ్రాకు దిక్కులకుఁ బో
దిగ్వీధులం జొచ్చుఁ జి
క్కి వెసం గ్రుంకినఁ గ్రుంగు నిల్వ నిలుచుం
గ్రీడింపఁ గ్రీడించు నో
క్కవడిన్ దాఁగసు వెంట నంటి హరి చ
క్రం బవ్యదుర్వక్రమై.

ఇట్లు వెంటనంటిన చక్రంబు బారినుండి తప్పించుకొనఁ జాలక క్రమంబుగ నింద్రుని, బ్రహ్మను, శివుని ప్రార్థించెను. వారిలో నొక్కరు నతనికి సాయపడఁ జాలక యుపేక్షించిరి. దుర్వాసుండు వైకుంఠంబున కేఁగి పురుషోత్తము నారాధించి చక్రంబు బారినుండి రక్షింపు మని వేఁడెను. భక్తపరతంత్రుండగు పద్మనాభుండు దుడుకుతనంబు, గావించిన దుర్వాసునిఁ గడుఁ జీవాట్లు పెట్టి దయాసముద్రుం డగు నంబరీషునిఁ బ్రసన్నునిఁ జేసికొని రక్షనొందు మని పంపెను. అప్పటి కొక వత్సరకాలంబు గడచినను మునికొఱ కంబరీషుఁడు భుజింపక వేచియుండెను. దుర్వాసుండు చక్రంబు వెంట రా నంబరీషునికడకు వచ్చి యార్తుండై "రక్షింపు" మని కోరెను. అతఁడు చక్రము స్తుతించి వారించి మునిని బ్రదికించెను. పిమ్మట దుర్వాసుని రాజు విధ్యుక్తముగఁ బూజించి యిరువురును మృష్టాన్నములం దృప్తులైరి. తరువాత నా నరపాలకుండు,

ఆ-వె. తనకు సదృశులైన తనయుల భావించి
ధరణిభరము వారిఁ దాల్పఁ బంచి
కాననంబు సొచ్చెఁ గామాదివిజయుఁడై
నరవిభుండు హరిసనాథుఁ డగుచు.

---

13. సగరుఁడు.

తొల్లి బాహుకుం డను భూపాలుండుగలఁడు. అతఁడు చాలకాలము రాజ్యము నేలెను. ఆయనకు వార్ధకము వచ్చువఱకును సంతానము లేకపోయెను. సంతానార్థియై యతఁడు పెక్కుస్త్రీలను బెండ్లిచేసికొనెను. అతఁడు ముసలివాఁడగు నప్పటికి పరరాజు లాతని జయించి రాజ్యము వశముఁ జేసికొనిరి. బాహుకుండు సభార్యుండై యడవుల కేగెను. అచ్చటఁ గొంతకాల ముండి మృతిఁ బొందెను. వాని జ్యేష్ఠభార్య యతని మరణంబునకుఁ గడు దుఃఖించి సహగమనము సేయుటకు సిద్ధమయ్యెను. అప్పు డచ్చటనున్న యౌర్వమునీశ్వరుఁ డామె గర్భవతియని యాత్మనెఱిఁగియాపెను వారించెను. ఆమెకుఁ గ్రమక్రమముగ నవమాసంబులు నిండెను. సవతులు మత్సరగ్రస్తలై చూడఁ జాలక యన్నమున విషముఁ గలిపి పెట్టిరి. దైవయోగంబున నా శిశువునకు మరణంబు గలుగక విషముతోఁ గూడ జనియించెను. గరము అనగ విషము. విషముతోఁ గూడిజనించుటచేత వానికి సగరుఁడని పేరువచ్చినది. సగరుడు దినదినప్రవర్ధమానుండై చక్రవర్తి యయ్యెను.

శా. చండస్ఫూర్తి నతండు తండ్రిపగకై సంగ్రామరంగంబులం
జెండెన్ హైహయబర్బరాదుల వధించెం దాళజంఘాదులన్

ముండీభూతులుగా నిరంబరులు గా మూర్తుల్ సభీభత్సులై
యుండం జేసి నిజార్థులన్ సగరనామోర్వీశుఁ డాలంబునన్

సగరుండు తా బ్రతుకుటకుఁ గారణుం డైన యౌర్వుని పంపున విష్ణుప్రియంబుగ ననేకాశ్వమేధ యాగంబులను గావించెను. ఒకయాగంబున నింద్రుండు యాగహయంబును బట్టి కపిలముని సన్నిధానంబునం గట్టిపెట్టెను. సగరుండు తన కుమారులను హయమును వెదకుటకుఁ బంపెను. వారలు జగం బెల్లఁ దిరిగి తిరిగి యశ్వంబు నెందును గానక భూమిని త్రవ్వి పాతాళంబున కేఁగి తపంబు నొనర్చుచున్న కపిలుని పజ్జ హయంబునుం జూచి,

చ. ఎఱిఁగితి మద్దిరయ్య తడ వేటికి గుఱ్ఱపుదొంగ బంటు నీ
జఱభునిఁ బట్టి చంపుఁ డతిసాధుమునీంద్రుఁడ పోలె నేత్రముల్
దెఱవక బాకినోరు మెదలింపక బైసుక పట్టె నంచు న
య్యఱువది వేవురున్ నిజకరాయుధముల్ ఝళిపించి డాయుచోన్

కపిలుఁడు నేత్రమ్ములం దెఱచెను. వారందఱును దన్నేత్రాగ్నిప్రభావంబున బూదియై కూలిరి. కొడుకు లందఱును హతులై రనివినియును సగరుండు దీక్షితుఁడై శాంతచిత్తంబున దుఃఖింపక తనమనుమండగు నంశుమంతుని హయాన్వేషణంబునకుం బంపెను. అతఁడు తండ్రులు త్రవ్విన బిలంబునుండి పోయి కపిలుని సన్నిధిని హయంబును దాని ప్రక్క గుట్టలుగఁ బడి యున్న తండ్రులబూదియును జూచి చింతించి నిశ్చలచిత్తుఁడై

కపిలుని మనంబున ధ్యానించి స్తోత్రమ్ములఁ జేసి ప్రసన్నునిఁ జేసికొని నిలువఁబడి యుండెను. కృపాయత్తచిత్తుండగు మునిపుంగవుఁడు వాని భక్తికి మనంబునఁ గడుసంతసించి హయంబును వానికిచ్చి "హతులైన నీ తండ్రుల బూదిపై గంగం బ్రవహింపఁ జేయుఁ" డని యానతిచ్చెను. వార లా యశ్వమును గొనిపోయి సగరునకిచ్చిరి. దానన తండు క్రతుసమాప్తి జెంది రాజ్యంబును బూజ్యుండగు నంశుమంతున కిచ్చి తా నడవుల కేఁగెను. అంశుమంతుండు రాజ్యాభిషిక్తుం డయ్యును పాలనం బొనరింపక తండ్రులయెడ భక్తి గలిగి,

క. జనకులు ప్రమగ్గినచోటికి
ననిమిషనదిఁ దెత్తు ననుచు నటవీస్థలికిన్
జనితపము సేయఁ జాలక
మనమున వగ లొలయు నంశుమంతుఁడు దీఱెన్.

క. అతని కొడుకు దిలీపుఁడు
భూతలమున గంగఁ దెచ్చి పొందించుటకై
ప్రీతిం దపంబు సేయుచు
భాతిం దేలేక కాలపరవశుఁ డయ్యెన్.

దిలీపుని సుతుం డగు భగీరథుండు నిశ్చలమనస్కుండై ఘోరతపం బొనరించి గంగను గాంచెను. కని స్తుతించి ప్రసన్నం జేసికొని,

క. "మా వారి భస్మరాసుల
నీవారిం గలిపికొనుము నెఱి మావారల్
నీవారిఁ గలయ నాకము
మావారికిఁ గలుగు నిది ప్రమాణముదల్లీ."

అని వేఁడిన గంగ యతని కిట్లని చెప్పెను. "ఓయీ! నేను భూలోకంబునఁ బడితి నేని నా వేగంబును నిల్పనోపువారెవ్వరు? మేదినీతలంబును భేదించి పాతాళంబునకుం బోవలయును. దానికిఁ దగు నుపాయంబు నాలోచింపు" మని చెప్పిన నతం డీశ్వరుని ధ్యానించి ప్రసన్నుం జేసికొని యమ్మహాత్ముని శిరంబునఁబడు నట్లేర్పఱచెను. గంగ స్వర్గంబునుండి శివుని నెత్తిఁ బడి యటనుండి భూమికి వచ్చి పాతాళంబునఁ జొచ్చెను.

మ. హరు మెప్పించి మహాతపోనియతుఁడై యాకాశగంగానదిన్
ధరకుం దెచ్చి నితాంత కీర్తిలతికాస్తంభంబుగా నవ్యయ
స్థిరలీలం బితృకృత్యమంతయు నొనర్చెన్ వారితానేకదు
స్తరవంశవ్యథుఁ డా భగీరథుఁడు నిత్యశ్రీకరుం డల్పుఁడే.

భగీరథుని కతంబున నతని తండ్రియుఁ దాతయు ముత్తాత యగు సగరుండును శాశ్వతస్వర్గావాప్తినందిరి.

15. శ్రీరాముఁడు.

కోసలదేశాధిపతి యగు దశరథునకుఁ గౌసల్యయను పట్టపుదేవియందు విష్ణ్వంశమున శ్రీరాముండును సుమిత్రా కైకేయీ లను భార్యలయందు భరతలక్ష్మణ శత్రుఘ్నులును బుత్త్రులై జనియించిరి. అందు రాముండు మహాపరాక్రముఁడు, తండ్రిపంపున విశ్వామిత్రుని యాగమును సంరక్షించుటకు రామలక్ష్మణులు మున్యాశ్రమములకుఁ బోవుచు మార్గమధ్యంబునఁ దాటక యను రక్కసిం బరిమార్చిరి. యాగమునకు భంగము గావించుచుండిన మారీచ సుబాహులను దానవవీరులను దూలించిరి. విశ్వామిత్రుండు బాలకులయందుఁ గరుణవహించి మహాస్త్రముల నుపదేశించెను. తఱువాతఁ గౌశికుండు రామలక్ష్మణులను విదేహదేశపు రాజగు జనకుండు సేయు యజ్ఞంబుఁ జూచు నెపంబున వెంట నిడికొని పోయెను. ఆ యాగకాలంబున జనకుఁడు "శివువిల్లు విఱిచిన వానికిఁ దన కూఁతు సీత నిచ్చి వివాహంబు సేయుదు" నని కూడఁ బ్రకటించెను. అందుచేత ననేక రాజవర్యులు విదేహరాజపత్తనమునకు వచ్చి విల్లు నెత్తుటకుఁ గూడ సమర్థులు గాక విముఖులై కూర్చుండి యుండిరి. ఇంతలో శ్రీరాముండు,

మ. ఒక మున్నాఱుగదల్చి తెచ్చినలలాటోగ్రాక్షుచాపంబు బా
లకరీంద్రంబును లీలమైఁ జెఱకుఁ గోలం ద్రుంచు చందంబునన్

సకలోర్వీశులు జూడఁగా విఱిచె దోశ్శక్తిన్ విదేహక్షమా
పకగేహంబున సీతకై గుణమణిప్రస్ఫీతకై లీలతోన్.

విల్లు విఱిచి సీతం బెండిలియాడి పురాభిముఖుండై వచ్చుచు మార్గమధ్యంబునఁ బరశురామునకు గర్వభంగము సేసి నిజపురంబునకు వచ్చి రాజ్యాభిషిక్తుండగుటకు సిద్ధముగ నున్న సమయంబున,

క. దశరథుఁడు మున్ను గైకకు
వశుఁడై తానిచ్చినట్టి వరముకతన వా
గ్దశ సెడక యడవి కనిచెను
దశముఖముఖకమలతుహినధామున్ రామున్.

క. జనకుఁడు వనిచిన మేలని
జనకజయును లక్ష్మణుండు సంసేవింపన్
జనపతి రాముఁడు విడిచెను
జనపాలారాధ్య ద్విపదసాధ్య నయోధ్యన్.

అడవికిఁ బోయి యనేక క్రూరదానవుల సంహరించి దండకారణ్యమధ్యంబున నొక్క పర్ణశాల నిర్మించి జాయానుజ సహితుండై రాముండు నియమితకాలంబును గడపుచుండ రావణుండు సీతాసౌందర్యంబునువిని రామలక్ష్మణులు లేనినితఱి మాయాముని వేషంబున వచ్చి,

ఉ. ఆ యసురేశ్వరుండు వడి నంబరవీథి నిలాతనూజ న
న్యాయము సేసి నిష్కరుణుఁడై కొనిపోవఁగ నడ్డమైనఘో

రాయతహేతిఁ ద్రుంచె ననహాయత రామనరేంద్రకార్యధ
ర్త్రాయువుఁ బక్షవేగపరిహాసితవాయువు నాజటాయువున్.

అంత నా శ్రీరామచంద్రుండు లక్ష్మణసహితంబుగఁ సీతను వెదకుచుఁ జని వాలినిఁ జంపి యతని సోదరు సుగ్రీవు నెయ్యముం గాంచి యతని బంటు హనుమంతుని సీతను వెదకఁ బంపెను. అతఁడు,

క. అలవాటు కలిమి మాగుతి
లలితామితలాఘవమున లంఘించెను శై
వలినీ గణసంబంధిన్
జలపూరిత ధరణి గగన సంధిన్ గంధిన్.

ఇట్లు సముద్రంబు దాఁటి సీతం గని తిరిగి వచ్చుచు హనుమంతుండు రావణసుతులం బరిమార్చి లంకను దహించి మరల సముద్రంబును లఘించి సీతాకథనంబు రామునకుఁ దెల్పెను. శ్రీరాముండు వానర సైన్యంబులం బ్రోవుసేసి సముద్రమునకు సేతువుం గట్టి సైన్యంబులతో రావణునిముట్టి బంధుమిత్రామాత్య సహితంబుగ వానింగిట్టి పూతచరితసీతాసతిం జేపట్టి శత్రుసోదరుండును సుగుణాభిరాముండును, నిజభక్తుండును నగు విభీషణునకు దైత్యరాజ్యముం గట్టి సీతాలక్ష్మణులతోఁ బుష్పకంబు నెక్కి యయోధ్యాపురంబునకు వచ్చెను. లోకక్షేమంకరుండగు రామధరావరుండు వచ్చుతఱిని,

మ. ,ఇతఁడే రామనరేంద్రుఁ డాయుబలశౌయింద్రారిఖండించెన
ల్లతఁడే లక్ష్మణుఁ డాతఁడే కపివరుం డాపొంతివాఁడే మరు
త్సుతుఁడా చెంగటనా విభీషణుఁడటంచుం జేతులం జూపుచున్
నతు లెల్లం బరికించి చూచిరి పురీ సౌధాగ్ర భాగంబులన్.

రామచంద్రుండు పురజనులందఱకును నేత్రపర్వంబగునట్లు దీర్ఘంబగు పురవీథిం జనిచని నిజసౌధంబును బ్రవేశించి

ఉ. తల్లుల కెల్ల మ్రొక్కి తమ తల్లికి వందనమాచరించి యు
ల్లల్ల బుధాళికిన్ వినతుఁడై చెలికాండ్రను దమ్ములం బ్రసం
ఫుల్లతఁ గౌఁగిలించుకొని భూవరుఁడోలిఁ గృపారసంబు రం
జిల్లఁగఁ జాలమన్ననలు సేసె నమాత్యులఁ బూర్వభృత్యులన్.

తఱువాత శ్రీరాముండు పట్టాభిషిక్తుండై రాజ్యంబును బూజ్యంబుగ నేలుచుండెను.

16. పరశురాముఁడు.

కుశాంబునకుఁ గుమారుండైన గాధి యను నరపాలునకు సత్యవతి యను కూఁతురుండెను. ఋచికుం డను నొక మునిసత్తముఁడు వివాహార్థియై యనేకస్థలంబులందిరిగి యెందునుం దగుకన్యకం గానక గాధి యింటికివచ్చి సుగుణవతియును, రూపవతియును నగు నతని కూఁతు సత్యవతినిఁ జూచి యామెను పెండ్లియాడఁదలంచి ,,సత్యవతినిఁ దన కి'' మ్మని గాధి నడిగెను. అతఁడు గారాబంబుగఁ బెంచుకొనుచున్న తన కూఁతును నడవులవసించు మునికిచ్చుటకు మనంబున శంకించి యతఁడు కోపించునను భయంబునఁ ,,గెల్లని మేనులను నల్లని చెవులును గల వేయి గుఱ్ఱంబుల యుంకువ యిచ్చినఁ గన్య నిచ్చెద''నని చెప్పెను. ఋచికుండు వరుణునాశ్రయించి గుఱ్ఱంబులం దెచ్చి యిచ్చి సత్యవతిం బెండ్లియాడెను. ఋచికుని భార్య ,,తనకుఁ దల్లికి సుతుల ననుగ్రహింపుఁ డని పతిని వేఁడ నతఁడు తపఃప్రభావంబునఁ జరుయుగంబు గల్పించి ,,క్షత్రమంత్రజనకంబగు చరు వత్తకిచ్చి రెండవది నీవు తిను'' మని చెప్పి భార్యకిచ్చి తా నదికరిగెను. వారలా చరువు నజ్ఞానంబున వ్యత్యాసంబుగఁ దినిరి. ముని వచ్చి యా వ్యత్యాసంబును మొగములం జూచి కనుగొని

ఆ. వె. ,,తల్లిచరువు నీవు దాల్చి నీ చరువేల
తల్లిపాల నిడితి తరళనేత్ర

కొమ్మ యింక నీకుఁ గ్రూరుండు పుట్టు నీ
యమ్మ బ్రహ్మవిదుని ననఘుఁ గాంచు".

అని చెప్పిన నయ్యింతి వెఱచి నాథా! క్రూరుం డగు పుత్త్రుని భరింపఁ జాల, ననుగ్రహింపు" డని వేఁడ నతఁడు మహాసత్యవ్రతుం డగుటం జేసి "ఆ క్రూరత్వము నీ కొమరునియందుఁ గాక మనుమనియందు వర్తించు" నని యనుగ్రహించెను. అంత గొంత కాలమునకు గాధికి విశ్వామిత్త్రుండును ఋచికునకు జమదగ్నియును బుట్టిరి.

జమదగ్ని రేణుక యను దానిం బెండ్లియై వసుమ్నాది కుమారులం గనియెను. అందుఁ బరశురాముఁడను నతఁడు పురుషోత్తము నంశంబున జనియించెను ఆ కాలంబున రాజై యుండిన కార్తవీర్యార్జునుఁడు వేఁటకై యొకనాఁడు వనంబున కేఁగి జమదగ్ని యాశ్రమమునకు వచ్చి యమ్మునిని సందర్శించెను. మునీశ్వరుఁడు వాని భక్తికి సంతసించి హోమధేనువు మహాత్త్వంబున రాజునకును నతని పరివార సైన్యములకును సంపూర్ణభోజనము నొసంగెను. అర్జునుఁడా ధేనువు మహత్త్వంబునకు మెచ్చి దానిం గైకొని మునివారించినను వినక పురంబునకుఁ బోవుచుండెను రాముండు వచ్చి రాజు దుష్కృత్యమును విని.

మ. ప్రళయాగ్నిచ్ఛటభంగిఁ గుంభివిదళింపం బోవు సింహాకృతిం
బెలుచన్ రాముఁడు లేచి వెంట నడిచెం బృథ్వీతలం బెల్లనా
కులమై క్రుంగఁ గుఠారియై కవచియై కోదండియై కాండియై
ఛలియై సాహసియై మృగాజినమనోజ్ఞశ్రోణియై తూణియై.

చని రాజుం జేరి కయ్యంబునకుం జీరి నిలుచుండిన నృపతి రాముం జూచి కోపించి,

ఉ. బాలుఁడ వెట్టి బ్రాహ్మణుఁడ వు బ్రాహ్మణుకై వడినుంట మాని భూ
పాలురతోడ భూరిబలభవ్యులతోడ భయంబుఁ దక్కి క
య్యాలకు వచ్చినాఁడు మనయం దిఁకఁ బాపము లేదు లెండు లెం
డేల సహింప భూసురుని నేయుఁడు వ్రేయుఁడు కూల్పుఁ డిమ్మహిన్

అని యెదిరించిన రాముండు భూరి తేజంబున వాని సైన్యంబులను నిర్మూలంబు సేసి కార్తవీర్యుని సహస్రబాహువులను ఖండించి వానిం దుదముట్టించి హోమధేనువుం గైకొని తెచ్చి తండ్రికి సమర్పించెను. జమదగ్ని రాజును జంపినందునకు మిక్కిలి చింతించి కుమారునితో నిట్లనియెను.

క. క్షమ గలిగిన సిరి గలుగును,
క్షమ గలిగిన వాణి గలుగు శారదప్రభయున్
క్షమ గలుఁగ దాన గలుగును
క్షమ గలిగిన మెచ్చు శౌరి సనయుఁడు తండ్రీ.

క. పట్టపు రాజును జంపుట
గట్టలుకన్ విప్రుఁ జంపు కంటెను బాపం
బట్టి ట్టనకుము నీ వీ
చెట్ట సెడం దీర్థసేవ సేయుము తనయా.

అని చెప్పు సమయంబున నంతకు ముందుఁ జాలతడవుగ నేటికి నీరుఁ దేఁబోయిన రేణుక వచ్చి నిలిచెను. ఆమె

వైఖరినిఁ బట్టి యామె త్రోవలో నొక్క సరోవరంబున
సభార్యుండై జలకంబు లాడుచున్న చిత్రరథునియందీపెమనం
బు దగిలినట్లు గ్రహించి యుగ్రుండై తొలికొమరులఁ బిలిచి
“రేణుకను నఱుకుఁ” డని శాసించెను. వారలాపని నొనర్పక
యూరకుండిరి. రామునివంకఁ జూచి ,, తల్లిని భ్రాతలను
జంపు ” మని యాజ్ఞ యిచ్చెను. రాముఁ డట్లచేసెను.

శా. తల్లిన్ భ్రాతలనెల్ల జంపుమనుచోఁ దాఁ జంపిరాకున్న బెం
పెల్లం బోవ శపించుఁ దండ్రి తనపంపేఁ జేయుదుం గాక మెచ్చినా
తల్లిన్ భ్రాతల నిచ్చు నిక్కము తపోధన్యాత్మకుం డంచు వే
తల్లిన్ భ్రాతలఁ జంపె భార్గవుఁడు లేదా చంపఁ జేయాడునే.

వారలం ద్రుంచిన జనకుండు మెచ్చి ,,వలయువరంబుల
వేఁడు” మని చెప్పెను. రాముండు ,, తల్లియు సోదరులును
బ్రదుకునట్లును, రణంబులఁ దన కప్రతిహతవిజయంబులభించు
నట్లును, జిరజీవిత్వము తనకుఁ గలుగునట్లును వరంబులి” మ్మని
వేఁడిన నతఁ డట్లొనరించెను. తఱువాత రాముండు లేనితఱిని
హైహయులువచ్చి తమ తండ్రిని జంపించె నను కోపంబునఁ
దపంబు సేయుచున్న జమదగ్ని శిరంబును ఖండించి పాఱిపో
యిరి. పరశురాముండు వచ్చి వారలను నిశ్శేషంబుగఁ బరి
మార్చి యంతతోఁ గ్రోధంబుతీరక ,, క్షత్రజాతి సంతతియును
రూపుమాపెద”నని శపథంబుసేసి యిరువదియొక్కమాఱులు
దండెత్తి రాజకులమును నాశనము చేసెను.

---

17. యయాతి.

—:0:—

నహుషుం డను రాజవరేణ్యునకు యతియు యయాతి
యు సంయాతియు నాయాతియుఁ వియతియు కృతియు నను
నార్వురు కుమారులు కలిగిరి. నహుషుండు యతికి రాజ్యము
నప్పగించి వానప్రస్థముం గైకొనియెను. యతియు నైహిక
సుఖంబులందు విరక్తుండై,

క. రాజ్యంబు పాపమూలము
రాజ్యముతో నొడ లెఱుంగరాదు సుమతియుం గా
రాజ్యమునఁ బూజ్య నెఱుఁగఁడు
రాజ్యము గీజ్యమ్ము ముక్తిరతునకు నేలా ?

అని పలికి యతఁడు రాజ్యమును విడిచి కానలకుఁ జని
యెను. తఱువాత యయాతి రాజ్యకాంక్షవహించి మహీపతి
యై తమ్ములకుఁ గొంతరాజ్యభాగమ్ము నొసంగి న్యాయపథం
బున వర్తించుచుండెను. కొంతకాలమునకు వన్యమృగంబులు
సెలరేఁగి పౌరులకు బాధలు కలిగించుచుండ నతండు సైనిక
నికాయములతో మృగయార్థ మరణ్యమున కేఁగెను.

రాక్షసులమంత్రియు గురుండునగు శుక్రాచార్యునకు
దేవయాని యను రూపలావణ్యవయోవిలాసయొక్క కూఁతు
రుండెను. ఆమెయును రాక్షసాధిపతి కూఁతురు శర్మిష్ఠయు

మఱికొందఱు సఖులును గలసి విలాసార్థ మడవి కేతెంచి శృంగారంబగు నొక్క కొలనుగాంచి కట్టుపుట్టంబులుగట్టునం బెట్టి సంతోషంబుగ జలకంబు లాడుచుండిరి. ఆ సమయంబునఁ బరమేశ్వరుండు పార్వతీసహితుండై యా మార్గంబున రానయ్యింతులు సిగ్గునఁ దమ తమ వస్త్రంబులఁ జుట్టుకొనిరి. అప్పుడు శర్మిష్ఠ దేవయాని దువ్వలువం గట్టికొనెను. అప్పుడు దేవయాని యలుక వహించి

దేవ:—శర్మిష్ఠా! అగ్రవర్ణు లందఱకును నధికులు. అందును మాతండ్రి మీకు గురుండు. రాక్షసకుమారివైన నీవు నా వస్త్రము నెట్లు తాల్చితివి?

క. మహిమవతులైన భూసుర
మహిళల విత్తములు నితరమహిళల కగునే
మహిఁ బసిఁడిగొలుసు లిడినన్
విహితములే దైత్యులకు హవిర్భాగంబుల్.

శర్మి:— అక్కటా! నీకింత గర్వం బేలా? నీతండ్రి పురోహితుండై మాతండ్రి నాశ్రయించియుండ మా ధనంబునం బెఱిగిన నీ కండలకింత క్రొవ్వుండఁ దగునా?

దేవ:— ఓసీ! మా తండ్రి తపోమహిమంబున మీ దానవకులంబు దేవతలచే నిర్జింపఁ బడకుండఁ గాపాడుచుండును. రక్షించిన గురుకులజనకు నానత్వంబుఁ గొనుట నీకుచితము కాదు. దీన నీకు గర్వభంగంబు కలుగును.

శర్మి:— ఎట్లు కలుగునో చూచెదనుగాక.

అని దేవయాని నొక్క నూతిలోఁ బడఁద్రోయించి శర్మిష్ఠ తనచెలికత్తెలతో నింటికేఁగెను. మృగయార్థ మడవికి వచ్చియున్న యయాతి దైవవశంబున నా నూతి కడకు వచ్చి కన్యకామణిం జూచి తన పైవలువ నామెకుఁ గట్టనిచ్చి దక్షిణకరగ్రహణంబుసేసి వెలికిఁదీసెను. దేవయాని రాజుంజూచి,

మ. "నను బాణిగ్రహణం బొనర్చితి కదా నాభర్తవున్ నీవ దై
వనియోగంబిది తప్ప దప్పురుషతావాక్యంబు సిద్ధంబు సౌ
ఖ్యనివాసుండ నినుఁ జేరునాఁడు దపరంగాంక్షింపఁగా నేర్చునే?
వనజంబా నెడితేఁటి యన్యకుసుమావాసం బపేక్షించునే?

అదియునుం గాక తొల్లి బృహస్పతి కుమారుండు కచుం డనువానిని నేను వరించితిని. దానవగురుండగు శుక్రుని కూఁతునగుటచే నన్నుం గ్రహింపక నిరసించెను. నేను వాని శపించితిని. అతఁడును నాభర్త బ్రాహ్మణుండు గాకుండెడు నని శపించెను. కావున నిన్ను వరించుచుంటిని. శంకింపక గ్రహింపు" మని వేఁడెను. యయాతియును సమ్మతించెను. దేవయాని శుక్రునికడకుఁ బోయి శర్మిష్ఠ దుడుకుతనంబును హీనంపుమాటలును వినిపించెను. శుక్రుండు కోపించి,

క. "క్రూరాత్ముల మందిరములఁ
బౌరోహిత్యంబుకంటె పాపం బీసం

సారముకంటె శిలల్ దినీ
యూరక కాపోతవృత్తినుండుట యొప్పున్.

అని యలిగి కూఁతురు వెంటఁగొని యిలు వెడలెను. దానవభర్తవిని వేగమువచ్చి యసురాచార్యునిఁ బ్రార్థించిన "శర్మిష్ఠను దాని దాసీజనంబులను నాకూఁతునకు భృత్యలుగా నొసంగితి వేని వచ్చెద" ననియెను. అతఁడట్లొనరించి శుక్రునిఁ గొనిపోయెను.

పిదప శుక్రుండు యయాతినిం బిలిపించి దేవయానిని దానిభృత్యులను నతనితోఁ బంపుచు "శర్మిష్ఠతో స్నేహంబు సేయువల" దని శాసించెను. యయాతి సతులతో నిజపురమ్మునకు వచ్చి సుఖంబుండి యొక్కనాఁడు శర్మిష్ఠతో స్నేహంబున మాటలాడెను. అందునకు దేవయాని కోపగించి శుక్రునకుం జెప్పిన నాత డుగ్రుఁడై ముదిమి కలుగునట్లు యయాతికి శాపం బిచ్చెను. యయాతికి భూలోకసుఖమ్ములందుఁ దృప్తికలుగక పూర్వమే యీ శాపము సంభవించెను. అందుచేతఁ గొంత సేపు విచారించి కొడుకును బిలిచి,

శా. నీ తల్లిం గనినట్టి శుక్రువలనన్ నేఁడీజరం బొందితిన్
నాతండ్రీ! యదునామధేయ! సదయా! నావృద్ధతం దాల్పవే
నీతారుణ్యము నాకు నీవె తనివో నిండారఁగొన్నేండ్లు నేఁ
జేతోమోదసుఖంబులందిరిగెదన్ శ్రేయమ్ము నీకయ్యెడున్

అని వేడిన నా కుమారుండు తండ్రిం గని,

శా. కాంతాహేతువు బంధునింద్యము దురా
కందూతిక్షోభంబు హృ
చ్చింతామూలము పీనసాన్వితము ప్ర
స్వేదవ్రణాకంపన
శ్రాంతిస్ఫోటకయుక్త మీ ముదిమి పా
పం దాల్చి నానాసుఖో
పాతంబైనవయోనిధాన మిది య
య్యా! తేర యీవచ్చునే.

అని చెప్పిన యయాతి కడకొట్టుకొమరుండైనపూరున కిట్లనియెను.

ఉ. పిన్నవుగాని నీవు కడుఁ బెద్దవు బుద్ధులయందు రమ్ము నా
యన్న మదాజ్ఞ దాఁటవు గదన్న వినీతుఁడ వైన నీవు నీ
యన్న వచించునట్లు పరిహారము సెప్పకు మన్న నా జరన్
మన్ననఁదాల్చినీతరుణిమం బొనగూర్పుము నాకుఁబుత్రకా!

అనిన విని గురుభక్తిగుణాధారుండగుపూరుండు జనకునకు నతిసల్పి,

శా. అయ్యా! నన్నిటు వేఁడ నేల
భవదీయాజ్ఞాసముల్లంఘనం
బయ్యుండం బరిహారమున్ నొడువ
నే నన్యాయునే నీ జరన్

నెయ్యం బొప్పఁగ దాల్చి నాతరుణిమన్
నీకిచ్చెదం బంపినం
గయ్యం బాడెడి పుత్త్రకుండు క్రిమి
సంకాసుండు గాకుండునే ?

క. మునివృత్తి డయ్యె నేటికి
జనపాలక ! సుగతిఁ గోరు సత్పురుషులకుం
దన కన్నతండ్రి సెప్పిన
పని సేసిన సుగతి కొంగు పసిఁడియ కాదే.

క. పనుపక చేయుదు రధికులు
పనిచినమధ్యములు వొందుపఱుతురు తండ్రుల్
పని చెప్పి కోరి పనిచిన,
ననిశము మాఱాడు పుత్త్రు లధములు తండ్రీ !

అని పలికి పూరుండు తండ్రిముదిమిం గైకొని తన యౌవనమును దండ్రికిచ్చెను. యయాతి చిరకాలం బైహిక సుఖంబులం బొంది విరాగియై పూరుని తరుణిమం బతని కిచ్చి తన ముదిమిం గొని రాజ్యంబునకుఁ బూరు నధిపతిం జేసి దేవయానితోఁ గూడ నరణ్యంబునకుఁ బోయి మునుల చెలిమిని నిష్ఠతోఁ దపం బాచరించి హరియనుగ్రహంబునకుఁ బాత్రుం డయ్యెను.

18. దుష్యంతుఁడు.

దుష్యంతుండు రైభ్యుఁడను నొక రాజర్షికుమారుఁడు. అతఁడు ప్రతాపంబున నసమానుఁడు. దయాగుణుండు. శూరుండు. దుష్యంతుఁడు చతుస్సముద్రమధ్యగతం బగు ధరణీతలంబును నిర్వక్రపరాక్రమంబున జయించి ప్రజలం బిడ్డలు వోలెఁ గాపాడుచు రాజ్యంబును జిరకాల మేలెను. ఇతఁడు రాజైన కొంతకాలమునకు వనమృగంబు లధికంబులై వనసమీపగ్రామనివాసులను గడు బాధించుచుండ వారలువచ్చి రాజునకుఁ జెప్పికొనిరి. కరుణాస్వాంతుం డగు దుష్యంతుండు వారల మొఱలాలకించి సైన్యంబుల వెంటనిడికొని యరణ్యంబునకుఁ బోయెను అచ్చట,

క. మృగయూథంబుల వెంటను
మృగలాంఛనసన్నిభుండు మృగయాతుఁడై
మృగయులు గొందఱు గొలువఁగ
మృగరాజ పరాక్రమంబు మెఱయఁగఁజొచ్చెన్.

ఘనంబునఁ గల సింగంబులను గజతండంబులను బులులను భల్లూకములను బందులను దుప్పులను నిశ్శేషంబుగఁ గూల్చి యడవియంతయుఁ గలియందిరిగి మార్గాయాసుండై సమీపమున నున్న యొక యాశ్రమంబునకు బోయెను. ఆ

యాశ్రమంబు మహాతపస్సంపన్నుం డగు కణ్వమహామునిది. ఆ ఋషీంద్రుని తపోమాహాత్మ్యంబున నెట్టి పగతుర కైనను మైత్రి సంఘటిల్లుచుండును. దుష్యంతమహారాజా యాశ్రమంబున నలుదిక్కులం జూచి,

సీ. ఉరుతరశ్రాంతాహి యుగళంబులకుఁ బింఛ
  ములఁ విసరెడి కేకి ముఖ్యములను
గరిణు లొల్లని కుంభి కలభంబులకు మేఁత
  లిడుచుముద్దాడు మృగేంద్రములను
ఘనమృగావనములు గాపుగా లేళ్ళతోడం
  గూడి యాడు సారంగములను
నునుపుగా హోమధేనువుల కంఠంబులు
  దువ్వుచు మెలగు శార్దూలములను

తే. గీ. దారకలహించు నందురు దంపతులకు
మైత్రు లుంకించు మార్జాలమల్లములను
మతిని జాతివైరంబులు మాని యిట్లు
గలిసి క్రీడించు మృగములఁ గాంచె నతఁడు.

ఇట్లు సహజవైరములను మాని యన్యోన్య మైత్రిని మెలఁగుచున్న యాశ్రమమందలి జంతువులను జూచుచు చెట్ల నుండి వీచెడు చల్లని గాడ్పులకు సుఖంబందుచు నిటు నటు తిరుగుచు,

శా. ఆకణ్వాశ్రమమందు నీరజనివాసాంత ప్రదేశంబులన్
మాకందంబుల నీడఁ గల్పలతికా మధ్యంబులన్ మందరం



శకుంతలయుఁ జెలికత్తెలు.

భాకాండాంచితశాలంగోఁ గుసుమసంపన్నస్థలిన్ జూచె నా
భూకాంతుండుశకుంతలన్ నవనటద్భ్రూపర్యటత్కుంతలన్

ఆ శకుంతల విశ్వామిత్రుఁడను రాజర్షికి మేనకయందు జనియించెను. మేనక దేవవేశ్య యగుటచేతను విశ్వామిత్రుండు మునియగుటచేతను శకుంతలం బెంచఁ జాలక యరణ్యంబున విడిచిరి. ఆమెను గణ్వుండు పిల్లలులేనివాఁ డగుటం జేసి కొనివచ్చి మిక్కిలిదయతోఁ గూఁతుఁగా భావించి పెంచుచుండెను. ఆకన్యాలలామంబు సిగిర్చిన లేమావిగున్నవోలె యౌవనాంకురిత శరీరలావణ్యయై పుష్పవనంబునకు నీరు వోయుచు నుండెను. యువతీజన మనశ్చోరుం డగు దుష్యంతుఁ డాయిందువదనం జూచెను. శకుంతలయు వానిసిఁ జూచెను. ఇరువురు నొకరి నొకరు ప్రేమించి

క. బంధురయశుఁడు జగన్నుత
సంధుఁడు దుష్యంతుఁ డుచిత సమయజ్ఞుండై
గంధగజగమన నప్పుడు
గాంధర్వవిధిన్ వరించె గహనాంతమునన్

కణ్వుఁడును తన కూఁతునకుఁ జక్రవర్తి భర్తయగుటకు మనంబున సంతోషించెను. దుష్యంతుఁడు సైనికులను బురంబునకుఁ బంపి తానత్తవారింటఁ బ్రియంబున మూఁడు నిద్రలు గావించి తనయుంగరమును శకుంతల కాభరణంబుగ నిచ్చి చనియెను. శకుంతల గర్భంబుఁ దాల్చి [illegible] శుభముహూర్తంబునఁ గుమారుం గనియెను. కణ్వుండు మహా

సంతోషంబున జాతకర్మాదిమంగళాచారంబు లొనర్చెను. ఆ బాలునకు భరతుండను నామం బిడిరి. వాఁడు శుక్లపక్ష చంద్రునింబోలె దినదినప్రవర్ధమానుండై యధికశౌర్యంబునఁ బులులం బట్టి యాడుచు సింగంబుల కేసరంబులఁ గేలం దువ్వుచు గుఱ్ఱంబుల స్వారి చేయుచు నాశ్రమవాసుల కాశ్చర్యంబుఁ గొల్పుచుండెను. ఇట్లుండ నొక్కనాఁడు కణ్వమునీశ్వరుండు కూఁతుం బిలిచి,

"ఉ. పట్టపురాజు నీమగఁడు పాపఁడు నంతకు నెక్కు డన్నిటం
బట్టపుదేవివై గఱువబాగున నుండక పాఱువారితో
గట్టువనంబులందు నవయం బని లే దిటఁ దల్లి పోఁగదే
పుట్టినయిండ్ల మానినులు పోరచిగా కనిశంబునుందు రే?"

అని చెప్పి యామె నోడంబఱచి సారెలుఁ జీరెలుం బెట్టి శిష్యులను దోడొసంగి పంపిన శకుంతల బాలునితో నత్తవారింటి కేఁగి పతిమ్రోల నిలువంబడెను.

మ. వలకేలన్నరుచక్రరేఖయుఁ బదద్వంద్వంబునం బద్మరే
ఖలునొప్పారఁగ నందువచ్చిన రమాకాంతుండునాఁ గాంతిన
గ్గలమైయున్నకుమారుమారసదృశాకారున్ విలోకించియున్
బలుకండయ్యె విభుండెఱింగిసతివిభ్రాంతాత్మయైయందురన్.

పలుకకుండిన పతిం జూచి శకుంతల 'మఱచినాఁడు గావలయు' నని మనంబున నూహించి స్మృతిం గొల్పుటకు వానిం బ్రార్థించెను. అప్పుడు,

మ. అదెనీవల్లభవాఁడు నీసుతుఁడు భా
ర్యాపుత్త్రులం భాత్రుల౯
వదలం గాదలనాఁటి కణ్వవనికా
వైవాహికారంభముల్
మదినూహింపు శకుంతలావచనముల్
మాన్యంబులౌ భూవరేం
ద్ర! దయ౯ జేకొనుమంచు మ్రోసెను వియ
ద్వాణీవధూగీతముల్.

అశరీరవాణి పల్కుల "నా లేమ తనసతి" యని యెల్లరకుం దెలియ భూపాలుండు శకుంతలం గ్రహించి భరతునకు రాజ్యంబు గట్టి సుఖంబుండెను.

---

19. రంతి దేవుఁడు.

సంకృతి యను రాజవరేణ్యునకు గురుండును రంతిదేవుఁడు నను నిరువురు కుమారులు గలరు. రంతిదేవుఁడువైరుల యెడ నెంతపరాక్రమము గలవాఁడో భగవంతునియం దంత భక్తిగలవాఁడు. పుత్రులయం దెంతప్రీతివహించునో యార్తులయం దంత దయఁ బూనును. పేదవాఁడు కనఁబడిన బ్రాణమునైన నొసంగఁ జాలు దాత. తనకుఁ గల యఖండైశ్వర్యమును వెచ్చించి బీదలకుఁ దృప్తికరముగ భోజనం బిడుట కన్నసత్రంబులఁ గట్టించెను. మార్గస్థులకు నీరు దొఱకుటకు నూఁతులను జెఱువులను ద్రవ్వించెను. యోగులకుమఠములను నిర్మించెను. దేవాలయములకు మహోత్సవముల జరిగించుటకు వసతుల నేర్పఱచెను. దేశమందంతటను విద్యాశాలల నిర్మించెను. రోగుల కుచితవైద్యశాలలఁగట్టించెను. ఇఁకఁదనయొద్ద నొక్క కాసైనను మిగులకుండ ధనమును వ్యయపఱచి రాజ్యమును గొడుకుల కప్పగించి తానును సదానువర్తిని యగు భార్యయు భగవంతునిఁగొలుచుచు నరణ్యంబులకుఁబోయిరి. పురము విడిచినది మొదలు నలుబదియెనిమిది దినములవఱకు నొక్క కణమైన నన్నము దొఱకకుండెను. నీరును గన్పడకుండెను. అడవిలో నొక్క చెట్టునఁగూడ ఫలమైనను గన్పడకుండెను. ఆఁకలి శరీరములను దహించుచుండెను. అతిసుకు

మార యగు రాజదేవేరి యాఁకలిదప్పులకోర్వలేక కృశించుచుండెను. ఎట్టకేల కొక్కపురవరంబు సేరెను. అచ్చట నొక చెట్టునీడకుఁ జేరునప్పటికిఁ దన కాంతామణి క్షుత్తునుభరింపఁజాలక మూర్ఛాక్రాంతయై క్రిందఁబడెను.

ఆగ్రామములో నొక్క గృహమేధి పైతృకకర్మ నాచరించి కొందఱు బ్రాహ్మణులకు షడ్రసోపేతభోజనము నొసంగెను. మూర్ఛిల్లిన భార్యను జెట్టుక్రింద విడిచి తా నా గృహమేధి యింటికేఁగెను. అన్నాతురుం డయ్యు నతని నర్థింపఁజాలక తా నా యింటి వేదికపైఁ గూర్చుండి భగవంతు నారాధించెను. ఇంతలో గృహస్థుఁడు వెలుపలికి వచ్చి రంతిదేవుని దైన్యమును గనిపెట్టి నెయ్యి పాయసము రసములతోఁ గూడిన యన్నమును నొక పాత్రంబున జలమునుబోసి తెచ్చి యమ్మహాత్మున కొసంగెను. పెన్నిధిం గన్న పేదవోలె రంతిదేవుఁడు కడు సంతోషమును గాంచి యన్నంబును మూఁటఁగట్టికొని జలకలశంబుఁ జేబూని భార్యకు సేదఁ దీర్చి తా భుజింపవలెనను తలంపునఁ జెట్టుకడకువచ్చి మూఁటను విప్పుచుండెను. ఇంతలో,

సీ. అతిథి భూసురుఁ డొక్కఁ డాహార మడిగిన
గడపక ప్రియముతో గారవించి
హరిసమర్పణ మంచు నన్నంబులో సగ
మిచ్చిన భుజియించి యేఁగె నాతఁ

డంతలో నొకశూద్రుఁ డశనార్థియై వచ్చి
పొడసూప లే దనఁ బోక తనకు
నున్న యన్నములోన నొకభాగ మిచ్చిన
సంతుష్టుఁడై వాఁడు సనిన వెనుక

ఆ.వె. కుక్కగమియుఁ దాను నొక్కఁడే తేర నా
యన్న శేష మిచ్చి సన్నయంబు
లాడి మ్రొక్కి పంపనోడక చండాలుఁ
డొక్కఁడరుగుదెంచి చక్కనిలిచి

క. "హీనుఁడ జండాలుండను
మానవకులనాథ! దప్పి మానమి నవలం
బోనేర నీకుఁ జిక్కిన
పానీయము నాకుఁబోసి బ్రదికింపగదే"

అనుచు నతిదీనుండై బ్రతిమాలిన వానియందు దయవహించి "ఓయీ! అతిథికంటెఁ బరమేశ్వరుఁడు వేఱ లేఁడు. ఆఁకలి వలని బాధ నా కనుభవంబుగఁ దెలిసియున్నది. నీ దైన్యమును జూచి కడుఁ జింతించుచున్నాఁడను.

ఉ. అన్నము లేదు కొన్నిమధురాంబువులున్నవి త్రావుమన్న రా
వన్న శరీరధారులకునాపదవచ్చిన వారి యాపదల్
గ్రన్నన మాన్చి వారికిసుఖంబులు సేయుటకన్న నొండు మే
లున్నదె నాకుదిక్కు పురుషోత్తముఁ డొక్కఁడుచుమ్ము పుల్కసా

అని పలికి యా మాలనివంకఁ గొంత తడవు చూచి "ఈతఁడు మాతంగవేషధారి యగు మహాత్ముండై యుండఁ బోలు" నని మనంబువం దలఁచి మరల పరికించి,

మ. బలవంతంబగు నీరు వట్టున నిజప్రాణాంత మై యున్నచో
నలయం డేమియు వీని హృజ్జ్వరము నాయాసంబు ఖేదంబు నా
జలదానంబున నేఁడు మాను ననుచున్ సర్వేశ్వరాధీనుఁడై
జలముం బోసె నురంతి దేవుఁడు దయం జండాలపాత్రంబునన్

అతఁ డా జలంబుల గైకొనక రాచవాని భక్తికి మెచ్చి చండాల రూపంబుఁ జాలించి విష్ణురూపమునఁ బ్రత్యక్ష మయ్యెను. తొల్లిటి విప్రుఁడు మహేశ్వరుఁడై కన్పట్టెను. శూద్రుఁడు బ్రహ్మయై తోఁచెను. ఇట్లు మువ్వురును రంతి దేవునకుఁ గన్పడి వాని భక్తికిఁ గడు నామోదించి "వలయు వరంబుల వేఁడు" మనిరి. అతఁ డైహికసుఖంబుల నడుగక సతితో నమస్కరించి ముక్తిపదంబును వేఁడెను. కేశవుం డా దంపతులకు శాశ్వత వైకుంఠపదమ్ము నొసంగి పోయెను.

---

20. శ్రీకృష్ణుఁడు.

దేవకీ వసుదేవుల వృత్తాంతము.

ద్వాపరయుగాంతమున భూమియందు క్రూర రాక్షసుల బాధ యెక్కుడై ధరాభారము గలుగుచుండ భూదేవి బ్రహ్మదేవుని కడ కేఁగి మొఱ వెట్టుకొనెను. బ్రహ్మయు సుర సమేతుండై యాదిమహావిష్ణుని దర్శించి భూలోకమునఁ గల తెఱం గెఱింగించెదను. సకలలోకరక్షకుం డగు విష్ణుదేవుండు వారల నాదరించి ధాతతో నొక్క పలుకు నుడివెను. ఆ పలుకును మూలంబుగఁ గొని విధి సురల కిట్లు లనియెను.

క. "యాదవకులమున నమరులు
మేదినిపైఁ బుట్టఁ జనుఁడు మీ యంశములన్
శ్రీదయితుఁడు వసుదేవున
కాదరమునఁ బుట్టి భార మంతయుఁ బాపున్."

అని చెప్పిన విధిపలుకుల శిరంబులం దాలిచి యమరులం దఱును యాదవకులమునఁ దమతమ యంశంబులం బుట్టిరి. అప్పుడు శూరసేనుం డను నతఁడు యాదవులకు రాజై మాథురంబులు, శూరసేనంబులు నను దేశంబుల నేలుచు మథురాపురంబును రాజధానిగఁ జేసికొని యుండెను. ఆతనికి వసు



దేవుండను పుత్త్రుండు గలఁడు. వసుదేవుఁడు దేవకుని కూఁతురగు దేవకినిఁ బెండ్లియాడెను. దేవకుండు తన కూఁతునకు నల్లునకు వరణంబులనిచ్చి వీడ్కొలుపుతఱి దేవకీ సోదరుఁడగు కంసుఁడు ముచ్చటపడి మహాసంతోషంబునఁ దానసారథియై సోదరిని బావను రథస్థులఁ జేసి బావ యింటికిఁ గొనిపోవుచుండెను. మార్గమధ్యంబున నశరీరవాణి,

క. " తుష్టయగు భగిని మెచ్చఁగ
సిష్టుఁడవై రథము గడపె దెఱుఁగవు మీఁదన్
శిష్టయగు సీతలోదరి
యష్టమగర్భంబు నిన్ను హరియించుఁ జుమీ. "

అను పలుకుల నుడివెను. ఆపలుకులను గంసుండు విని యులికిపడి తన మరణమునకుఁ గారణభూతుఁడై పుట్టఁబోవు బాలునకు జనని యగు నిజసోదరునిరథంబునుండి క్రిందికి దిగలాఁగి వామహస్తంబునఁ గొప్పు నొడిసిపట్టి రెండవచేఁత నడిదంబును ఝళిపించుచుఁ గంఠంబును త్తరించుటకు సంసిద్ధుడై యున్న సమయంబున సత్యవ్రతుండగు వసుదేవుండు స్యాలకుని దుర్నయంబునకుఁ జింతిలుచు నొకచేత వాని యాయుధహస్తంబును మఱియొకచేత వాని చిబుకంబును బట్టుకొని తన మృదువచనంబులతోఁ గొంత శాంతునిఁ జేసి,

ఉ, " అన్నవు నీవు చెల్లెలికి నక్కటమాడలు సీర లిచ్చుటో
మన్నన సేయుటో మధురమంజులభాషల నాదరించుటో

మిన్నుల ప్రోఁత లేనిజము మేలని చంపకుమన్న మానిరా
వన్న సహింపుమన్న తగదన్న వధింపకుమన్న సోదరా

అని యనేక విధంబుల బ్రతిమాలెను. తన ప్రాణమునకు భంగము కలుగునేమోయను భయంబుచేత నాతురము నొందుచున్న కంసుఁడు బావ మాటలను బెడచెవినిఁ బెట్టి వసుదేవుని ప్రార్థనమును నిరాకరించి దేవకినిఁ జంప నుద్యుక్తుఁడగుచుండెను. వసుదేవున కేమి చేయుటకును దోఁచలేదు. మనంబున నిట్లాలోచించుకొనెను. "కాలస్వభావమున కందఱును గట్టుపడవలయును. మూర్ఖుఁడగు వీని యత్నము నుడుపుటకు నీతిబోధనలు దగినవి కావు.

క. ఎనిమిదవ చూలు వీనిం
దునుమాడెడినంచు మింటఁ దోరపుఁ బలుకుల్
వినఁబడియె నేల తప్పును
వనితను విడిపించుటొప్పు వైళంబనుచున్

క. " లలనకుఁ బుట్టిన కొమరుని
వలనం దెగె దనుచు గగన వాణిపలికె నం
చలిగొద వేని మృగాక్షికిఁ
గలకొడుకులఁ జంపఁ నిత్తు గ్రమమున నీకున్.

కావున నీ సోదరిని మన్నించి బ్రదికింపుమని వినయంబుగఁ బ్రార్థించెను. కంసుండు మనంబునఁ గొంతతడవు చింతసేసి

వసుదేవుని పలుకులు యుక్తియుక్తముగనుండు టెఱింగి దేవకిని విడిచెను. తఱువాతఁ గంసుఁడు సోదరిని బావను వారి యింట నుంచి తానింటి కేఁగెను. కొంతకాలము పోయిన పిమ్మట దేవకి శుభముహూర్తంబున నొక్క కొడుకును గనెను. సత్యవ్రతుం డగు వసుదేవుఁడు తా నాడిన మాట చొప్పున నా కొమరునిఁ బదిలముగఁ గొనిపోయి కంసుని యెదుటఁ బెట్టెను. కంసుండు వసుదేవుని సత్యనిష్ఠకు మనంబున నత్యంతంబు సంతోషించి వానియెడ దయాహృదయుండై,

ఆ-వె. "కొడుకు నీవు మరలఁ గొనిపొమ్ము వసుదేవ!
వెఱవు లేదు నాకు వీని వలన
నల్గవీనికి భవదష్టమపుత్త్రుండు
మృత్యువఁట వధింతు మీఁద నతని.

నీ మొదటి యేడుగురు పిల్లలను నీవు ప్రేమంబునఁ బెంచి కొనుము. ఎనిమిదవ వానినిఁ గొనివచ్చి నాకిమ్ము. వాని వధించి నాపగఁ దీర్చుకొనెద" నని పలికి శాంతవచనంబులతో బావను సమ్మానించెను. దుష్టుఁడగు కంసుని పలుకులను మనంబున నమ్మకయు నమ్మినవానియట్లు తోఁచి వసుదేవుండు నిజపురంబునకు మరలెను. ఇంతలో నారదుఁడు కంసునికడకు వచ్చి యతనితో నేకాంతమ్మున నిట్టు లనియెను. ఓయీ! కంసుఁడా! సురలందఱును యాదవులై పుట్టిరి. విష్ణుదేవుండు దేవకి గర్భంబున నెనిమిదవవాఁడై పుట్టి నిన్ను సంహరింపఁ గలఁడు.

నీవు కాలనేమి యను రాక్షసుఁడవు. కంసుఁడ వై పుట్టితివి. దనుజమర్దనునిచేత దనుజుండ వగు నీవు తప్పక భంగంబు నొందెదవు. కావున సత్యంబునఁ బ్రవర్తింపు" మని చెప్పి నారదముని దివి కేఁగెను. కంసుండు నారదు మాటలను విని మనసునం దారాటంబును బొంది యేమియుం దోఁచక,

మ. కలఁగం బాఱి మఱందిఁ జెల్లెలి నుదగ్రక్రోధుఁడై పట్టిబ
ద్ధులఁ గావించి హరిం దలంచి వెసఁ దోడ్తో వారుగన్నట్టి పు
త్రులఁ జంపెన్ గురు నుగ్రసేను యదుభోజాంధకాధీశుని
ర్మలుఁ బట్టెం గడు వాలి యేలెఁ జలమారన్ శూరసేనంబులన్

ఇట్లు కంసునిచే నోటువడి యదువులు పెదవులం గదల్పక పదవులం బాసి కురుకోసలపాంచాలాది దేశంబులం బట్టిరి. దేవకీగర్భంబున నప్పటికిఁ బుట్టిన యార్వురు కొడుకులను గంసుండు దుదముట్టించెను. ఏడవతూరి దేవకీగర్భంబుననుండు శిశువును హరియంశంబును దాల్చియుండెను. ఆ శిశువు జనియించినతోడనే చంపుటకుఁ గంసుండు సిద్ధముగనుండెను. దీనరక్షకుండగు నారాయణుండు కంసుని దుర్నయంబు నెఱింగి మాయాదేవినిఁ బిలిచి యిట్లనియె.

సీ. "గోపికాజనములు గోపాలకులు నున్న
పసులమందకుఁ బొమ్ము భద్ర నీవు
వసుదేవు భార్యలు వరుసఁ గంసునిచేత
నాకల బడి యుండ నందుఁ జొరక

తలఁగి రోహిణి యను తరళాక్షి నందగో
కులమందు నున్నది గుణగణాఢ్య
దేవకి కడుపున దీపించు శేషాఖ్య
మైన నా తేజ మీ వమరఁ బుచ్చి
ఆ-వె. నేర్పు మెరసి రోహిణీదేవి కడుపునఁ
జొనుపు దేవకికిని సుతుఁడనగుదు
నంశభాగయుతుఁడనై యశోదకు నందు
పొలఁతి కంతమీఁదఁ బుట్టెదీవు.
క. నానావిధసంపదలకుఁ
దానకమై సర్వకామదాయిని వగు నిన్
మానవులు భక్తి గొలుతురు
కానికలును బలులు నిచ్చి కల్యాణమయీ!

అని నారాయణుండు వచింప నామాయాదేవి సర్వరక్షకుని వచనంబును బరిపాలించి పూజ్య యయ్యెను. భద్రచే రోహిణీగర్భస్థుండైన శిశువు.

ఆ-వె. బలము మిగుల గలుగ బలభద్రుఁడనఁ లోక
రమణుఁడగుటఁ జేసి రాముఁడనఁగ
నతికిఁ బుట్టె గర్భసంకర్షణమున సం
కర్షణుండనంగ ఘనుఁడు సుతుఁడు.

తఱువాత దేవకీదేవి నారాయణుని యంశంబునం గ్రాలుచున్న యష్టమగర్భంబునుం దాల్చెను. భగవంతుం డగు

నారాయణుండు దేవకీగర్భస్థుం డగుటకు భూజనులును దివిజులును గడు సంతసించిరి. దానవులు నిజకుల నాశంకరుండగు పురుషోత్తముఁ డుదయింపఁ బోవుచున్నాఁడని భీతినొందిరి. యదువులు హృదయంబుల నదయుం డగు యదువల్లభుం డుదయింప నున్నాఁడని ముదము నందుచుండిరి. ఇంద ఱిన్ని తెఱంగులనుండఁ గంసుండు బంధనాలయంబున నున్న సోదరి యొద్ద కాతురమున వచ్చి యామెవంకఁ దేఱిపాఱఁజూచి మనంబున భయంబు గదుర లో నిట్లనుకొనుచుండెను.

క. "కన్నులకుఁ జూడ బరువై
యున్నది యెలనాగగర్భ ముల్లముగలఁగెన్
మున్నున్నఁడు నిట్లుండదు
వెన్నుఁడు సొరనోపు గర్భవివరములోనన్.

ఉ. ఏమిదలంచువాఁడ నిఁక నెయ్యది కార్యము నాఁటినాఁటికిం
గామిని చూలు పెంపెసఁగె గర్భిణిఁ జెల్లెలినాఁడు పేద నే
నేమని చంపువాఁడఁ దగవేలని చంపితి నేని శ్రీయు ను
ద్దామయశంబు నాయువును ధర్మమునుం జెడిపోవకుండునే?

క. వావి యెఱుంగని క్రూరుని
జీవన్మృతుఁడంచు నింద సేయుదు రతఁడుం
బోవును నరకమునకు దు
ర్భావములోఁ బ్రతుకు టొక్క బ్రతుకే తలపన్

అని యనేకవిధంబుల మనంబున నిట్టట్టు యోజించి తుదకుఁ జెలియలిఁ జంపుట యుక్తము కాదని తలంచి యింటికిఁబోయి

ఆ. వె. పాప కాని దొడ్డపగ పుట్టె నిఁక నెట్టు
లిందుముఖికిఁ జక్రి యెపుడు పుట్టుఁ
బుట్టినపుడె పట్టి పురిటింటిలోఁ దెగఁ
జూతు ననుచు నెదురు సూచుచుండె.

కాని తనమరణంబునకుఁ గారణుండును, లోకరక్షకుండు నగు పద్మాక్షుండు పుట్టునని యెఱింగినది యాదిగాఁ దా నొనర్చు పనులయందు మనంబు లేక దిగులు వడి,

సీ. శ్రవణరంధ్రముల నేశబ్దంబు వినఁబడె
నది హరిపలుకని యాలకించు
నక్షిమార్గమున నెయ్యది సూడఁబడెనది
హరిమూర్తిగా నోపునంచుఁ జూచు
దిరుగుచో దేహంబు తృణమైనఁ జోకిన
హరికరాఘాతమో యనుచుఁ గదియుఁ
గంధంబు లేమైన ఘ్రాణంబు సోఁచిన
హరిమాలికాగంధ మనుచు నదరు

ఆ. వె. బలుకు లెవ్వియైనఁ బలుకుచో హరిపేరు
వలుకఁ బడియె ననుచు భ్రమసి పలుకుఁ
దలఁపు లెట్టివైనఁ దలఁచి యాతలఁపులు
హరితలంపు లనుచు నలుగఁ దలఁచు.

అట బంధనాలయంబు కడకు బ్రహ్మేంద్రాది సురలు విచ్చేసి దేవకీగర్భస్థుండగు నారాయణుని గూర్చి,

మ. "గురుపాఠీనమవై జలగ్రహమవై కోలంబవై శ్రీనృకే
సరివై భిక్షుఁడవై హయాననుఁడవై క్ష్మాదేవతాభర్తవై
ధరణీనాథుఁడవై దయాగుణగణోదారుండవై లోకముల్
పరిరక్షించిన నీకు మ్రొక్కెదమిలాభారంబువారింపవే. !

క. ముచ్చిరి యున్నది లోకము
నిచ్చలుఁ గంసాదిఖలులు నిర్దయులేచన్
మచ్చికఁ గావఁగవలయును
విచ్చేయుము తల్లికడుపు వెడలి ముకుందా !"

అని లోకరక్షకుని స్తుతించి యంతర్హితులై నిజనివాసంబులకుఁ జనిరి. దేవకీదేవి సురల దర్శనంబున హృదయసంతాపంబును గొంతవఱకు విడిచి ధైర్యంబు నంది భగవంతుని ధ్యానించుచు దినంబులు గడుపుచుండెను.



శ్రీ కృష్ణ జననము.

ఇట్లుండ నొక్కనాఁడు నడురేయి శుభముహూర్తంబున దేవకీదేవి పూర్వదిక్కాంత పూర్ణచంద్రుని గనిన రీతిని లోకపావనుండగు హరిని బ్రసవించెను. ఆ సమయంబున

సీ. స్వచ్ఛంబులై పొంగి జలరాసులేడును
గలఘోషణముల మేఘంబు లుఱిమె
గ్రహతారకలతోడ గగనంబురాజిల్లె
దిక్కులు మిక్కిలి తెలివిఁదాల్చెఁ
గమ్మని చల్లనిగాలి మెల్లన వీచె
హోమానలంబు సెప్పొంది వెలిఁగెఁ
గొలఁకులు కమలాళికులములై సిరి నొప్పె
బ్రవిమలతోయములై పాఱె నదులు

తే. వరపురగ్రామ ఘోషమై వసుధయొప్పె
విహగరవపుష్పఫలముల వెలసె వనము
లలరుసోనలుగురిసి రయ్యమరవరులు
దేవదేవుని దేవకీదేవి గనఁగ.

సీ. జలధరదేహు నాజాను చతుర్బాహు
సరసీరుహాక్షు విశాలవక్షు
జారుగదాశంఖ చక్రపద్మవిలాసు
గంఠకౌస్తుభ మణికాంతిభాసుఁ
గమనీయకటిసూత్ర కంకణ కేయూరు
శ్రీవత్సలాంఛనాంచితవిహారు
సురుకుండల ప్రభాయుతకుంతల లలాటు
వైడూర్యమణిగణ వరకిరీటు

తే. బాలుఁ బూర్ణేందు రుచిజాలు భక్తలోక
పాలు సుగుణాలవాలుఁ గృపావిశాలుఁ
జూచి తిలకించి పులకించి చోద్యమంది
యుబ్బి చెలరేఁగి వసుదేవుఁ డుత్సహించె.

ఆ. వె. చాఁగి మ్రొక్కి లేచి సరగున నొసలిపై
గేలుదమ్మిదోయిఁ గీలుగొలిపి
పాపఁడనక వెఱక పాపని మొదలింటి
పోకలెల్లఁ దలఁచి పొగడఁ దొడఁగె.

భక్తిరసప్రధానుఁడై భగవంతుఁడగు బాలుని సూనుఁ డనక పొగడుచున్న వసుదేవునకుఁ బద్మనయనుం డిట్టు లనియెను. "జనకా! మీరు కేవలమనుష్యమాత్రులుగారు. పూర్వజ్ఞానమును మఱచి ప్రకృతిపురుషులలీల నటింపుచున్నారు. మీ దంపతులు పూర్వభవంబున నదితికశ్యపులరు. మీరును నేనును భూభారహరణార్థంబుగఁ బుట్టితిమి. విచారింపక నన్నుఁ గొనిపోయి నర్మదానదినుత్తరించి నందునిభార్యయగు యశోద సెజ్జపైఁ బరుండబెట్టి యాపె ప్రక్కలోనున్న బాలికంగొనివచ్చి నా జనని ప్రక్కలో నుంచుఁడు. ఈ పని నొనరించు సమయమందు భగవంతుఁడు మీకన్నిటను వీలుఁ గలిగించును. శంకింపక వేగము నొనర్పు" మని నుడివెను.

క. ఆ పురిటియిల్లు వెలువడి
పాపనిఁ దరలించుకొనుచుఁ బఱచెద ననుచున్

రూపింప నందు భార్యకుఁ
బాపయగుచు యోగమాయ ప్రభవించెనటన్.

వసుదేవుండు మహోల్లాసియై,

క. బిడ్డనిఁ గరముల ఱొమ్మున
నడ్డంబుగఁ బట్టి పదము లల్లన యిడుచున్
జడ్డన గావలి వారల
యొడ్డు గడచి పురిటిసాల యొయ్యన వెడలెన్

నందునివీటికి గోవిందునిఁ గొనిపోవునప్పటికి నందగృహంబునం దందఱకు నిద్రయావహించియుండెను. వసుదేవుండు బాలకుని యశోద ప్రక్కఁ బరుండఁబెట్టి యాపెప్రక్కలోని బాలికను గొనివచ్చి దేవకిసెజ్జంబరుండఁ బెట్టి యెప్పటియట్లనంకెళ్ళు లందగిలించుకొనియుండెను. తొలుతఁ దమంతటఁ దామ సడలిన చెఱసాలతాళములు మరల నెప్పటియట్ల బీగములుపడియుండెను. ఇంతలో బాలిక యేడువసాగెను. అప్పటికిఁ గారాగృహపాలకులకు మెలఁకువ వచ్చి పరుగెత్తుకొనిపోయి తమ నేతయగు కంసునకు శిశుజనన వృత్తాంతము నెఱింగించిరి. అతఁడు నిద్రనుండి చివాలున లేచి

తే. గీ. వెంద్రుకలు వీడఁ బైచీర ప్రేలి యాడఁ
దాల్మికీలూడ రోషాగ్ని దర్పమాడ
భూరి వైరంబుతోఁ గూడఁ బురిటియింటి
జాడ నేతెంచి యా పాపఁ జంపఁ గదిసె

కంసుండు సమీపించి కత్తి నెత్తి శిశువును నఱుకఁబోయెను. ఇంతలో దేవకి శిశువును జంక నిడుకొని, చీరచెఱంగు ముసుఁగు వెట్టి చెక్కునక్కునం జేర్చి గట్టిగఁ బట్టుకొని యిట్టులనియె.

ఉ. “అన్న! శమింపుమన్న! తగదల్లుఁడుగా దిది మేనగోడలా
మన్నన సేయుమన్న! విను మానినిఁ జంపుట రాచపాడి గా
దన్న! సుకీర్తివై మనఁగదన్న! మహాత్ములువోవుత్రోవఁబో
వన్న! భవత్సహోదరిఁగదన్న! నినుఁ శరణంబు వేఁడెదన్.

క. కట్టా యార్గురు గొడుకులఁ
బట్టి వధించితివి యాఁడుపడుచిది కోడల్
నెట్టన చంపఁగ వలెనే
కట్టిడివి గదన్న యన్న! కరుణింపఁగదే.

క. పుత్త్రుఁడు నీ బ్రతుకునకును
శత్త్రుండని వింటిఁ గాన సమయింపఁదగున్
బుత్త్రులకు నోమ నేనియుఁ
బుత్త్రీదానంబు సేసి పుణ్యముఁ గనవే.”

అని కడునాతురంబున దేవకీదేవి ప్రార్థించిన నిజప్రాణావనాతురుండగు కంసుండు దీన యగు సోదరి పల్కుల నాదరింపక దేవకి చంక నిడికొనియున్న బాలికామణిని మోటుతనంబున దిగలాగి నేలకు విసరెను. బాలికారూపమును దాల్చిన యోగమాయ నేలం బడక యాకసంబున కెగసి



కంసుఁడు—మాయాదేవి.

భీషణవేషంబుం దాల్చి కంసుని గుండె లవియునట్లు గురుస్వరంబున నిట్లనెను.

ఉ. తెంపరివై పొరిం బోరిని దేవకి బిడ్డలఁ జిన్నికుఱ్ఱలం
జంపితి వంతనైన నుపశాంతి వహింపక బాలమీఁద నో
ప్పింపఁగఁ బూనినాఁడ విదిబీరమొ? నాసరసన్ జనించినన్
జంపెడివీరుఁ డొక్కెడ దెసనత్కృతి నొందెడువాఁడు దుర్మతీ!

అని పలికి యా దేవి యాదవకులదేవతయై వెలసి దుర్గ భద్రకాళి విజయవైష్ణవి కుముద చండిక కృష్ణ మాధవి కన్యక మాయ నారాయణి యీశాన శారదయంబిక యను పదునాలుగు నామంబులఁ బూజింపఁ బడుచుండెను. మాయాదేవి పలుకులను విని కంసుఁడు సేయునది లేక కత్తి నేలం బడవైచి తర్జనిఁ జుబుకంబున హత్తించి కొంతసేపటికిఁ బశ్చాత్తాపము నంది తానొనర్చినది పాపకార్యమని వెఱింగి చెలియలికిని బావకును మ్రొక్కి,

ఉ. పాపుఁడ బాలఘాతుకుఁడ బంధువిరక్తుఁడ దుష్టచిత్తుఁడం
గోపనుఁడం జరన్మృతుఁడఁ గ్రూరుఁడ బ్రాహ్మణహంతభంగిమీ
పాపలఁ జంపితిం బయలి బల్కుల నమ్మితి సాధులార! నా
పాపము లుగ్గడింపక కృపాపరులై కనరే శమింపరే!

అని దీనవదనుండై పలికి దేవకీవసుదేవులకు బంధమోచనంబుఁ గావించి వారిని వారి యిండ్లకనిచి తాను నిజపురంబున కేఁగి విచారగ్రస్తుఁడై కూర్చుండియుండెను. మాయా

దేవి యాడిన పలుకులను విని కంసుని మంత్రులు రాజనివాసంబునకు వచ్చి చింతాక్రాంతుండైన రాజును జూచి యిట్లనిరి. "దేవా! త్రిలోకవిజయుండవగు నీకే చింతతోఁబనేమి! ఈ దేవతల మాయ మాటలు మన మెఱుఁగనివి కావు. ఎచ్చటనో బాలుఁడు పెఱుఁగుచున్నాఁ డనినంత మాత్రమున నింతబెగ్గిలి చింతింపవలయునా! నీవు కనుసన్నఁ జేసినంతనే మూఁడు లోకములను దెచ్చి మీ పాదంబులకడఁ బెట్టుటకు సంసిద్ధులమై మేమందఱము నుండ నీకు జంకేల? మమ్మెందు నియోగించెదవో తెలుపుము

ఉ. చంపుదుమే నిలింపులను జంకెల నంకెలఁ దాపసావలిం
జంపుదుమే కృతాంతకునిపాలికిఁ బ్రేపులతోడ గోవులం
ద్రుంపుదుమే ధరామరులఁ దోలుదుమే నిగమంబులన్ విదా
రింపుదుమే వసుంధర హరింపుదుమే జననాథ పంపుమా

అటుగాక జగంబున గల యిప్పటి బాలకావలిం గూల్చుమని సెలవిచ్చిన నట్లొనర్చెదము. ఇంక నొక్కఁ డాలింపుము. హరియను నెవ్వఁడో వానిరూప మెట్టిదో వాఁడు నివసించుస్థానంబు లెవ్వియో మే మెఱుంగుదుము. అతఁడునక్కియుండెడు స్థానంబులు మాకుఁ గరతలామలకంబులే. ఆయా స్థానంబులఁ గూల్చిన నతం డంతరింపకుండునే? ఇటు వినుఁడు,

మ. అమరశ్రేణికి నెల్లఁ జక్రి ముఖ్యుండౌ చక్రిధర్మంబునం
దమరున్ గోవులుభూమిదేవులు దితీశామ్నాయ కారుణ్యస

త్యములున్ యాగతపోదమంబులును శ్రద్ధాశాంతులున్ విష్ణుదే
హములిన్నింటిని సంహరించిన నతండంతంబునుం బొందెడిన్.

కావున మా కానతి నిచ్చి పంపుము. అవలీల నీ కార్యమ్ములం గావించి నీ మనస్తాపమును దీర్చెదము. నీ బోటి పోటుమానిసి కీదైన్యము తగినదికా " దని మంత్రులు గంసునిం బురికొల్పిరి. ప్రాణభయావ్యవస్థితచిత్తుండగు భోజభూపాలుండు మదోన్మత్తులగు రాక్షసమంత్రుల యనాలోచన వాక్యంబుల నాకర్ణించి కాలవశంబున వాని నమ్మి " అట్లు గావింపుఁడని " వారల కాజ్ఞ యిచ్చి యంతిపురంబునకుం జనియెను. దానవులు కంసు నాజ్ఞను దల నిడికొని చెలఁరేగి పురంబులపైఁ బడి యొక్కుమ్మడి నాశనంబును గావింపఁ దొడంగిరి.

అట నందుని యింట నారేయి యశోద శయ్యపై వసుదేవుండు బాలకుని డించి పోయిన కొంతసేపటికి యశోద మేల్కాంచి సెజ్జపయిం బాలునిం జూచి తనకుఁ బుత్త్రజననం బయ్యెనని యెంచి మహాసంతోషంబున నుండెను. జగన్మోహనశీలుం డగు బాలుండు వెక్కి వెక్కి యేడువసాగెను. ఆ బాలరోదనమును విని యింటిలోనివారందఱును మేల్కాంచి యశోద ప్రసవించెనని యాగుబ్బువడుచుండిరి. ఆ సందడికి వ్రేపల్లెలోని గొల్లయిల్లాండ్రందఱును లేచి యశోద కొడుకును జూడ వేడుకపడి గుంపులు గుంపులుగ నందగృహమ్మునకు

వచ్చిరి. ముదుసలి యాఁడువారు గూడఁ గఱ్ఱలఁ జేఁబూని బుజ్జిలాడించుకొనుచుఁ గుజ్జనిప్రక్కయొద్దకుఁ జేరి ముట్టుకొనకయే కుడిచేతులతో మేను నివిరినట్లు చాఁచి కణతల నెటికలు విఱిచి పడుచులం బిలిచి బాలునకు నీళ్ళుపోయుఁడని నుడివిరి. గొల్లపడఁతులు నుల్లమునఁ బెల్లుముదంబు గదుర జల్లనీటినిఁ గాచి నల్లసామినిఁ దల్లిసెజ్జనుండి తీసి వేడుకతో,

తే. గీ. పాపనికి నూనెఁ దల యంటి పసుపుఁ బూసి
బోరుకాడించి హరిరక్ష పొమ్మటంచు
జలములోకకొన్ని చుట్టిరాఁ జల్లి తొట్ల
నునిచి దీవించి పాడిరయ్యువిదలెల్ల.

క. జోజో కమలదళేక్షణ !
జోజో మృగరాజమధ్య ! జోజో కృష్ణా !
జోజో పల్లవ కరపద
జోజో పూర్ణేందువదన ! జోజో యనుచున్.

తఱువాత నందుండు నందనప్రాప్తుండగుట కమందానందంబునంది యనేక విప్రజనంబుల రావించి బహుమానంబుల నొసంగి కులమువారి నందఱను బిలచి భోజనసత్కారంబులఁ గావించి పుత్రునకుఁ గృష్ణుండను నామకరణంబు సేసి బాలునకును దల్లికిని నూత్నరత్నాభరణంబుల నొసంగి వేడుకలు గావించెను.

పూతన వ్రేపల్లె కేగుట

కంసుని పంపున బయలుదేఱిన రక్కసులు తాము సురమునిబ్రాహ్మణబృందంబుల నుక్కడంచుచు పసిబాలురను జంపుటకుఁ బూతనయను రాక్షసవనితను నియమించిరి. వికృతాకారయగు పూతన యమవుల యిండ్లలోఁగల పసిపాపలను దుదముట్టింపుచుఁ దుదకు వ్రేపల్లెకుఁ జేరెను. అట నందుని యింట నొక్క బాలకుం డుదయించె ననియు నాతఁడు విష్ణ్వవతారుఁ డనియు నతనిఁ దుదముట్టించుట కష్టసాధ్యమనియుఁ దెలిసికొని వానినిఁ గపటోపాయంబునఁ జంపఁదలంచి తానొక దివ్యస్త్రీవేషమును దాల్చి కొంతవిషమును జేతనిడికొని వ్రేపల్లెవాడలో నడుబాటవెంబడి నందునింటి కరుగుచుండెను. ఆ మాయాకాంత వీధి నడుచుచుఁ జూపఱు దృష్టుల నాకర్షించుచుఁ నందు నిల్లుసేరెను. అచ్చటఁ గోపికావనితలు కృష్ణుని శయ్య చుట్టును మూఁగి యాబాలుని వింతచెయ్వులఁ గాంచి యానందించుచుండిరి. పూతనయు నా స్త్రీ బృందమునఁ జొచ్చెను.

మ. సిరిమమ్ముల్ బ్రమకంగఁజూచుకొ అక్కై శృంగార వేషంబుతో
నరుదే నోపునటంచుగోపికలు జిహ్వాల్ రాక మోహించిత
త్పరలై చూడ లతాంగివోయికని యొంబర్యంకమధ్యంబునం
బరు భస్మానలతేజు దుర్జనవధప్రారంభకున్ డింభకున్
చూచి చేతితో నంటవచ్చు నమయంబున,

శా. ఆలంకేశ్వరుఁడా నిశాచర విభుం డాబాలగోపాలుఁడా
బాలధ్వంసిని గొంటుఁగంటిజేసి వెసన్ బోలెంత చందంబునం
బాలీగన్ విసమూని వచ్చుట మదిన్ భావించిలోనవ్వుచున్
గాలుంగేలు నెఱుంగకున్న కరణిం గన్మోడ్చి గుర్పెట్టెఁదాన్

మాయామానుష విగ్రహుండగు గోపబాలునిశక్తిఁ గనిపెట్టఁజాలక పూతన చేతులతో నా బాలు నెత్తి పాలు ద్రావు మని ముద్దులకవినట్లు నటింపుచు నక్కునఁ జేర్చుకొని యెను యశోదారోహిణులుగాంచి వలదని వారించినను వినక యా బాలుని తన విషప్రయుక్తములగు పాలు ద్రావు మని ప్రోత్సహించెను. అచటి స్త్రీలందఱును మోమోట పడి మిన్నకుండిరి. ఆ బాలుండు,

సీ. మేల్కొన్న తెఱఁగున మెల్లన కనువిచ్చి
క్రేగంటఁ జూచుచుఁ గిదికి నీల్గి
యావులించుచు జేతు లాదరంబునఁ జాఁచి
యొదికిలి మూకొన్న యోజనూఁది
బిగివక్షమును గేలఁ బీడించి కబళించి
గ్రుక్క గ్రుక్కకు గుటు గ్గుటుకు మనుచు
నొక రెండు గ్రుక్కల నువిదప్రాణంబులు
సైతముమేనిలో సత్త్వ మెల్లఁ
తే-గీ. ద్రావె నదియును గుండెలు దల్లడిల్ల
జిమ్మ దిరుగుచు నిలువక శిరము వ్రాల

నితరబాలుర క్రియవాఁడ వీవు గావు
చాలు విడువుము విడు మంచు నేలఁగూలె.

పూర్వదేహంబుతోఁ బూతన నేల గూలు సమయంబున దిక్కులు పిక్కటిల్లునట్లు పెద్ద మ్రోఁతగలిగెను. అచ్చటి గోపికలందఱు నచ్చెరువొంది యా ముక్కిడి రక్కసినిఁ గూర్చి భీతిల్లి దాని యురముపైఁ బ్రాఁకుచున్న బాలునిఁ గైకొని రక్షలిడి సెజ్జపైఁ బరుండ బెట్టిరి.

తృణావర్తుఁడు కృష్ణు నెత్తికొనిపోవుట.

తఱువాత నొకనాఁడు యశోద తనకొడుకునుదొడపై నిడికొని పాలుగుడుపుచుండ నంతకంత కతఁడు బరువై తల్లికి మోయుటకు భారము గలిగించెను. అట్లగుటకు యశోద కారణమును యోజించియుఁ దెలిసికొనఁజాలక మహాపురుషుఁడు గాఁబోలునని తలంచి యాతనిఁ గాళ్ళపయి నిడికొని భరింపఁ లేక చేతులం బట్టి యెత్తి బలవంతముగఁ గ్రిందఁబరుండబెట్టి యొండు పనిమీఁద లోనికిం బోయెను. ఇంతలో,

క. ఖరుఁడగు కంసుని పంపున
నరిగి తృణావర్తుఁ డవని కవచాటము గా
సురగరువలి యై బిసబిస
నరుదరుదన మునరి విసరి హరిఁ గొనిపోయెన్

ఆ సుడిగాలి వ్రేపల్లె యంతయును గ్రమ్మి యొకరి నొకరు చూచికొనుటకేని యవకాశము నొసంగక కన్నుల

నిండ దుమ్ముఁగొట్టెను. చెట్లనుగూల్చెను. పూరియిండ్ల కప్పులను దిరుగవేసెను పసుల మందల నాఁకుల పఱచెను. సూర్యరశ్మి సోకకుండ దిగంతరాళ మంతయు ధూళిచేఁ గప్పెను. భోజనపదార్థముల మట్టిలోఁ గలపెను. ఇట్లనేకములగు తెఱంగుల భూపరి పీడనంబును గావించుచున్న సుడిగాలి దానవుని మాయచేఁ గలిగినదని కృష్ణుండు గ్రహించెను. ఆ దానవుని మట్టుపెట్టుటకుఁ దగిన యుపాయము నాలోచించు చుండెను. ఆలోన దానవుఁడు మాయా వాయు రూపంబున నా బాలకు నెత్తికొని యాకసమునకుఁబోయెను. పసిబాలుండు రక్కసుని కంఠంబును రెండు చేతులతో గట్టిగఁ బట్టుకొని వ్రేలాడు చుండెను. కొంతవడికి నేలపై గాలి తగ్గి యాకసంబున వీచు చుండెను. యశోద పసికూనను విడిచి వచ్చితిమిగదా .యని తొందరగఁ బరుగెత్తుకొని వచ్చి చూచెను. బాలుండు గనఁబడఁడయ్యెను. బాలుండున్న చావడిలో గాలిచేఁబడినకసవుం దుడిచి వెదకెను. పాపఁడు లేడు. వాఁకిట నంతటను వెదకెను.

ఉ. పాపని జాడఁ గానక విపద్దశ నొంది కలంగి తల్లి యో
పాపఁడ బాలసూర్యనిభ బాలశిరోమణి నేఁడు గాలికిం
జేపడిపోయితే యనుచుఁ జీరుచు దైవముఁ జాలదూఱుచున్
దాపమునొంది నెవ్వగలఁ దయ్యుచు గ్రుయ్యుచు బిట్టుగూయుచున్.

ఉ. ఇక్కడఁ బెట్టితిం దనయుఁ డిక్కడనాడుచునుండె గాలిదా
నెక్కడ నుండివచ్చె శిశువెక్కడి మార్గము వట్టిపోయె నే

నెక్కడఁ జొత్తునంచు గమలేక్షణ గ్రేపుఁదొలంగిఖిన్నమై
పొక్కుచు వ్రాలుగోవుక్రియభూస్థలి వ్రాలెదురంతచింతమై

ఇట్లు నేలఁ బడి యేడ్చుచున్న గోపాలజనని దుఃఖంబును జూడఁజాలక గోపికావనితలు చుట్టును మూఁగి కన్నీరు మున్నీరుగాఁ గార్చుచు నేడువసాగిరి.

శా. ఆలోఁ జక్రసమీరదైత్యుఁడుమహాహంకారుఁడై మింటికిం
బాలుం దాఁగొనిపోయిపోయితుదిఁదద్భారంబుమోవంబల
శ్రీ లేమిం బరిశాంతవేగుఁ డగుచుం జేష్టింపఁగాలేక ము
న్నీలాగర్భకుఁ జూడనంచునిటమీఁదెట్లంచుఁజింతింపఁగన్.

దానవుని మెడనంటియున్న బాలుండు శైలంబువోలె నంతకంతకు బరువగుచుండ నిరాధారస్థలంబున నున్న తృణావర్తుండు,

క. హరికరతలపీడనమునఁ
బరవశుఁడై శాలమీఁద భగ్నాంగకుఁడై
సురవైరి భటుఁడు గూలెను
పురభంజనుకోలఁ గూలు పురముం బోలెన్

అపుడు గొల్లయిల్లాండ్రు దానవుని మెడ నంటియున్న బాలకునిఁ జూచి యేడుపులు మాని యాశ్చర్యము నందుచుండిరి. ఒక్క గోపిక జివ్వునఁబరుగెత్తి చనిబాలునిఁ జేతులతో నెత్తిన బెండు వలెఁ జులకనయ్యెను. వాని నాపె చంక నిడికొని కొనివచ్చి యశోదకుఁదద్వృత్తాంతము సెప్పి బాలు

నొసంగెను. తక్కు గోపాంగనలు ముక్కున వ్రేలిడికొని మొగంబుల వింతదోఁప నిట్లాడఁ దొడంగిరి.

మ. గతజన్మంబుల నేమి నోఁచితిమొ యా
గ్రశ్రేణు లేమేమి సే
సితిమో యెవ్వరి కేమిపెట్టితిమొ యే
చింతారతిం బ్రొద్దు పు
చ్చితిమో సత్యము లేమి వల్కితిమొ యే
సిద్ధప్రదేశమ్ముఁ ద్రొ
క్కితిమో యిప్పుడు సూడఁగంటిమిచటం
గృష్ణార్భకున్ నిర్భయున్.

అనిపలికిఁ పాపనికిఁ బీడానివృత్తికొఱకు బూదికొనటఁ బెట్టించి దీవించి నిజగృహంబుల కరిగిరి. ఇట్లు నందునియింట బలరామ కృష్ణులు క్రమాభివృద్ధిం గాంచుచుండిరి. కృష్ణుఁడు పదునాలుగేండ్ల వయసును గాంచినది మొదలు వ్రేపల్లెయందు దుడుకుఁదనంబులు సేయుచుం గొల్లల యిండ్లఁ దూఱి యల్లరి పనులం గావించుచు వారివెన్న పెరుగులను దొంగిలించుచు నుండెను. ఒక్క గోపికాంగన యశోదకడకు వచ్చి యిట్లని విన్నవించెను.

(కృష్ణుని దుడుకుఁజేఁతలు యశోదకుఁ గోపికలు సెప్పుట)

క. బాలురకు బాలు లేవని
బాలెంతలు మొఱలువెట్టఁ బకపక నగి యా

బాలుండాలము సేయుచు
నాలకు గ్రేవులను విడిచె నంభోజాక్షీ !

క. పడఁతీ ! నీ బిడ్డఁడు మా
కడవలలో నున్న మంచి కాఁగినపాలా
పడఁతులకుఁ బోసి చిక్కిన
కడవలఁ బో నడఁచె నాజ్ఞ గలదో లేదో.

క. మీ పాపఁడు మా గృహముల
నాపోవఁగఁ బాలు ద్రావ నగపడ కున్నం
గోపించి పిన్నపడుచుల
వాపోవఁగఁ జిమ్ముకొనుచు వచ్చెం దల్లీ.

క. ఆడం జని వీరల పెరుఁ
గోడక నీసుతుఁడు ద్రావి యొకయించుక తాఁ
గోడలి మూఁతిం దుడిచినఁ
గోడలు ముచ్చనుచు నత్త కొట్టె లతాంగీ !

క. నా రిల్లు సొచ్చి కడవలఁ
దోరంబగునెయ్యి ద్రావి తుది నా కడవల్
వీ రింట నీ సుతుం డిడ
వారికి వీరికిని దొడ్డ వా దయ్యె సతీ !

ఆ. వె. నమ్మనిదురవోవ నాపట్టి చుంచు మా
లేఁగతోఁకతోఁడ లీలఁ గట్టి
వీధు లందుఁ దోలె వెలఁది నీ కొమరుండు
రాచబిడ్డఁ డైన నవ్వ మేలె.

క. ఓయమ్మ నీ కుమారుఁడు
మాయిండ్లను బెరుఁగుఁ బాలు మన నీఁ డమ్మా !
పోయెద మెక్కడికైనను
మా యన్నల సురభులాన మంజులవాణీ !

అని నుడివిన గోపికల పలుకులు వినియుఁ యశోద కొడుకును గోపింపఁ జాలక,

తే. గీ. అన్యమెఱుఁగఁడు తనయంత నాడు చుండు
మంచివాఁ డీతఁ డెగ్గులు మానరమ్మ
రామలార త్రిలోకాభి రామలార
తల్లులార గుణవతీమతల్లులార !

అనుచు హాస్యోక్తుల వారినిఁ బరితృప్తలఁ జేసి యట్టు మాపుచుండెను.

సంపూర్ణము.

భాగవతకథాసారము.

కఠిన పదముల కర్థము.

అ

అపాండవము = పాండవ నాశనము.

అంగుష్ఠమాత్రశరీరుఁడు = బొటనవ్రేలంత దేహముగలవాఁడు

అవమానము = అమర్యాద

అనపత్యుండు = సంతానములేనివాఁడు

అరాజకంబు = రాజులేని రాజ్యము

అవలేపము = గర్వము

అయష్టవ్యం = యజ్ఞముచేయఁగూడదు

అదాతవ్యం = దానముచేయఁగూడదు

అహోతవ్యం = హోమముచేయఁగూడదు

అటన = తిరుగుట

అనిష్టము = ఇష్టములేకుండుట

అభ్యంజనాది = తలంటు మొదలైన

అహంకారమమకారములు = నేను, నాది, యను ప్రేమలు

అహంకారాహిదష్టుండవ్ = అహంకారమనుపాముచే గరువఁబడినవాఁడవు

అనాథకోటి = దిక్కులేనివారలసమూహము

అక్కున = రొమ్మున

అగ్నికీలలు = అగ్నిజ్వాలలు

అగ్రమహిషి = పెద్దభార్య (పట్టపుదేవి)

అర్గలంబు = అధికము

అయో, రజత, సువర్ణ మయంబులు=ఇనుము, వెండి, బంగారముల వికారములు
అభిజిన్ముహూర్తము=పగలు పదునాలుగడియలకు పైన రెండు గడియల కాలము
అభ్రగపతిన్=గరుత్మంతుని
అఘము=పాపము
అభిధానము=పేరు
అనురూపగుణాఢ్య=తగిన గుణములను బొందినది
అనిమిషనది=స్వర్గలోకగంగ
అమాత్యులన్=మంత్రులను
అవ్యక్తస్థితుఁడు=తెలుపలేనివాఁడు
అహి=పాము
అనిశంబు=ఎల్లప్పుడు
అశనార్థి=భోజనమును గోరువాఁడు
అంతర్హితుఁడు=మఱుగుపడినవాఁడు
అంభోధి=సముద్రము

ఆ

ఆహ్వానించెను=పిలిచెను
ఆపోవఁగన్=తృప్తికలుగునట్లు
ఆప్తులు=ఇష్టులు
ఆఁకలన్=చేలలయందు
ఆకట్టెన్=ఒనగూర్చెను
ఆదికాంతకీర్తి=దిక్కులతో నంతమొందుకీర్తి
ఆధులు=మనోవ్యధలు
ఆతపతప్తదేహి=ఎండచే దపింపఁజేయఁబడిన దేహముగలవాఁడు

ఆమ్నాయము = ఉపదేశము.
ఆయుశ్శేషంబు = మిగిలిన ఆయువు
ఆలము=ఉపేక్ష
ఆవిర్భవించి=పుట్టి
ఆటపట్టు=నివాసస్థానము.
ఆసనము=పీట
ఆసన్నంబు=సమీపించినది

ఇ

ఇచ్ఛా, విరోధ, భయంబులు=కోరిక, వైరము, భీతి
ఇలాతనూజ=భూపుత్రి (సీత)
ఇంతులు=స్త్రీలు
ఇందీవరవారము=నల్లగలువల సమూహము
ఇంద్రియానీకము=ఇంద్రియసమూహము
ఇంద్రారి=దేవేంద్రునకు శత్రువు; రావణాసురుఁడు
ఇషుశిఖి=బాణాగ్ని

ఈ

ఈరములు=పొదరిండ్లు

ఉ

ఉదరగోళము=కడుపులోనిప్రదేశము
ఉదాత్తధ్వనులన్=పెద్దకేకలచేత
ఉగ్రుఁడు=భయంకరుఁడు
ఉచ్చస్థానము=గొప్పచోటు
ఉన్మీలింపుము=వెకలింపుము
ఉన్నతంబు=ఎత్తు
ఉపసంహరించు=ఉడుపు

ఊంకువ=ఓలి(కన్యాశుల్కము)
ఉల్లంఘనంబు=మీరుట

ఐ

ఐక్యము=ఏకీభావము

ఓ

ఓదనము=అన్నము

ఔ

ఔదలల్=శిరంబులు

క

కలభంబుల్=ఏనుఁగుపిల్లలు
కతిపయసైన్యంబులు=కొన్ని సేనలు
కడి=ముద్ద
కరినగరంబు=హస్తినాపురము
కల్మషంబులు=పాపములు
కరవాలము=కత్తి
కరువలి=గాలి
కజ్జలంబు=కాటుక
కమఠమీన గ్రాహ దుర్వారమున్=తాఁబేళ్ళు, చేపల, మొసళ్ళ యొక్క దుష్టసమూహము గలది
కమండలువు=సన్యాసులయొద్ద నుండెడు గిండివంటిమట్టిపాత్ర
కమలేశుఁడు=లక్ష్మీభర్త
కట్టలుక=ఎక్కువ కోపము
కట్టడి=క్రూరుఁడు
కవచి=కవచమును ధరించినవాఁడు

కాంతారము=అడవి
కాలదూతలన్=యమదూతలను
కామినీమణులను=శ్రేష్ఠమైన స్త్రీలను
కారుణ్యము=దయ
కాళిందీనది=యమునానది
కిదికి=మూలిగి
కినుక=కోపము
కీలింపుము=నెలకొల్పుము
కుబ్జుండు=మఱుఁగుజ్జు
కుపుత్రుఁడు=దుర్మార్గపుఁగొమరుఁడు
కుహనోన్నతి=కపటాధిక్యము
కుడుచుట=భుజించుట
కుఠారి=గొడ్డలిగలవాఁడు
కుసుమావాసంబు=పుష్పమునన్ నివసించుట
కృపమాలి=దయలేక
కృశించి=చిక్కి
కేకులు=నెమళ్ళు
కేళించు=ఆడు
కేసరుల్=సింహములు
కైతవము=కపటము
కొమరు=మనోజ్ఞము
కోపారుణ నేత్రుఁడు=కోపముచే నెఱ్ఱనగు కన్నులుగలవాఁడు
కోలంబు=పంది
కండూతి=దురద
కంపన=వణుకు
కాంతాహేయము=స్త్రీలచే విడువఁబడఁదగినది.

కుంభినిన్ = భూమియందు
క్రతువులు = యజ్ఞములు
క్రొవ్వు = మదము
క్షుత్పీడ = ఆఁకలి బాధ
క్షమ = ఓర్పు
క్షుత్తృష్ణలు = ఆఁకలిదప్పులు

ఖ

ఖరతరభాషులన్ = అత్యంత తీక్ష్ణమైన మాటలుగలవారలను

గ

గజప్రాణావనోత్సాహి = ఏనుఁగు ప్రాణములను రక్షించుటయందుత్సాహము గలవాఁడు
గహనాంతమునన్ = అరణ్యమధ్యమందు
గిరిరాట్తనూజ = పార్వతీ దేవి
గురుతల్ప కల్మషము = గురుభార్యా స్నేహదోషము
గృహమేధి = గృహస్థుఁడు
గంధగజగమన = మదించిన యేనుఁగుకంటె నడక గలది
గాంధర్వ విధిన్ = భార్యా భర్తలు ప్రేమించి చేసికొనెడు వివాహ విధానముచేత
గ్రసించితిని = తింటిని

ఘ

ఘర్మాంబుజాలంబు = చెమటచుక్కల సమూహము
ఘ్రాణము = ముక్కు

చ

చకోరము = వెన్నెల పులుఁగు

చకితగోకులాగ్రజన్మరక్షణమున = భయపడిన గోవులను, బ్రాహ్మణులను రక్షించుటయందు

చక్రసమీరము = సుడిగాలి
చార్వాదు = చావఁగూడదు
చిబుకము = గడ్డము
చివ్వకు = కలహమునకు
చీరఁడు = పిలువఁడు
చెయ్వులు = పనులు
చోరహుతాశసర్పసంహతులను = దొంగ, నిప్పు పాముల వలనఁజచ్చువారిని
చౌలోపనయనాది = పుట్టువెండ్రుకలు దీయుట, ఉపనయనముఁ జేయుట మొదలైనవి.
చండమూర్తిన్ = మిక్కిలి కోపముగలవానివలె దోఁచుటచేత
చుంచు = చిన్న వెండ్రుకలు

జ

జడధారి = ముని
జరామరణంబులు = ముసలితనంబు, చావు
జలాశయంబు = మడువు
జననసంస్థితిసంహారంబులు = సృష్టిస్థితిలయములు
జలపూరితధరణీగగనసంధిన్ = నీటిచేనిండింపఁబడినభూమ్యాకాశములయొక్క మధ్యప్రదేశమును (సముద్రము)
జరన్ = ముసలితనమును
జలగ్రహము = తాఁబేలు,
జీమూతసంఘంబు = మేఘసమూహము
జీవనంబు = ఉదకము
జీవన్మృతుఁడు = బ్రదికియుండియుఁ జచ్చినవానితో సమానుఁడు.

జ్యేష్ఠుఁడు=పెద్దవాఁడు
జ్వరితార్తుఁడు=జ్వరముచే పీడింపఁబడినవాఁడు
జంకెలన్=బెదరింపులచేత

ఝ

ఝషంబు=చేప

డ

డాయు=దగ్గఱకు వెళ్ళు
డింభకులన్=పిల్లవాండ్రను

ఢ

ఢక్క=డంకా

త

తటము=ఒడ్డు
తలపోసి=ఆలోచించి
తపసి=ఋషి
తత్పరిసరవర్తులు = ఆ విష్ణుమూర్తి యొక్క సమీపమున నుండెడి వారలు.
తపనీయము=బంగారము
తక్షకఫణీంద్ర విషానల హేతిసంహతిన్=తక్షక సర్పము యొక్క విషాగ్నియను కత్తిచేఁ గొట్టఁబడుట చేత
తరుకోటరజనితవహ్ని=చెట్లతొఱ్ఱలయందు బుట్టిననిప్పు
తర్జని=చూపుడు వ్రేలు
తాఁడు=మఱుగువడేఁడు
తారుణ్యము=యౌవనము
తితిక్ష=ఓర్పు
తునిమెదను=తెగఁగొట్టెదను

తృణము=గడ్డి
తృణలతౌషధములు=గడ్డి, తీగెలు, ఔషధములు
త్రిలోకాభిరాములు=ముల్లోకములను రంజింపఁజేయువారు
తండంబులు=సమూహములు
తూలించిరి=చంపించిరి
త్యక్తకోపి=వదలి పెట్టఁబడిన కోపముగలవాఁడు
త్రిదివంబు = స్వర్గము

ద

దనుజమర్దనుఁడు=శ్రీకృష్ణుఁడు
దర్వి=గరిటె
దశముఖ ముఖకమలతుహినధామున్=రావణుని ముఖపద్మమునకు చంద్రుని వంటివానిని (శత్రువు)
దిగంతరాళము=దిక్కుల లోపలిభాగము
దిగంబరులు=వస్త్రవిహీనులు
దివిజులు=దేవతలు
దుస్సాధ్యము=కష్టతరము
దేవేరి=దొరసాని
దోధూయమానము=పరితపింపఁజేయఁబడినది
దోశ్శక్తిన్=భుజబలముచేత
ద్వేషించి=విరోధపడి
ద్విషదసాధ్యన్=శత్రువులకు సాధ్యముకాని వానిని
దండ్యవు=శిక్షకుఁబాత్రవు

ధ

ధనహీనుఁడు=దరిద్రుఁడు
ధూర్తత్వము=మోసము
ధ్రువపఱచి=నిశ్చయము చేసి

న

నయనాంభఃకణజాలము=కన్నీటిసమూహము

నవఫుల్లాంభోజకల్హారముక్=నూతనముగా వికసించిన పద్మములును. ఎఱ్ఱగలువలును గలదానిని

నవనవభ్రూపర్యటత్కుంతలక్=క్రొత్తక్రొత్తగా కనుబొమ్మపైఁ బడుచున్న ముంగురులు గలదానిని

నావ=ఓడ

నాకము=స్వర్గము

నిరాహారుండు=ఆహారమును వదలిపెట్టినవాఁడు

నిమ్నోన్నతము=లోతు మెరకలు

నిర్ధూతప్రయత్నులు=విఫలయత్నము గలవారు

నిర్లజ్జ=సిగ్గులేకుండుట

నిర్జరవరుల్=దేవతాశ్రేష్ఠులు

నిస్సారంబు=సారములేనిది

నిర్జరమాతృగర్భంబున=దేవతల తల్లికడుపున

నిరంబరులు=వస్త్రములు లేనివారలు

నితాంతము=మిక్కిలి

నిష్కరుణుఁడు=దయలేనివాఁడు

నిర్మూలంబు=నాశనము

నీరాహారుఁడు=ఉదకమును భక్షించువాఁడు

నీల్గి=ఒడలు విరిచికొని

నుతి=స్తోత్రము

నృహరి=నృసింహము

నెఱయు=ఒప్పు

నెయ్యంబు=సంతోషము

నేత్రపర్వంబు=కన్నులపండువు

నేత=రాజు

నొలియదు=నొప్పిపుట్టదు

ప

పర్ణాహారుఁడు=ఆకులనుదినువాఁడు

పరిపీడనము=బాధ

పరిమార్చుటకు=చంపుటకు

పతికళేబరము=భర్తృశవము

పతితుఁడు=పదవిఁ జెడినవాఁడు

పదత్రయహీనున్=మూఁడు కాళ్ళు లోపించిన పశువును

పథంబులు=మార్గములు

పంచశరద్వయస్కుఁడవు=ఐదుసంవత్సరముల యీఁడుగలవాఁడవు

పవనకుంభిత చర్మభస్త్రి=గాలిచే నిండింపఁబడిన చర్మపుతిత్తి

పలుకుటమ్ములు=బాణములవంటి వాక్యములు

పద్మగర్భునకు=బ్రహ్మకు

పరిసర్పణము=ప్రదక్షిణము

పజ్జ=సమీపము

ప్రభంజనము=గాలి

పద్మదళాక్షునిన్=తామరరేకులవంటి కన్నులుగలవానిని (కృష్ణుఁడు)

పార్థసారథి=అర్జునుని రథమునుతోలువాఁడు (కృష్ణుఁడు)

పాయసము=పరమాన్నము

పాపాటవులు=పాపమనునడవులు

పామరులు=మూఢులు

పాఱుఁడు=పరుగెత్తుఁడు

పాహిపాహియని=రక్షించురక్షించుమని

పాఁపపేరులు=నాగాభరణములు

పారణము=ఉపవాసముండి మఱునాఁడు చేయు భోజనము

పాఠీనము=చేఁప

పాణిగ్రహణంబు=చేయిపట్టుకొనుట

పాపఁడు=పిల్లవాఁడు

పాత్రిలన్=యోగ్యులైనవారిని

పానీయము=మంచినీళ్ళు

పిన్నవు=చిన్నవాఁడవు

పిపాసార్తి=దాహపుబాధ

పీడించి=బాధఁబెట్టి

పుత్రశూన్యుఁడవు=పిల్లలు లేనివాఁడవు

పురవరంబు=శ్రేష్ఠమైన పట్టణము

పున్నామనరకోత్తారణకారణుండు=పున్నామ మనెడి నరకమునుండి దాటించుటకు కారణుఁడైనవాఁడు (కొడుకు)

పుట్టంబులు=వలువలు

పుత్త్రకామేష్టి=కొడుకులను బడయుటకుఁ జేయు యజ్ఞము

పూర్వస్మృతిన్=పూర్వజ్ఞానముచేత

పూర్వవాహిని=తూర్పునకుఁ బ్రవహించునది

పూతంబు= పవిత్రమైనది

పృథ్వీవ్యోమంబులు=భూమ్యాకాశంబులు

పెన్నిధిగన్న పేదవోలె=ధనమునుజూచిన దరిద్రునివిధముగా

ప్రేరణము=ప్రోత్సాహము

పొడసూపన్=కనుపింపఁగా

పోరచి=కానుక

పంకేజము=తామరపూవు

పాండవమధ్యముఁడు=అర్జునుఁడు

పొంపిరిపోయి=సంతోషించి

ప్రణవంబు=ఓంకారము

ప్రత్యక్షమై=సాక్షాత్కరించి

ప్రభంజనము=వాయువు

ప్రతిపక్షుండవు=శత్రువవు

ప్రక్షీణులన్=మిక్కిలి క్షీణించినవారలను

ప్రస్ఫీతి=మిక్కిలి వృద్ధిబొందినది

ప్రస్వేదము=ఎక్కువచెమట

ప్రాణవిత్తమానభంగమందు = ప్రాణముయొక్క, ధనముయొక్క మానముయొక్క నాశమందు

ఫ

ఫలీకారము=ఫలమునిచ్చుట

ఫాలనేత్రునకు=ఈశ్వరునకు

బ

బహుళపక్ష శీతభానుపగిది=కృష్ణపక్షచంద్రునిమాదిరి

బలిదైత్యుఁడు=బలి యను రాక్షసుఁడు

బాణానలతప్తదేహుఁడు = శరాగ్నిచేత తపింపఁ జేయఁబడిన శరీరము గలవాఁడు

బాల్యప్రాయము=చిన్నవయస్సు

బీజములు=విత్తనములు

బుద్బుదము=నురుగు

బుభుక్ష=ఆకలి

బూది=భస్మము

బెగడున్=భయపడును

బంధునింద్యము=చుట్టములచే నిందింపఁబడదగినది

బెండువడుఁగా = బలహీనతనొందును

బొంకవచ్చుఁగా = అబద్ధమాడవచ్చును

బ్రహ్మవిదుని = బ్రహ్మజ్ఞానముగలవానిని

భ

భక్తక్లేశనాశంకరుఁడు = భక్తుల యొక్క దుఃఖములు బోఁగొట్టు వాఁడు

భర్తృవియోగము = మగనికెడబాటు

భావికాలజ్ఞాత్రి = భవిష్యత్కాలము నెఱిఁగినది

భావుకుని = బావను

భూతి = సంపద

భూమిభృత్సన్నాహంబు = రాజప్రయత్నము

భృత్యునిపగిదిఁగా = దాసునిమాదిరిగా

మ

మతల్లులు = శ్రేష్ఠలు

మత్సరగ్రస్తుఁడై = క్రోధముచే నావరింపఁబడినవాఁడు

మదనాగసమితి = మదించిన యేనుఁగులగుంపు

మరుత్పతిభోగము = ఇంద్రభోగము

మథియించు = తఱచు

మధుపంబు = తుమ్మెద

మహార్ణవంబు = సముద్రము

మహిషి = పట్టపుదేవి

మహిళలు = స్త్రీలు

మద్గురుండు = నాతండ్రి

మధురాంబువులు = తియ్యనినీళ్ళు

మద్భుజసనాథక్షోణి = నాభుజముల యాధిపత్యముగలభూమి

మానసపుత్త్రులు = మనస్సంకల్పముచేఁ బుట్టినకొమరులు

మార్జనము = ఊడ్చుట

మాకందములు = మామిడిగున్నలు

మిథునము = భార్యాభర్తలు

మీన = చేప

ముక్తమానసదంభకులకున్ = వదలి పెట్టఁబడిన మనోదంబముగల వారలకు

ముచ్చిరి = దుఃఖమునొంది

మూఁకలు = సమూహములు

మృతోరగము = చచ్చినపాము

మృత్యువులేని జీవనము = చావులేని బ్రతుకు

మృగాజినము = జింకతోలు

మృగలాంఛనుఁడు = చంద్రుఁడు

మృగయాతురుఁడు = వేఁటయందు తొందరగలవాఁడు

మృగయులు = బోయవారలు

మృగరాజు = సింహము

మృతకళేబరము = శవము

మొదవు = ఆవు

మోహజలధి = మోహమను సముద్రము

మందస్మితులు = చిఱునగవు గలవారు

మంథానము = కవ్వము

మంజురంభాకాండాంచితశాల = మనోజ్ఞమైన యరటి కంబములతో నొప్పుచున్న గృహము

ముండీభూతులు = తలబోడిగానైన వారలు

మ్రోల = ఎదుట

య

యూథంబు = సమూహము

ర

రజితగిరి=వెండికొండ

రణవిజయ సాధకంబులు=యుద్ధమందు జయమును సాధించునవి

రసన=నాలుక

రమాకాంతుఁడు=లక్ష్మీభర్త (విష్ణువు)

రమాధినాథసల్లాపసుఖారంభకులన్=విష్ణుమూర్తితో పరస్పర సంభాషణమువలని సుఖమునకుఁ బ్రారంభకులైన వారలను

రాయంచ=రాజహంస

రుధిరము=రక్తము

రోష, నిద్ర, జాగరణలు=కోపము, నిద్ర, మేలుకొన

ల

లబ్ధజ్ఞానుండు=పొందఁబడిన జ్ఞానముఁగలవాఁడు

లతానికుంజములు=పొదరిండ్లు

లలాటోగ్రాక్షుచాపంబు=నొసలియందు తీక్ష్ణమైన నేత్రముగల (శివుఁడు) వాని విల్లు

లుబ్ధకవృత్తి=బోయవాని వ్యాపారము

వ

వగచుచు=విచారపడుచు

వల్లభ=భార్య

వత్సంబు=దూడ

వరేణ్యుఁడు=శ్రేష్ఠుఁడు

వలకేలన్=కుడిచేతియందు

వానప్రస్థము=అడవియందుండుట

వాయుభక్షకుఁడు=గాలిని భుజించువాఁడు

వాఁతన్=నోటను

వామాంకము=ఎడమతొడ

వారిప్రచారోత్తమున్=నీటిలో సంచరించు దానిని (మొసలి)

వారిజాక్షులందు=స్త్రీలయెడ

వారితానేకదుస్తరవంశవ్యథుఁడు = నివారించబడిన విశేషములైన శక్యముగాని వంశముయొక్క దుఃఖముగలవాఁడు

విప్రబాణవేదన=బ్రాహ్మణశరమువలని బాధ

విశ్వమున=ప్రపంచమున

విలపించుచుండెను=దుఃఖించుచుండెను

విషమగమనము=వంకరనడక

విస్మయము=ఆశ్చర్యము

వివేకము=తెలివి

విషధి=సముద్రము

విద్యుద్దీపము=మెఱుపుదివ్వె

విముఖులు=వెనుకకుఁ దిరిగినవారలు

వృషభరూపము=ఎద్దాకారము

వృష్టి=వర్షము

వేదండకోటి=ఏనుఁగులసమూహము

వైళంబ=శీఘ్రముగ

వైవాహికమునందు=వివాహవిషయములందు

వందురన్=దుఃఖించునట్లుగా

వాంఛలను=కోరికలను

విందు=అతిథి

వ్యాధులు=రోగములు

శ

శమదమాదులు=ఓర్పు, ఇంద్రియనిగ్రహము మొదలయినవి

శపథంబు=ప్రతిజ్ఞ

శాసించెదన్=శిక్షించెదను

శార్ఙ్గకోదండచింతనాంజనము=విష్ణుధ్యానమను కాటుక

శాసించెను=ఆజ్ఞాపించెను

శిబిరము=డేరా

శిబికారోహణము=పల్లకి నెక్కుట

శుంఠలు=మూఢులు

శూలంబు=కోల

శృంగిశాపచోదితుఁడు=శృంగిశాపమువలన నడుపఁబడినవాఁడు

శేషశాయి=పాము పాన్పుగా గలవాఁడు (విష్ణువు)

శేముషి=బుద్ధి

శ్రాంతి=అలసట

శ్రీధరుని కూర్మిదాసులు=విష్ణుప్రియసేవకులు

స

సకల విద్యా పారంగతుఁడు = సమస్తవిద్యలను దుదముట్టఁ జదివిన వాఁడు

సత్యైకపాదుండు=సత్యమను నొక్క కాలుగలవాఁడు

సహేంద్రతక్షకాయ=ఇంద్రునితోఁగూడ తక్షకుని బిలువుమా

సక్రోధ=క్రోధముతోఁగూడుకొన్నది

సరిత్పతి=సముద్రుఁడు

సలిలభక్షణంబు=ఉదకమునుద్రావుట

సహగమనము=భార్య భర్తతోఁ జితినొందుట

సామయాము=సగము

సామేన=సగముశరీరమందు

సారథి=రథమునడుపువాఁడు

సిరి=కలిమి

సుమహైశ్వర్యోదయము=మంచి గొప్పయైశ్వర్యము గలుగుట

సుధాకరుండు=చంద్రుఁడు

సురభులాన=ఆవులతోడు

సుక్షేత్రము=మంచిపొలము

సౌధాగ్రభాగంబు=మేడ పైభాగము

సంకల్పించెను=ప్రయత్నించెను

సంజాత=పుట్టినది

సంభాషణములు=మాటలు

స్థానభ్రంశము=ఉన్నచోటు విడుచుట

స్థౌల్య, కార్శ్యంబులు=బలియుట, చిక్కుట

స్రుక్కించుట=అలసటపెట్టుట

హ

హతంబులయ్యెను=చచ్చెను

హరిణపోతంబు=లేడి

హాలికుఁడు=దున్నెడువాఁడు

హయము=గుఱ్ఱము

హాలాహలము=విషము

హృచ్చింత=మనోవ్యథ

హేతి=ఖడ్గము

సంపూర్ణము.

35 వ పుటలో:—ఆయాతములు = గొప్పవి, ఐన = అయినట్టి, పాపనివహంబులన్ = పాపసమూహములను, ప్రఖ్యాతమతిన్ = ప్రసిద్ధమైన మనసుతో, మహామరణకాలమునన్ = మిక్కిలి యవసాన సమయమందు, హరి = విష్ణువుయొక్క, పుణ్యనామ = పవిత్రమగు, పేరునందు, సంభూత = కలిగియున్న, సుధామయ = అమృతముతోఁ గూడినట్టియు, అద్భుత = వింతయగు, విభూతి = ఐశ్వర్యమును, కర = కలిగించునట్టియు, అక్షర = వర్ణములయొక్క, సంగ్రహంబునన్ = కూడికచేత, పాఱఁద్రోలెన్ = పోఁగొట్టెను.

36 వ. పుటలో:—అనేక = సంఖ్యకుమిగిలిన, బ్రహ్మహత్యా = బ్రాహ్మణవధయను నేరము, పాపాటవులకు = పాపవనములకు, హరినామకీర్తనములు = విష్ణునామమును స్మరించుటలు, అగ్నికీలలు = నిప్పుసెగలవంటివి. గురుతల్పకల్మష = గురువుభార్యకు ద్రోహము సేయు పాపము నేడు, క్రూరసర్పములకు, హరి...లు కేకులు = నెమళులవంటివి, తపనీయచౌర్య = బంగారమును దొంగిలించుటయను, అఘతమసంబునకు = పాపమనెడు చీఁకటికి, హరి...లు సూర్యకిరణముల్ = సూర్యునికిరణములవంటివి, మధుపానకిల్బిష = కల్లుద్రాగిన పాపమనెడు, మదనాగసతికి = మదించిన యేనుఁగుల సమూహమునకు

హరి...లు, కేసరుల్ = సింగములవంటివి, మహిత = గొప్పదైన యోగ = యోగసంబంధమగు, ఉగ్ర = తీవ్రమైనట్టియు, నిత్య = ఎడతెగనట్టియు, సమాధినిష్ఠన్ = నియమము గలిగిన పనుల యందు అలరు = ప్రకాశించెడు, బ్రహ్మాదిసురలకు = బ్రహ్మ మొదలగు దేవతలకు, హరి...లు, అందరాని = చేకొనుటకు శక్యము కాని, భూరి = గొప్పదగు, నిర్వాణ = ముక్తియనెడు, సామ్రాజ్య = ఐశ్వర్యముయొక్క, భోగ = అనుభవములు, భాగ్య = లక్ష్మితో, ఖేలనంబులు = ఆటలు.

43 వ. పుటలో: — అవిద్యాధరభర్త = అవిద్యాధరులరాజు, హర = శంకరుని, నీహార = మంచును, అమృత = శుభమను, హాసమున్ = నవ్వునట్టిదియు శ్రీ = ఐశ్వర్యముచేత, విభ్రాజితమున్ = ప్రకాశించుచున్నట్టిదియు, నిరస్త = నిత్యమగు, గిరిజా = పార్వతియొక్క, సేవా = అర్చనమువలన, గతాయాసమున్ = పోఁగొట్టఁబడిన యాయాసము గలట్టియు, దేవానీక = దేవసమూహమునకు, వికాసమున్ = సంతోషముఁ గలిగించునట్టిదియు, శుభమైన, మహాదేవ = శంకరునియొక్క, అంఘ్రి = పాదములకు, సంవాసమున్ = నిలయమైనట్టిదియు, భూవిఖ్యాత = భూమియందు పొగడ్తకెక్కిన, విలాసమున్ = విలాసముగలట్టిదియు, త్రిభువనీపూతంబు = ముల్లోకములను బవిత్రము సేయునట్టిదియు (అగు) కైలాసమున్ = కైలాసమును, కాంచెన్ = చూచెను.

45 వ పుటలో:—డింభకులన్ = బాలురను, అనర్గళ = అడ్డులేని, విస్రంభకులన్ = నమ్మకముగలవారిని. రమాధినాథ = విష్ణువుయొక్క, సల్లాప = గోష్ఠివలని, సుఖ = సుఖముచేత, ఆరంభకులన్ = గర్వించినవారిని, ముక్త = విడువఁబడిన, మానస = మనస్సునందలి. దంభకులన్ = కపటముగలవారిని, మునులన్ = మునులగు సనకసనందనులను చొరగనీక = చొరఁబడనీయక, తఱిమిరి = వెడలగొట్టిరి.

46 వ పుటలో:— వాగ్దేవీమనోనేతకున్ = సరస్వతి ప్రాణేశ్వరునకు సవిశేషోత్సవ సంవిధాతకున్ = గొప్పదగు కోరికలతోఁ గూడిన, ఫలమును గూర్చువానికి. సమత్సంతాత్రితకున్ = సుఖమును గూర్చెడువానికి, సత్తపోనివహాభీష్టవరప్రదాతకున్ = గొప్పతాపసుల సమూహముయొక్క కోరికలు తీరునట్లు వరములిచ్చువానికి, జగన్నిర్మాతకున్ = ప్రపంచమును సృష్టించినవానికి, ధాతకున్ = బ్రహ్మదేవునకు, వివిధ = సమస్తమైన, ప్రాణి = జీవులయొక్క, లలాట =

నొసటియందు, లేఖన = వ్రాయుటమూలముగ, మహావిద్య = గొప్ప జ్ఞానమును, అనుసంధాతకున్ = కూర్చెడు వానికి, దివిజానీకవిరోధి = దేవసమూహమునకు విరోధియైన (హిరణ్యకశిపుడు) వాఁడు, మ్రొక్కెను = నమస్కరించెను.

50 వ పుటలో:..వినతగుణశీల=మంచి గుణములుగలవాఁడా! మాటలు వేయు నేల? మందార = మందారపుష్పమునందలి, మకరంద = తేనెయొక్క, మాధుర్యమున్ = తీపియందు, తేలు = ఓలలాడునట్టి, మధుపంబు = తుమ్మెద, మదనములకున్ = ఉమ్మెత్తపూవుల కొఱకు, పోవునే = వెళ్ళునా? నిర్మల = మురికిలేని, మందాకిని = గంగయొక్క, వీచికలన్ = అలలయందు, తూఁగు = తిరుగునట్టి, రాయంచ = రాజహంస, తరంగిణులకు = నదులకు, చనునె = పోవునా?, లలిత = మృదువైన, రసాలపల్లవ = మామిడి యిగుళ్ళను ఖాది = తినునట్టిది, ఔ = అగు, కోయిల, కుటజములకున్ = కొండ మల్లెపూవులకడకు, చేరునే = వెళ్ళునా? పూర్ణేందు = పూర్ణచంద్రుని యొక్క, చంద్రిక = వెన్నెలను, స్ఫురిత = ముద్దుగొనునట్టి, చకోరకము = వెన్నెలపులుగు, సాంద్రనీహారములకున్ = దట్టమగు మంచులకడకు, అరుగునే = పోవునే? అంబుజోదర = విష్ణువుయొక్క, దివ్యపాదారవింద = శ్రేష్ఠములగు పాదకమలములను, చింతన = ధ్యానించుటయను, అమృతపాన = తేనెను త్రాఁగుటచేత, విశేషమత్త = మిక్కిలిమదించిన, చిత్తము = మనసు, ఇతరంబున్ = మఱియొకదానిని, ఏరీతిన్ = ఎట్లు, చేర నేర్చున్ = చేరఁగలదు.

53 వ పుటలో:—సంసార జీమూతసంఘంబు = సంసారమను మేఘముల గుంపు, చక్రిదాస్య ప్రభంజనము = విష్ణుసేవయను గాలి, లేక, విచ్చునే = విడునా! తాపత్రయ = (ఆధ్యాత్మికము, అధిభౌతికము అధిదైవికములను) మూఁడు తాపములనెడు, అఖిలదావాగ్నులు =

భయంకరమగు కాఱుచిచ్చులు, విష్ణుసేవామృతవృష్టి = విష్ణుసేవయను అమృతవర్షము, లేక, ఆఱునే = చల్లాఱునా? సర్వంకషాఘౌఘజలరాసుల = ఘోరములగు పాపసమూహములను సముద్రములు, హరిమనీషాబడబాగ్ని = విష్ణుధ్యానమను సముద్రములోని నిప్పు, లేక ఇంకునే? ఘనవిపద్గాఢాంధకారము = గొప్పయాపదలను కాఱుచీఁకటులు, పద్మాక్షనుతి రవిప్రభలు = విష్ణుధ్యానమను సూర్యకాంతులు, లేక, అడఁగునే = పోవునా? నిరుపమాన = సాటిలేని, పునరావృత్తి నిష్కళంకముక్తి = మఱుపుట్టుకలేని యచ్చపుముక్తియను, నిధి = ధనమును, ముఖ్యమైన, శార్ఙ్గకోదండ చింతనాంజనము = విష్ణుస్మరణమను కాటుక, లేక, కానవచ్చునే = కనఁబడునా?

[illegible] వ పుటలో:—అట = అచ్చట, కరణీవిభుండు = గజరాజు, నవఫుల్లాంభోజకల్హారమున్ = క్రొత్తగవిచ్చిన తామరలు, ఎఱ్ఱగలువలుఁ గలట్టియు, నటదిందీవరవారమున్ = నటించుచున్న నల్లగలువల సమూహము గలట్టియు, కమఠమీనగ్రాహ దుర్వారమున్ = తాఁబేళ్ళు, చేఁపలు మొసళులుగల దుష్ట సమూహము గలట్టియు, వట = మఱ్ఱి, హింతాల = గిరుకతాడి, రసాలసాల = తియ్యమామిడి, చెట్లతోడను సుమనోవల్లికుటీ = పూలతీవల పొదలతోడను గూడిన, తీరమున్ = ఒడ్డు గలట్టియు, చటులోద్ధూతమరాళ చక్రబక సంచారమున్ = లేవఁ గొట్టఁబడిన హంసలు చక్రవాకములు కొంగలయొక్క సంచారముఁ గలట్టియు, కాసారమున్ = మడుగును, కాంచెన్ = చూచెను.

109 వ పుటలో:—కాంతాహేయము = స్త్రీలసహ్యించు కొనునట్టిదియు, బంధునింద్యము = చుట్టములచే నిందింపఁబడునట్టిదియు, కండూతి మిశ్రంబు = దురదతోఁ గూడినట్టిదియు, హృచ్చింతా మూలము = మనోదుఃఖమునకు హేతువైనదియు, పీనసాన్వితము = పడిశము కాఱుచుండునట్టిదియు, ప్రస్వేద = మిక్కిలి చెమ్మట, వ్రణ = కురుపులు,

అకంపన = వణఁకు, క్రాంతి=చాలి, స్ఫోటక = పొక్కులతో, యుక్తము= కూడియున్నట్టిదియు, అగు ముదిమిని, వాంఛన్ = ఇష్టములతో, తాల్చి, నానాసుఖోపాశంబు = అన్ని సుఖములకు మూలము, అయిన, వయోనిధానమున్=వయసను ధనమును,

113 వ పుటలో:—కురుతర=గొప్పవగు, క్రాంత=ఆయాసమును బొందిన, అహీ యుగళంబులకున్ = పాముజంటలకు,... దారిన్ = మార్గమున, ఉందురు దంపతులకున్=ఎలుకజంటకు, మార్జాల మల్లములు=పిల్లిజెట్టీలు.

నీరజనివాసాంత ప్రదేశంబునన్ = కమలము లుండెడి తావుల యందు, మాకందములనీడన్ = మామిడిచెట్లనీడను, కల్పలతికామధ్యంబునన్ = పారిజాతముల మధ్యను మంజురంభాకాండాంచిత శాలలోన్=మనోజ్ఞములగుఅరటికంబములతో నొప్పుచున్న యింటిలో కుసుమసంపన్నస్థలిన్=పుష్పములు సమృద్ధిగాఁ గలచోటున, నవనవ భ్రూపర్యటత్కుంతలన్=క్రొత్త క్రొత్తగ కనుబొమ్మలపై నాడుచున్న ముంగురులు గలదానిని.

రామా అండ్ కో ప్రచురములు.

కథారామాయణము	అప్పుడు	0	6	0
రామాయణ సారము	డిటో	0	8	0
పరశురామునిచరిత్ర		0	10	0
భారతసారము	డిటో	0	12	0
భాగవత కథాసారము	డిటో	0	12	0
ఉత్తర రామాయణసారము	డిటో	0	10	0
కర్ణుని చరిత్రము		0	10	0
భీష్మచరిత్రము		0	10	0
ఉపాఖ్యాన రత్నావళి-క్రొత్త 3-4 తరగతులకు		0	8	0
శిశుతరగతి నాటకములకథలు క్రొత్త ౦వతరగతి		0	2	0
మొదటితరగతి	డిటో క్రొత్త ౧వ ,,	0	2	6
రెండవతరగతి	డిటో క్రొత్త ౩వ ,,	0	3	0
మూడవతరగతి	డిటో క్రొత్త ౪వ ,,	0	4	0
నాల్గవతరగతి	డిటో క్రొత్త ౫వ ,,	0	5	0
లోకజ్ఞానము	క్రొత్త ౧వ తరగతి	0	3	0
డిటో	క్రొత్త ౩వ తరగతి	0	4	0
డిటో	క్రొత్త ౪వ తరగతి	0	5	0
అన్నిజిల్లాలభూగోళములు ఒక్కొకటి	...	0	4	0
హిందూదేశచరిత్ర	క్రొత్త ౪వ తరగతి	0	4	0
సివిక్సుమాన్యువలు	4, 5 తరగతులకు	0	8	0
నీతికథామంజరి	2-3-4-5 తరగతులకు	0	2	0

వలయువారు:—రామా అండ్ కో, ఏలూరు.

వెంకటరాం అండ్ కో, బెజవాడ.

END OF
TITLE